Crime News
ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

శనివారం, మే 30, 2026 | సంపుటి - 20 | సంచిక 251 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## 200 ఇంటర్‌సిటీ రైళ్ల తయారీకి రంగం సిద్ధం

**కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్**

**ప్రధాని మోడీ, మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కిషన్ రెడ్డి కృతజ్ఞతలు**



హైదరాబాద్ : కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు 200 ఇంటర్‌సిటీ రైళ్ల తయారీ బాధ్యతను ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అప్పగించడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నిరంతర సహకారం అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. 2లో

# తెలంగాణలో అంచనాను మించి ధాన్యం ఉత్పత్తి

## అయిన చివరి గింజ వరకు కొంటూనే ఉన్నాం

- తడిసిన ధాన్యం సైతం కొని రైతులను ఆదుకున్నాం
- అదనపు కొనుగోళ్లకు రూ.16,479 కోట్లు ఖర్చు చేశాం
- మీడియా సమావేశంలో మంత్రులు వెల్లడి



హైదరాబాద్ : దేశంలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని ఈ మాట కేంద్రమే చెప్పిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గతంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొనుగోళ్ల కంటే ఇప్పుడు ఎక్కువ కొంటున్నాం అన్నారు. సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు పాటిస్తూ చెప్పిన దానికంటే అదనంగా కొనుగోలు చేశాం అన్నారు. . దీనికోసం రూ.16,479 కోట్లు ఖర్చు చేశాం. 2లో

## ఈసెట్ ఫలితాలు విడుదల

### వెబ్‌సైట్‌లో అందుబాటులోకి ఫలితాలు



హైదరాబాద్ : తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల అయ్యాయి. మాసాబ్ ట్యాంక్ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో శుక్రవారం ఉన్నత విద్యా మండలి చైర్మన్, ప్రొఫెసర్ బాలక్రిష్ణ రెడ్డి ఫలితాలను విడుదల చేశారు. తరువాయి 2లో



## క్యూర్ పరిధిలో పేదలు సంతృప్తి చెందేలా ఇళ్ల డిజైన్

**భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

హైదరాబాద్ : పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు సౌకర్యవంతమైన, భద్రమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. పట్టణాల్లో జీవించే పేదవాడికి తన జీవనోపాధికి ఇబ్బంది లేకుండా గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్‌కు అనుగుణంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలోని 24 నియోజక వర్గాల్లో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి తరువాయి 2లో



## సెక్స్ వర్కర్లపై దాడులు సరికాదు

**వారు కూడా మనుషులే అని గుర్తించాలి**

**లైంగిక వృత్తిలో ఉన్నవారికి ఆధార్ కార్డులు ఇవ్వాలి**

**సుప్రీం కోర్టు స్పష్టీకరణ**

## నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది

- యూపిపిఎస్సిని చూసి నేర్చుకోండి
- విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనకు బాధ్యులెవరు
- నీట్ పేపర్ లీక్‌పై మరోమారు సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ : నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ వివాదంపై సుప్రీం కోర్టు మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తరువాయి 2లో




## రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం

**జూన్ 2న అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలి**

**31న కార్మికులందరూ డిమాండ్ డేను పాటించాలి**

**కార్మికులకు ఆర్టీసీ జేఏసీ నాయకులు పిలుపు**

హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం కోసం జూన్ 2న అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న కార్మికులందరూ డిమాండ్ దేను తరువాయి 2లో

## గురుకులాల్లో సీట్ల భర్తీకి భారీ స్పందన



**ఫేజ్-1లోనే 18,401 సీట్లు భర్తీ**

**అణగారిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య**

**సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యం**

**సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

హైదరాబాద్ : తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి సైనిక పాఠశాలలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, నాన్-సీఓఈ మరియు ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను శుక్రవారం డా.బి . అర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విడుదల చేశారు. సందర్భంగా మంత్రి అడ్లురి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యను సామాజిక మార్పుకు ప్రధాన సాధనంగా భావిస్తూ పేద, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను పూర్తిగా ఉచితంగా తరువాయి 2లో

## ఆయిల్ పామ్ అమలులో తెలంగాణ అగ్రస్థానం

**సాగులో తెలంగాణ వాటా 36 శాతంగా నమోదు**

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



హైదరాబాద్ : ఆయిల్ మిషన్ ఆన్ ఎడిబిల్ ఆయిల్- ఆయిల్ పామ్ అమలులో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో సాధించిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. జాతీయ ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ వాటా 36 శాతంగా నమోదయిందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ.. 2021-2026 మధ్య దేశంలో 2.73 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు అయిందని తెలిపారు. అందులో 98,112 హెక్టార్లతో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ రైతుల కృషితోనే ఈ అగ్రస్థానం సాధించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం1.16 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని చెప్పారు. 79,448 మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని ఆయన గణాంకాలతో సహా వివరించారు. రైతులకు ఎకరాకు రూ.2 నుంచి 3 లక్షల వార్షిక ఆదాయం అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తుందన్నారు. తరువాయి 2లో

## కాలుష్య రహితంగా గోదావరి పుష్కరాలు


**కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి**

**స్వచ్ఛ గోదావరిపై జూన్ 25 నాటికి పూర్తిస్థాయి నివేదిక**

**అధికారులను ఆదేశించిన డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్**



అమరావతి : స్వచ్ఛ గోదావరి- పవిత్ర పుష్కరాల' నేపథ్యంలో అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. కాలుష్య రహిత గోదావరి పుష్కరాల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నదిలోకి పారిశ్రామిక వ్యర్థాలు, మురుగు నీరు చేరకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. దీని కోసం జూన్ 25 లోపు పూర్తి స్థాయి నివేదిక తో 'స్వచ్ఛ గోదావరి' ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను పవన్ ఆదేశించారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో ఆరు జిల్లాల పరిధిలో 262 పుష్కర పంచాయతీలను గుర్తించారు. వీటిని మురుగురహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలని, మురుగునీరు నేరుగా గోదావరిలో కలవకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తరువాయి 2లో



## ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు

- 2,898 హాస్టళ్లు, స్కూళ్లలో నెట్ జీరో విధానంలో సోలారైజేషన్
- నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పీఎం సూర్యఘర్ అమలు
- 18 గిగావాట్లను ప్రధాన గ్రిడ్‌కు కనెక్ట్
- సుమారు రూ.22 వేలకోట్లతో ప్రతిపాదనలు
- విద్యుత్ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి : రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటు చేసి.. ఆ మేరకు విద్యుత్ నెట్ వర్క్‌ను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు గ్రీన్ ఎనర్జీ కారిడార్-3లో భాగంగా సుమారు రూ. 22 వేల కోట్లతో 2లో

## రెండ్రోజుల మహానాడు దిగ్విజయం

**స్త్రీ శక్తి థీమ్‌కు అర్థం చెప్పేలా 33 శాతం రిజర్వేషన్లు**

**విజయవంత చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేనా కృతజ్ఞతలు**

**మహానాడు విజయవంతంపై మీడియాతో మంత్రి లోకేశ్**



అమరావతి : తెలుగుదేశం పార్టీ రెండు రోజుల పాటు నిర్వహించిన మహానాడు 2026 విజయవంతంగా పూర్తయింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేశ్ శుక్రవారం స్పందించారు. మహానాడు విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియ జేస్తున్నానని తెలిపారు. స్త్రీ శక్తి థీమ్‌కు అసలైన అర్థం చెప్పేలా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చేసిన తీర్మానానికి అందరి ఆమోదం లభించడం.. చర్చనీయాంశం కావడం ఈ మహానాడు సాధించిన మరో గొప్ప విజయం అని మంత్రి నారా లోకేశ్ అభివర్ణించారు. 2లో

# 200 ఇంటర్ సిటీ రైళ్ల తయారీకి రంగం సిద్ధం

ఈ మేరకు సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందించారు. రాబోయే ఐదేళ్లలో 200 ఇంటర్‌సిటీ రైళ్లను తయారు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. దీనిపై సమీక్ష నిర్వహించి, ఆ బాధ్యతను కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు అప్పగిస్తూ రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నారు. ఈ ఇంటర్‌సిటీ రైళ్లు 20 కోచ్‌ల కాన్ఫిగరేషన్‌తో, ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్, మెరుగైన వెంటిలేషన్, సురక్షితమైన కోచ్ డిజైన్ వంటి ఆధునిక సదుపాయాలను కలిగి ఉంటాయని ఆయన పేర్కొన్నారు. వీటిని సాధారణంగా సుమారు 300 కిలోమీటర్ల దూరం ఉన్న మార్గాల్లో నడిపిస్తారని తెలిపారు. అలాగే ప్రతి ట్రిప్‌లో చాలా స్టాప్‌లు ఉంటాయని కేంద్ర మంత్రి చెప్పారు. ఇంటర్‌సిటీ రైళ్లు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణాలు, నగరాల మధ్య ప్రజలు సులభంగా ప్రయాణించేందుకు ఈ రైళ్లు ఉపయోగపడతాయని అన్నారు. ఇవి తమ సమీప పట్టణాల్లో ఉన్నత విద్య కోసం వెళ్లే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటాయని చెప్పారు. అలాగే ఆరోగ్యం, ఉద్యోగం, ఉపాధి కోసం ప్రయాణించే సామాన్య ప్రజలకూ ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

# సెక్స్ వర్కర్లపై దాడులు సరికాదు

న్యూఢిల్లీ : స్వచ్ఛందంగా ప్రాస్టిట్యూషన్‌ను ఎంచుకోవడం, మానవ అక్రమ రవాణా బారినపడి సెక్స్ వర్క్‌లోకి దిగడం మధ్య స్పష్టమైన తేడా ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇష్టపూర్వకంగా సెక్స్ వర్క్ చేసే వయోజనులను వేధించవద్దని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. సెక్స్ వర్కర్లకు చట్టపరంగా సమాన రక్షణ ఉండాలని పేర్కొంది. దాడుల సమయంలో వారి గుర్తింపును వెల్లడించొద్దని మీడియాకు కూడా వార్నింగ్ ఇచ్చింది. దేశంలో మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు సమగ్ర మార్గదర్శకాలు జారీ చేసింది. స్వచ్ఛందంగా సెక్స్ వర్క్‌ను ఎంచుకున్న వారికి, మానవ అక్రమ రవాణా ముఠాల బారిన పడి ఈ రొంపిలో కూరుకుపోయిన బాధితులకు మధ్య తేడాను గుర్తించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. సొంత ఇష్టంతో సెక్స్ వర్క్ నిర్వహించే వయోజనులపై దాడులు చేయడం, క్రిమినల్ కేసులు పెట్టడం చట్టవిరుద్ధమని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి ఒక్కరికీ గౌరవంగా జీవించే హక్కు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేవలం లైంగిక వృత్తిలో తల్లి ఉందనే ఏకైక కారణంతో ఆమె నుంచి బిడ్డను బలవంతంగా వేరు చేయలేరని కూడా సుప్రీం కోర్టు పేర్కొంది. రెస్క్యూ ఆపరేషన్ల సమయంలో సెక్స్ వర్కర్ల ఫోటోలు, వీడియోలు ప్రసారం చేయడం నేరమని పేర్కొంది. నివాస ధ్రువీకరణ పత్రాలు లేకపోయినప్పటికీ సెక్స్ వర్కర్లందరికీ తక్షణమే ఆధార్ కార్డులు జారీ చేయాలని కూడా ఆదేశించింది. స్వచ్ఛందంగా ఈ మార్గాన్ని ఎంచుకున్న వారిని వదిలి, మహిళలు, మైనర్లను అక్రమ రవాణా చేసే మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని కూడా సుప్రీం కోర్టు ఆదేశించింది.

# కాలుష్య రహితంగా గోదావరి పుష్కరాలు

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. మురుగు నీటి నిర్వహణ, పారిశ్రామిక వ్యర్థాల కాలుష్యంపై పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశ్రమల వ్యర్థాలు నదిలో కలవకుండా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కఠినంగా వ్యవహరించాలని, మురుగు నీటిని శుద్ధి చేశాకే నదిలోకి వదలాలని పవన్ స్పష్టం చేశారు. మున్సిపాలిటీ సామర్థ్యానికి తగిన విధంగా మురుగు శుద్ధి ప్లాంట్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. పీసీబీ మంజూరు చేసిన రూ.100 కోట్ల నుంచి కూడా నిధుల వినియోగించాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. రోజువారీ 104 మిలియన్ లీటర్ల మురుగు నీరు జీవనదిని కలుషితం చేస్తోందన్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల నుంచి 8.38 మిలియన్ లీటర్ల మురుగు నీరు గోదావరిలో కలుస్తోందని పేర్కొన్నారు. పారిశ్రామిక వ్యర్థాల్లో ఆంధ్ర పేపర్ మిల్లు వెదజల్లే రోజువారీ కాలుష్యమే 32 మిలియన్ లీటర్లు ఉంటుందన్నారు. నిత్యం గోదావరిలో కలిసే 13.24 మిలియన్ లీటర్ల ఆక్వా కాలుష్యం వీటికి అదనమని పేర్కొన్నారు. పారిశ్రామిక కాలుష్య నివారణకు నిరంతర తనిఖీలు చేయాలని సూచించారు. ఆర్టీజీఎస్ తరహా కంట్రోల్ రూం ద్వారా నిరంతరం ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ టాస్క్ ఫోర్స్‌కి కంట్రోల్ రూం నిర్వహణ బాధ్యతలను అప్పగించారు.

# ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు

ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ శాఖపై సమీక్షించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ అంశం సహా విద్యుత్ సరఫరా పరిస్థితి, వచ్చే ఆరు నెలల ప్రణాళిక, పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్, పీఎంఈ-డ్రైవ్ పథకాల పురోగతి, ఏపీఐఈసీ పాలసీ కింద ఆమోదించిన వివిధ ప్రాజెక్టుల పరిస్థితి, నెడ్‌క్యాప్ బలోపేతం, డిజిటల్ ట్విన్ గ్రిడ్ నిర్మాణం వంటి అంశాలపై చర్చించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్‌లో భాగంగా ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ విస్తరించే అంశంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని సీఎం చంద్రబాబు అధికారులను అడిగారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్-3 కింద సుమారు 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు చర్యలు తీసుకుంటున్నా మని వివరించారు. ఈ మేరకు కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్లు, పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్టు వెల్లడించారు. మొత్తంగా 18 గిగావాట్లల్లో సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే 11 గిగా వాట్ల విద్యుత్ ను అలాగే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే సుమారు 7 గిగావాట్ల విద్యుత్ ను ప్రధాన గ్రిడ్ కు అనుసంధానించేలా చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు వివరించారు. ఈ మేరకు 2,261 కిలో మీటర్ల మేర కొత్త ట్రాన్స్ మిషన్ లైన్లు వేయనున్నట్టు వెల్లడించారు. ఈ కారిడార్లో భాగంగా 9,500 మెగా వాట్ల సామర్థ్యంతో 5 భారీ పూలింగ్ స్టేషన్లను నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు అధికారులు వెల్లడించారు. ముదిగుబ్బ, తలుపుల, రామాయపట్నం, పోరుమామిళ్ల, కొప్పాక ప్రాంతాల్లో పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గ్రీన్ ఎనర్జీలో 160 గిగా వాట్ల ఉత్పత్తికి లక్ష్యం నిర్దేశిరచుకున్నామని.. దానికి అనుగుణంగా నెట్ వర్క్‌ను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఏపీ గ్రీన్ ఎనర్జీ కారిడార్ పూర్తి అయితే.. రాష్ట్రంలో డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్ ను సరఫరా చేసేందుకు ఈ నెట్ వర్క్ బాగా ఉపకరిస్తుందని అభిప్రాయపడ్డారు. ఇక విద్యుత్ మౌళిక సదుపాయాలు పెరిగితే.. ఆయా రంగాల్లో పెట్టుబడులు కూడా పెద్ద ఎత్తున వస్తాయని సూచించారు.



# తెలంగాణలో అంచనాను మించి ధాన్యం ఉత్పత్తి

రాష్ట్రంలో చివరి గింజ వరకు కొనుగోలు చేసే బాధ్యత మాది అని ఉత్తమ్ తెలిపారు. ధాన్యం సేకరణకు క్షేత్రస్థాయిలో 13వేల వాహనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 2 లక్షల మంది సిబ్బంది సేకరణలో పాల్గొంటున్నారని చెప్పారు. సేకరణ కేంద్రాలకు 20.86 కోట్ల గన్నీ బ్యాగులు పంపామన్నారు. ధాన్యం కొనుగోలు చేసి రూ.11,050 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామని వివరించారు. 'ధాన్యం సేకరణకు బిహార్, బెంగాల్ కార్మికులపై ఆధారపడి ఉన్నాం. బెంగాల్ ఎన్నికలకు కార్మికులు స్వస్థలాలకు వెళ్లి రావడం ఆలస్యమైంది. మద్దతు ధర కోసం మా ప్రభుత్వం రూ.49 వేల కోట్లు వెచ్చించగా.. గత ప్రభుత్వం రూ.10వేల కోట్లే ఇచ్చింది. ఈ విషయంలో ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటికే రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం పండింది.. ఏ రాష్ట్రంలో జరగని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు జరుగతున్నాయని స్పష్టం చేశారు. ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ గా ఉందన్నారు. ధాన్యం సేకరణ విషయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో కనీస మద్దతు ధరకే అన్ని రకాల ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. ఎంఎస్ పీ ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు 16వేల కోట్ల రూపాయలు ఖర్చు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. రాష్ట్రంలో 143 లక్షల టన్నుల ధాన్యం పండితే.. ఇప్పటివరకు 73 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతు ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తున్నామన్నారు. చివరి గింజ వరకు మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. యాసంగిలో రాష్ట్ర ప్రభుత్వం 73 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది..అయితే ఇందులో కేంద్ర ప్రభుత్వం కేవలం 5 లక్షల ధాన్యమే కొనుగోలు చేస్తామని చెబుతోంది.. ఏటా తెలంగాణ నుంచి ధాన్యం కొనుగోళ్లను తగ్గిస్తూ వస్తోంది. ధాన్యం కొనుగోళ్లు పెంచాలని కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోవడం లేదు. బీజేపోళ్లు ధర్నా చేసుడు కాదు.. ఢిల్లీకి వెళ్లి వడ్లను కొనాలను కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లకు 16వేల కోట్ల రూపాయలు అదనంగా ఖర్చు చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న చివరి గింజ వరకు ధాన్యం సేకరణ జరగుతుందన్నారు. ధాన్యం సేకరణలో 2వేల మిల్లులు పనిచేస్తున్నాయన్నారు. ధాన్యం తరలించేందుకు 13వేల వాహనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో హమాలీల కొరత ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ ధాన్యం కొనుగోలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బీఆర్ ఎస్ హయాంలో ఏడాదికి 15వేల ఇస్తే కాంగ్రెస్ హయాంలో 49వేల కోట్లు ఇస్తున్నామన్నా రు మంత్రి.. తెలంగాణలో 60 లక్షల టన్నుల ధాన్యం కొంటే.. ఏపీలో 24 లక్షలే కొన్నరని పోల్చి చెప్పారు. ఇప్పటివరకు రూ.11వేల 50కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం.. రెండున్నరేళ్లలో రూ.36వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. వడ్లను కొన్న 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామన్నారు. చివరి గింజ కొనేవరకు కొనుగోలు కేంద్రాలు పనిచేస్తాయని, ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన 10వేల 214 టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

# నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది

పర్యవేక్షణా యంత్రాంగాలు, సంబంధిత కమిటీలు ఉన్నప్పటికీ ఇంత పెద్ద ఉల్లంఘన ఎలా జరిగిందని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇలాంటి సంఘటన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభను కలిగిస్తుందని, వారిని ఇలా నిరాశపెట్టడం సరికాదని అభిప్రాయపడింది. పేపర్ లీక్ విషయంలో లోపాలకు జవాబుదారీతనం ఉండాల్సిందేనని, అప్పటి వరకు అసలు సమస్య ఆగదని వ్యాఖ్యానించింది. అయితే, యువత ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం ధర్మాసనానికి వెల్లడించారు. పరిస్థితిని ప్రధానమంత్రి కూడా వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. జూన్ 21న మరోసారి నిర్వహించే నీట్-యూజీ పరీక్ష కోసం కొత్త యంత్రాంగాలను ఏర్పాటు చేశామన్నారు. అయితే, ఈ వ్యవహారంపై ప్రతిస్పందన తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేసింది. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై(ఎన్‌టీఏ) పలు ప్రశ్నలు సంధించింది. ఇన్ని నిఘా వ్యవస్థలు, కమిటీలు ఉన్నా పేపర్ ఎలా లీకైందని ప్రశ్నించింది. యూపీఎస్‌సీలో ఇలాంటి ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడలేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. యూపీఎస్‌సీని చూసి నేర్చుకోవాలని ఎన్‌టీఏకు సూచించింది. నీట్ వ్యవస్థ ప్రక్షాళనకు కేంద్రం ఏర్పాటు చేసిన హైలెవెల్ కమిటీ చైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డా. రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ, డా. రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించింది. కేంద్రం తన ఎఫిడవిట్ దాఖలు చేసేందుకు న్యాయస్థానం అదనపు గడువు ఇచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ నరసింహ మాట్లాడుతూ పేపర్ లీక్‌కు ఆస్కారం కల్పించిన పరిస్థితులు ఏమిటని డా. రాధాకృష్ణన్‌ను కోర్టు ప్రశ్నించారు. గతంలో అనేక రక్షణలను ఏర్పాటు చేసినా పేపర్ లీక్ ఎలా అయ్యిందని అన్నారు. ఇందుకు డా. రాధాకృష్ణన్ బదులిస్తూ పేపర్ సెట్టింగ్ పక్రియలో సమస్య ఉందని అన్నారు. ప్రస్తుతం ఆ లోపాలను సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేశామని అన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సమస్య తలెత్తకుండా గతంలో మొత్తం 101 సూచనలు చేశామని చెప్పారు. వాటిల్లో 60 తాత్కాలిక సూచనలను 2025-26 పరీక్ష కోసం ప్రత్యేకంగా రూపొందించినట్టు చెప్పారు. ఇతర మార్గదర్శకాలు కూడా త్వరలో పూర్తిస్థాయిలో అమలవుతాయని చెప్పారు. మరోసారి ఇలాంటివి జరగవని ధీమా వ్యక్తం చేశారు. సంస్కరణలే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కేవలం సంస్కరణలతో పరిస్థితి చక్కబడదని కోర్టు వ్యాఖ్యానించింది. తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని పేర్కొంది. బాధ్యత ఎవరు తీసుకుంటారనేది తేల్చకుండా ఎన్ని కమిటీలు, మీటింగ్‌లు ఏర్పాటు చేసిన ఫలితం ఉండదని వ్యాఖ్యానించింది. ఇక ఈ అంశంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ పేపర్ లీక్‌పై విచారణ జరుగుతోందని అన్నారు. జూన్ 21 నాటి పరీక్ష నిర్వహణ కోసం కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. ప్రధాని స్వయంగా ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నారని కోర్టుకు తెలిపారు.

# రెండ్రోజుల మహానాడు దిగ్విజయం

కార్యకర్తలే అధినేత నినాదాన్ని పార్టీ జాతీయ అధినేత అమలు చేసిన ఈ మహానాడు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రెండు రోజుల మహానాడుకు ఒక్క మైటీడీపీ యాప్‌లో 24.50 లక్షల డిజిటల్ అటెండెన్స్ నమోదు కావడం మరో రికార్డు అని తెలిపారు. తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, మహానాడు కమిటీలు, పార్టీ కార్యాలయ యంత్రాంగం, బ్యాక్ ఆఫీస్, సాంకేతిక సిబ్బంది, ఓజిఆఖ, ఎ౹ఆఖ, అనుబంధ సంఘాలు, మీడియా మిత్రులు, సోషల్ మీడియా అభిమానులు, ఎన్ఆర్ఐలు, మిత్రపక్షాలు, ప్రజలు, భద్రతా సిబ్బంది అందరికీ కృతజ్ఞతాభి వందనాలు తెలిపారు. మహానాడు 2026 విజయం మీ అందరికీ అంకితం చేస్తున్నానని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ఇది మీ విజయం అని మంత్రి లోకేశ్ వెల్లడించారు. మీ కృషికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని చెప్పారు. తెలుగుదేశం పార్టీ కోట్లాది కుటుంబసభ్యుల ఆశీస్సులతో తాను టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎంపికైన తర్వాత జరిగిన తొలి మహానాడు ఇదని ఆయన వివరించారు. ఈ మహానాడు ఘన విజయం టీడీపీ టీం కృషి అని స్పష్టం చేశారు. సమష్టిగా పనిచేస్తే ఎన్ని అద్భుతాలు చేయగలమో టీడీపీ కుటుంబం నిరూపించిందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుతో నెల్లూరులో జరగాల్సిన మహానాడు 2026ను అందరి ఆమోదంతో హైబ్రిడ్ విధానంలోకి మార్చామని మంత్రి లోకేశ్ గుర్తు చేశారు. తెలుగుదేశం రాజకీయ పాఠశాలలో గురువు చంద్రబాబు నాయుడు సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవడం మనకు నేర్పారని చెప్పారు. ఆ నేర్పును ఇంటర్నేషనల్ క్రైసిస్‌లో కూడా ఎవరూ ఊహించని విధంగా హైబ్రిడ్ మహానాడును ఒక అవకాశంగా తీసుకుని విజయవంతం చేశారని సంతోషం వ్యక్తం చేశారు. గతంలో మాదిరి ఒకచోట జరిగే మహానాడుకు తెలుగు రాష్ట్రాల నుంచి టీడీపీ కుటుంబసభ్యులు తరలివచ్చేవారని పేర్కొన్నారు. తెలుగుదేశం నా బాధ్యత అంటూ ఇప్పుడూ ప్రతి పల్లె, ప్రతి ఇల్లూ మహానాడుకు వేదిక అయి.. పసుపు జెండాలతో రెపరెపలాడిందన్నారు. కార్యకర్తలే అధినేతలై.. నేతలే మార్గదర్శులై రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్ల బాధ్యతలను తామే తీసుకుని మహానాడు 2026ను కనివినీ ఎరుగనీ రీతిలో విజయవంతం చేశారని చెప్పారు.

# క్యూర్ పరిధిలో పేదలు సంతృప్తి చెందేలా ఇళ్ల డిజైన్

రూపొందించిన పలు నమూనా డిజైన్లను పరిశీలించి పలు కీలక మార్పులు, సూచనలు చేశారు. రానున్న 40 నుండి 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. కేవలం ఇళ్లు కట్టడం మాత్రమే కాదు,భవిష్యత్ తరాలకు అనుకూలంగా ఉండే విధంగా డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్, వాణిజ్య అవసరాలు, ప్రజల జీవనశైలిని దృష్టిలో పెట్టుకొని సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. స్థానిక పరిస్థితులను బట్టి అవసరమైతే 10 అంతస్తుల వరకు భవనాలు నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ౹ాల్, బెడ్‌రూమ్, కిచెన్, బాత్‌రూమ్ వంటి విభాగాల పరిమాణాల రూపకల్పనలో వాస్తు అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పేద కుటుంబాలు సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించేలా ప్రతి డిజైన్ ఉండాలన్నారు. పార్కింగ్‌తో పాటు షాపుల ఏర్పాటుకు కూడా అవకాశం కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని, ఆ నియోజకవర్గ ప్రజలకు అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రజలు తమ ఉపాధి, జీవన విధానాలకు దూరం కాకుండా నివాసాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించిన అనంతరం తుది డిజైన్లను ఖరారు చేసి, యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించేలా రోజువారీ కార్యాచరణ రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భద్రత కల్పించాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచే అర్బన్ హౌసింగ్ మోడల్‌ను తీసుకొస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

# రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మారాలి

**సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులతోనే ఆరోగ్యం పదిలం**

**ప్రజలు సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించాలి**

**రైతులు పంట వ్యర్థాలను కాల్చొద్దు: మంత్రి తుమ్మల**

హైదరాబాద్,మే29 : హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఆర్గానిక్ మేళా ప్రదర్శన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను సందర్శించి, రైతులతో ముచ్చటించారు. సేంద్రియ వ్యవసాయం ప్రాధాన్యత, సాగు విధానాలు, ఎదురవుతున్న సవాళ్లపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ౹ాష్ట్రంలో సేంద్రియ వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులు ఆర్గానిక్ సాగు వైపు ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం మనం వినియోగిస్తున్న ఆహార పదార్థాలు రసాయనాల ప్రభావంతో కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక దిగుబడుల కోసం అవసరానికి మించి రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించడం వల్ల నేల సారవంతత దెబ్బతింటోందని తెలిపారు. అధికంగా రసాయన ఎరువులు వినియోగించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రసాయనాలతో పండించిన పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వల్ల ప్రజల్లో అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు కూడా ఇది ఒక కారణంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ ఆసుపత్రులు వేగంగా విస్తరిస్తుండటానికి ప్రధాన కారణాల్లో ఆహారపు అలవాట్లు, రసాయనాల ప్రభావం కూడా ఒకటని ఆయన అభిప్రాయపడ్డారు.సేంద్రియ వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యం, ప్రజల ఆరోగ్యం రెండూ మెరుగుపడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు ఉత్పత్తి చేస్తున్న ఆర్గానిక్ ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతుల నుంచి వినియోగదారులు నేరుగా ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు. రజలు ఎంత ఎక్కువగా ఆర్గానిక్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తే, అంత ఎక్కువగా రైతులు సేంద్రియ సాగు వైపు ఆకర్షితులవుతారని, తద్వారా ఆరోగ్యకరమైన ఆహార వ్యవస్థ ఏర్పడుతుందని తెలిపారు. రైతులు, వినియోగదారులు, ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తేనే సమాజానికి ఆరోగ్యవంతమైన భవిష్యత్తును అందించగలమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. అలాగే రైతులు పంట వ్యర్థాలను పొలాల్లో కాల్చకుండా వాటిని సేంద్రియ ఎరువుల తయారీలో వినియోగించాలని సూచించారు. పంట అవశేషాల దహనం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు నేలలోని సూక్ష్మజీవులు నశిస్తాయని, ఇది భూమి సారంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని మంత్రి తెలిపారు.

# ఈసెట్ ఫలితాలు విడుదల

ఈసెట్‌లో మొత్తం 16,726 మంది అభ్యర్థులు (93.60 శాతం) క్వాలిఫై అయ్యారు. ఈ సందర్భంగా బాలక్రిష్ణ రెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల చేస్తామని చెప్పారు. జూలై మొదటి వారంలో క్లాసెస్ ప్రారంభం అవుతాయని తెలిపారు. ఫీజులు గత ఏడాది మాదిరిగానే ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగారం, ఈసెట్ కన్వీనర్ ప్రొ.చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు. దీంతో రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ ప్రవేశాలకు ఎదురుచూస్తున్న విద్యార్థుల నిరీక్షణకు తెరపడింది. మే 15న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్ష ఫలితాలు, విద్యార్థుల మార్కుల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా(పాలిటెక్నిక్), బీఎస్సీ(మ్యాథమెటిక్స్) పూర్తిచేసిన విద్యార్థులకు నేరుగా బీటెక్, బీఫార్మసీ కోర్సుల ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు ఈ పరీక్షను ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఫలితాల విడుదల నేపథ్యంలో ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరాలనుకునే విద్యార్థుల్లో సందడి నెలకొంది. పరీక్షకు హాజరైన అభ్యర్థులు తమ ఫలితాలను, ర్యాంక్ కార్డులను అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ, రిజిస్ట్రేషన్ నంబర్‌ను నమోదు చేసి స్క్రీన్‌పై ఫైనల్ ర్యాంక్‌ను చూసుకోవచ్చని ఉన్నత విద్యా మండలి అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే కొద్ది రోజుల్లోనే కేటగిరీల వారీగా కౌన్సెలింగ్ తేదీలు, సర్టిఫికేట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్ల నమోదుకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రకటించనుంది. అడ్మిషన్ల ప్రక్రియ ముగిసే వరకు విద్యార్థులు తమ ర్యాంక్ కార్డులను, హాల్ టికెట్లను జాగ్రత్తగా ఉంచుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. కౌన్సెలింగ్‌కు సంబంధించి అప్‌డేట్ల కోసం విద్యార్థులు నిరంతరం అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాల్సిందిగా కోరారు.

# రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం

పాటించాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జేఏసీ నాయకులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కో-కన్వీనర్ బి.యాదగిరి మాట్లాడారు. గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి చర్యలు చేపట్టి శాసనసభలో బిల్లు కూడా పాస్ చేసిందని గుర్తు చేశారు. కేవలం విలీన తేదీని ప్రకటించాల్సిన సమయంలో ప్రభుత్వాలు మారాయని తెలిపారు. ఇటీవల ఆర్టీసీ సమ్మె సందర్భంగా మంత్రులతో కూడిన ఉపసంఘం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి అధికారికంగా ప్రకటన చేశారని తెలిపారు. ఇటీవల విలీనం కంటే ముందు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో కార్మికుల్లో తీవ్ర గందరగోళం నెలకొన్నదని అన్నారు. ఆర్టీసీ విలీనానికి అపాయింటెడ్ తేదీని తెలంగాణ ఆవిర్భావ దినమైన జూన్ 2న ముఖ్యమంత్రి ప్రకటించాలని కోరుతూ మే 31 న సింగిల్ డిమాండ్ పై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపో, యూనిట్లలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి డిమాండ్ డే పాటించాలని పిలుపునిచ్చారు.

## ఆయిల్ పామ్ అమలులో తెలంగాణ అగ్రస్థానం

ఫ్రెష్ ఫ్రూట్ బంచ్‌లకు రూ.23,501/ మెట్రిక్ టన్ను గిట్టుబాటు ధరగా ఉందని తెలిపారు. ౹ిగుమతి సుంకం పెంపుతో ధర రూ.25,000 వరకు పెరిగే అవకాశం ఉందని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయ పడ్డారు. రాష్ట్రంలో ఇప్పటికే 3 ప్రాసెసింగ్ మిల్లులు, మరో 7 నిర్మాణ దశలో ఉన్నాయని వివరించారు. 2026?27లో అదనంగా 85 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని లక్ష్యంగా నిర్దేశిరచుకున్నట్లు తెలిపారు. రైతుల ఆదాయ వృద్ధి ప్లస్ గ్రామీణ ఉపాధి పెంపు లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.

## గురుకులాల్లో సీట్ల భర్తీకి భారీ స్పందన

అందించేందుకు కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. గురుకుల విద్యాసంస్థలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చారిత్రాత్మక చర్యలు తీసుకుంటోందన్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ 5న ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేయగా, ఏప్రిల్ 6 నుంచి మే 25 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 45,357 దరఖాస్తులు అందగా, అందులో ఓఖఅ గ్రూప్‌కు 21,447, ౹తిఖఅ గ్రూప్‌కు 17,400, ఓఇఅ, అఇఅ, ఊఇఅ గ్రూపులకు కలిపి 6,510 దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి అడ్లూరి తెలిపారు. ౹ాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల విద్యాసంస్థల్లో మొత్తం 19,740 సీట్లు అందుబాటులో ఉండగా, మే 15న 117 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 39,052 మంది విద్యార్థులు హాజరై 86.09 శాతం హాజరు నమోదైనట్లు వెల్లడించారు. ఫేజ్-1 అడ్మిషన్లలోనే మొత్తం 18,401 సీట్లు భర్తీ కావడం గురుకులాలపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు.

# పుణె జిల్లాలో కల్తీ మద్యం విషాదం

### కల్తీ మద్యానికి 11మంది మృత్యువాత

### ఆందోళనకరంగా పలువురి పరిస్థితి

పుణె,మే29 : మరోమారు కల్తీ మద్యం కాటేసింది. మహారాష్ట్రలోని పుణె జిల్లాలో కల్తీ మద్యం విషాదం చోటుచేసుకుంది. పుణె, పింప్రి-చింఛ్వాడ్ జంట నగరాల్లో ఇప్పటివరకు 11 మంది మరణించినట్లు అధికారులు వెల్లడించారు. పలువురు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. బాధితుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. లోకల్ మద్యం సేవించిన అనంతరం బాధితులు ఒక్కసారిగా వాంతులు, కంటిచూపు మందగించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలతో కుప్పకూలినట్లు సమాచారం. వెంటనే వారిని సమీప ఆస్పత్రులకు తరలించినప్పటికీ పలువురు చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఘటనపై స్పందించిన మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కల్తీ మద్యం తయారీ, విక్రయాల్లో పాల్గొన్నవారిని గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని సూచించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఇప్పటివరకు ఇద్దరు నిందితులను అధికారికంగా అరెస్ట్ చేసినట్లు పింప్రి ఏసీపీ సచిన్ హిరే వెల్లడించారు. వీరిద్దరూ మద్యం సరఫరా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

# 'క్యూర్' పరిధిలో అఫర్డబుల్ ప్లాట్ల నిర్మాణం

హైదరాబాద్,మే29 : 'క్యూర్' పరిధిలో అఫర్డబుల్ ప్లాట్ల నిర్మాణానికి గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి.గౌతమ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్ఐజీ, ఎంఐజీ ఎ÷-లాట్లు నిర్మించేందుకు హౌసింగ్ బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దిగువ, మధ్య తరగతి కోసం లక్ష ప్లాట్లు నిర్మించనుండగా.. పైలట్ ప్రాజెక్టు కింద 12 వేల ప్లాట్ల నిర్మాణానికి హౌసింగ్ బోర్డుకు అనుమతి ఇచ్చారు. ఎల్ఐజీ ప్లాట్లకు భూమి యూడీఎస్, రూ.5 లక్షల సబ్సిడీ ఇవ్వనున్నారు. హౌసింగ్ బోర్డు, దిల్, రాజీవ్ స్వగృహ, ప్రభుత్వ భూముల్లో ప్లాట్ల నిర్మాణం చేపట్టనున్నారు.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై విచారణ

న్యూఢిల్లీ,మే29 : తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై అమిర్ అలీఖాన్, అజారుద్దీన్ దాఖలు చేసిన ఇంటర్‌లోకేటరీ అప్లికేషన్లపై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. కేసు విచారణ జులై 22న చేపట్టనున్నట్టు ఇప్పటికే ప్రకటించామని ధర్మాసనం తెలిపింది. గత విచారణలో కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చారని అజారుద్దీన్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. గతంలో గవర్నర్ తనపేరు సూచించి.. తర్వాత నిర్ణయం మార్చుకున్నారని అమిర్ ఖాన్ తెలిపారు. మంత్రివర్గ నిర్ణయం ప్రకారం జరిగిన దానికి గవర్నర్ ఏం చేస్తారని ఈ సందర్భంగా ధర్మాసనం ప్రశ్నించింది. ఇరువురి అప్లికేషన్లను ప్రధాన కేసుతోనే విచారిస్తామని ధర్మాసనం తెలిపింది. రెండు అప్లికేషన్లపై ప్రతివాదులకు నోటీసులు జారీసిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణ జులై 22కి వాయిదా వేసింది.

# వివోలకు ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్

### వివోల నిరవధిక దీక్షలకు బిఆర్ఎస్ మద్దతు

నిజామాబాద్,మే29 : ఎన్నికల హామీలను కాంగ్రెస్ తుంగలో తొక్కేసిందని, వీవోఏలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించి మోసం చేసిందని బీఆర్ఎస్ మండల నాయకులు పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న వీవోఏల నిరవధిక సమ్మెకూ కోటగిరి మండల బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం సంఘీభావం తెలిపారు. వీవోఏల న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యేంత వరకు బీఆర్ఎస్ తరుపున పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. 2023 లో అసెంబ్లీ సాక్షిగా నాటి ఎమ్మెల్యే ప్రస్తుతం మంత్రి సీతక్క ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వీవోఏల సమస్యలపై ప్రశ్నించారని, ఆనాడు ప్రశ్నించిన సీతక్క ఇప్పుడు అదే శాఖ సంబంధించిన మంత్రి ఉన్నారని, ఆనాటి సమస్య నేడు గుర్తుకు రావడం లేదా అని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక రకంగా అధికార పక్షంలో ఉన్నప్పుడు ఒక రకంగా ఉండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వీవోఏలకు సేర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు ట్యాబ్ తోపాటు నెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి సీసీ లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని, రూ.20 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి విశేష సేవలు అందిస్తున్న వివో ఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనియెడల బీఆర్ఎస్ తరపున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## పెనుగంగలో పడి బాలుడు మృతి

ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లాలోని బేల మండల కేంద్రంలో విషాదం చోటుచేసుకుంది. గంగమ్మ తల్లికి బోనం సమర్పించుకునేందుకు తన నానమ్మ బంధువులతో మండలంలోని సాంగిడి గ్రామ పెనుగంగ వద్దకు శుక్రవారం బోనం సమర్పించేందుకు వెళ్లారు. ఈ క్రమంలో బెతం సాయిదీప్ (14) బాలుడు పెనుగంగా వాగులో స్నానం చేస్తూ నానమ్మ, బంధువులు చూస్తుండగానే నీటి గుంతలోకి జారుకున్నాడు. దీంతో బాలుడిని కాపాడేలోపే మునిగిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు పెనుగంగా వద్దకు చేరుకొని బాలుడు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

# నీట్ పేపర్ లీకేజీ దోషులను వదలం

### వారిని కఠినంగా శిక్షించి తీరుతాం

### విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ,మే29 : నీట్ యూజీ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. నీట్ యూజీ ఎగ్జామ్‌లో అవకతవకలు జరిగాయని.. ప్రశ్నపత్రం నిజంగానే లీక్ అయిందని అంగీకరించారు. పేపర్ లీక్‌లో ప్రమేయం ఉన్న వారెవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించిన అన్ని కేసులను ఫాస్ట్-ట్రాక్ కోర్టులలో విచారిస్తామని.. తద్వారా నిందితులకు త్వరితగతిన కఠిన శిక్ష పడేలా చూస్తామని పేర్కొన్నారు.నీట్ యూజీ పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఫెయిల్ అయ్యిందన్నారు. శుక్రవారం కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఓ నేషనల్ మీడియా టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..నీట్ యూజీ పేపర్ లీక్ అయిందని అంగీకరిస్తున్నాను. ఎన్‌టీఏ విఫలమైంది. ఈ విషయాన్ని నేను ఒప్పుకుంటున్నానని పేర్కొన్నారు. వైద్య ప్రవేశ పరీక్ష సమగ్రతను దెబ్బతీస్తున్న విద్యా మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడానికి మోడీ




సర్కార్ కట్టుబడి ఉందని అన్నారు. పేపర్ లీకేజీలో పాలుపంచుకున్న వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుంటుందని విద్యార్థులకు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్ష ఫలితాల్లో నెలకొన్న గందరగోళంపైన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించారు. సీబీఎస్ఈ మూల్యాంకన వ్యవస్థలో ఓఎస్ఎంకు సంబంధించిన సాంకేతిక సమస్యలతో సహా పలు సమస్యలు ఉన్నాయని అంగీకరించిన ఆయన.. వాటిని ప్రస్తుతం ఐఐటీ నిపుణుల సహాయంతో పరిష్కరిస్తున్నారని తెలిపారు. సీబీఎస్ఈ ఉపయోగించే పేమెంట్ గేట్‌వే విదేశీ హ్యాకర్ల నుంచి జరిగిన సైబర్‌దాడికి గురైందని హాట్ కామెంట్స్ చేశారు. ఈ సమస్యను పరిష్కరించి, వ్యవస్థను బలోపేతం చేయడంలో సీబీఐ సైబర్ బృందం సీబీఎస్ఈకి సహకరిస్తోందని తెలిపారు. 11 లక్షలకు పైగా విద్యార్థులు ఇప్పటికే తమ జవాబు పత్రాల కాపీలను పొందగా.. నాలుగు లక్షలకు పైగా అభ్యర్థులు పునఃమూల్యాంకనం కోసం దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తామని.. పక్రియను మెరుగుపరచడానికి అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.

## మాజీమంత్రి గాదె వెంకట్‌రెడ్డి కన్నుమూత

హైదరాబాద్,మే29 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు గాదె వెంకటరెడ్డి కన్నుమూశారు. గతకొద్ది రోజులుగా వయోభారం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతోన్న ఆయన శుక్రవారం హైదరాబాద్‌లోని నివాసంలో తుదిశ్వాస విడిచారు. వెంకటరెడ్డి మృతిని ఆయన కుటుంబ సభ్యులు ధృవీకరించారు. వెంకటరెడ్డి మరణంపై పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1940 జూలై 10న ఆంధప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలో గాదె వెంకటరెడ్డి జన్మించాడు. ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన ఆయన కాంగ్రెస్ పార్టీ రాజకీయ అరంగ్రేటం చేశారు. 1967లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరుచూరు నియోజకవర్గం నుండి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచాడు. ఆ తరువాత 1972లో కాంగ్రెస్ అభ్యర్థిగా.. 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి రెండు సార్లు మద్దుకూరి నారాయణ రావుపై ఓడిపోయారు. 1983, 1985,1989 ఎన్నికల్లో వరుసగా ఓటమి చవిచూశారు. తిరిగి 1991 ఉప ఎన్నికల్లో అలాగే 1994 సార్వత్రిక ఎన్నికల్లో పరుచూరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నేదురుమల్లి జనార్ధనరెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశాడు. 1999లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో బాపట్ల నుంచి ఎమ్మెల్యేగా గెలిచి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కొణిజేటి రోశయ్య మంత్రివర్గంలో దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేశాడు. ఆంధప్రదేశ్ విభజన తరువాత జరిగిన 2014 ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. సుదీర్ఘకాలం పాటు కాంగ్రెస్?లో పని చేసిన ఆయన 2016 ఏప్రిల్ 29ను హస్తం పార్టీకి వీడ్కోలు పలికి టీడీపీలో చేరారు. నాలుగేండ్ల తర్వాత టీడీపీకి రిజైన్ చేసి 2020 మార్చి 16న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. వయోభారం, అనారోగ్య సమస్యతలతో గత కొద్ది రోజులుగా ఆయన క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.


## పెట్రో ధరలతో ఆటోడ్రైవర్లకు గడ్డు పరిస్థితి

### ధరలు తగ్గించాలని నిరసన ప్రదర్శన

మంచిర్యాల,మే29 : పెంచిన డీజిల్ ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తగ్గించాలని బీఆర్టీయూ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఎండీ హబీబ్ పాషా డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డీజిల్ చార్జీలు పెంచడం వల్ల ఆటో డ్రైవర్ల బతుకులు అగమ్య గోచరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తాండూర్ మండల కేంద్రం ఐబీలో ఆటో కార్మికులతో కలిసి భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్టీయూ) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఫ్రీ బస్ వల్ల నష్టపోతున్న ఆటో కార్మికులకు డీజిల్ ధరలు పెంపుతో ములిగే నక్క మీద తాటి పండు పడ్డట్టు అయిందన్నారు. సింగరేణి సంస్థకు, ఆర్టీసీ సంస్థకు ఎలాగైతే సబ్సిడీ ఇస్తున్నారో అదేవిధంగా ఆటో కార్మికులకు కూడా డీజిల్ ధరలో రాయితీ కల్పించాలని కోరారు. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం తీసుకునే జీఎస్టీలను తగ్గించి రాయితీ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్టీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నం శ్రీనివాస్, అధికార ప్రతినిధి వేల్పుల శంకర్, తాండూరు మండల ఆటో కార్మికులు పాల్గొన్నారు.

# సోయా ఉత్పత్తుల తయారీ కేంద్రం ప్రారంభం

### సోయా ఉత్పత్తులను ప్రోత్సహించడానికే అన్న కలెక్టర్



ఆదిలాబాద్,మే29 : రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత , గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాలల్లో భాగంగా శుక్రవారం ఇంద్రవెల్లి మండల కేంద్రం ఐకేపీ కార్యాలయ ప్రాంగణంలో మహిళా సంఘాలు, గుడిహత్నూర్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సోయా ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని శాసనసభ్యులు వెడ్మ బొజ్జుపటేల్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సోయాబీన్ పంట సాగు విస్తృతంగా ఉన్నప్పటికీ, స్థానిక ప్రాసెసింగ్ యూనిట్లు తక్కువగా ఉండటం వల్ల రైతులు, మహిళలు ఆశించిన స్థాయిలో లబ్ధి పొందలేకపోతున్నారని గుర్తించి ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతర్జాతీయ సంస్థ ఇక్రిశాట్ సాంకేతిక భాగస్వామ్యంతో రూ. 30 లక్షల వ్యయంతో ఈ సోయా ప్రాసెసింగ్ యూనిట్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. ప్రారంభ బాల్య అభివృద్ధి పై అవగాహన కల్పిస్తూ గర్భధారణ సమయం నుంచి శిశువుకు రెండు సంవత్సరాలు నిండే వరకు ఉండే 1000 రోజులు జీవితానికి బలమైన పునాది వంటివని తెలిపారు. ఈ కాలంలో పిల్లల ఎదుగుదల కోసం పోషకాహారం, ఆరోగ్యం, ప్రారంభ విద్య, స్పందనాత్మక సంరక్షణ, భద్రత, తల్లిదండ్రుల శ్రేయస్సు అనే 6 సూత్రాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో రవీందర్ రాథోడ్, డీడబ్ల్యూవో మిల్కా, జడ్పీ సీఈవో రవి, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తమ్, సర్పంచ్ రాథోడ్ మోహన్ సింగ్, ఎంపీడీవో జీవన్ రెడ్డి, ఐకేపీ ఏపీఎం మంజుల, మహిళా సంఘాల ప్రతినిధులు, ఐకేపీ సీసీలు, రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పెరటికోళ్ల పెంపకానికి నిధులు మంజూరు

ఖమ్మం,మే29 : ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక మహిళ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఐకేపీ ఆధ్వర్యంలో కరకగూడెం మండలంలోని 27 గ్రామ సమాఖ్యలలోని 275 మంది సభ్యులకు రూ.5.50 లక్షలు పెరటి కోళ్ల పెంపకం నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులకు సంభందించిన చెక్కును శుక్రవారం మండల కేంద్రంలోని టీజీబీ బ్యాంక్ కార్యాలయంలో బ్యాంక్ మేనేజర్ ఎన్.గిరిబాబు, ఐకేపీ ఏపీఎం బండి వినోద్ క్రాంతి గ్రూప్ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏపీఎం వినోద్ క్రాంతి మాట్లాడుతూ.. పెరటికోళ్ల పెంపకంతో మహిళలు దినదిన అభివృద్ధి చెందుతూ ఆర్థికంగా కుటుంబానికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీలు పోలెబోయిన విజయలక్ష్మి, సత్యనారాయణ, అకౌంటెంట్ ప్రీతి, సమాఖ్య ప్రతినిధి మహేశ్వరి పాల్గొన్నారు.

## ఫేక్ జీవోలతో భూ ఒప్పందాలు

### నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ భమికి ఎసరు

### నకిలీ ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు

మేడ్చల్ : ఫేక్ జీఓలు, అక్రమ భూ ఒప్పందాల ద్వారా భారీ మోసానికి పాల్పడిన ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. నార్సింగి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల సాయికిరణ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సహా మరికొందరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. గండిపేట సర్వే నెంబర్ 18లోని ప్రభుత్వ భూమిపై నకిలీ పత్రాలు సృష్టించి, ఆ భూమిని తమదిగా చూపిస్తూ ఫేక్ జీఓలు తయారు చేసినట్లు దర్యాప్తులో తేలింది. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ఈ నకిలీ జీఓలను వైరల్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రభుత్వం భూమిని క్రమబద్ధీకరించినట్లు చెబుతూ ఐదు ఫేక్ జీఓలను సృష్టించిన నిందితులు, ఆ భూమిని ఎకరాకు రూ.3.5 కోట్లకు అమ్మేందుకు కుట్ర చేసినట్లు సమాచారం. ఈ భూమి డీల్‌లో బొల్లా రమేష్, బ్రహ్మనాయుడుతో ఒప్పందం కుదిరినట్లు దర్యాప్తులో బయటపడింది. బొల్లా బ్రహ్మనాయుడుకు నిమ్మల కుటుంబం నుండి రెండు విడతలుగా డబ్బు ట్రాన్స్‌ఫర్ అయినట్లు పోలీసులు తెలిపారు. ఒకసారి కోటి రూపాయలు, మరోసారి 25 లక్షలు ట్రాన్స్‌ఫర్ అయినట్లు గుర్తించారు. మొత్తం భూ లావాదేవీల్లో సుమారు నాలుగు కోట్లు చేతులు మారినట్లు దర్యాప్తులో తేలింది. కోర్టు ఆదేశాలతో నిందితుల ఇళ్లలో సోదాలు నిర్వహించి, బ్యాంక్ పాస్‌బుక్స్, మొబైళ్లు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. చట్టబద్ధ హక్కులు లేకపోయినా ప్రభుత్వ పోరంబోకు భూమిపై హక్కులు ఉన్నట్లు చూపించే ప్రయత్నం చేసినట్లు వెల్లడించారు. హైకోర్టులో తమ భూమే అని నిందితులు పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ, అక్టోబర్ 2025లో వాటిని కోర్టు కొట్టివేసినట్లు తెలిపారు. అనంతరం కూడా అక్రమంగా భూమి అమ్మకానికి ప్రయత్నించినట్లు పోలీసులు చెప్పారు. ఫేక్ జీఓలు, ఫోర్జరీ పత్రాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. భూమి కొనుగోలు చేసే ముందు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ రికార్డులను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు.

# ఔట్ సోర్సింగ్ నియామకాల్లో అక్రమాలు

### ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఫిర్యాదు

హైదరాబాద్,మే29 : మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఇటీవల చేపట్టిన ఔట్‌సోర్సింగ్ నియామకాల్లో భారీ అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ.. యూనివర్సిటీలో నిర్వహించిన ఔట్‌సోర్సింగ్ నియామకాలు పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని తెలిపారు.రోస్టర్ రిజర్వేషన్ విధానం పాటించకుండా పత్రిక ప్రకటనలు సరైన విధంగా ఇవ్వకుండా అర్హులైన నిరుద్యోగులకు అవకాశం లేకుండా నియామకాలు చేపట్టారని ఆరోపించారు.ఇప్పటికే ఈ అంశంపై యూనివర్సిటీ వీసీ,రిజిస్ట్రార్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా అధికారులు స్పందించకపోవడంతో ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ను కలిసి పూర్తి వివరాలు తెలియజేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థి సంఘ నాయకుడు వాడపల్లి నవీన్ మాట్లాడుతూ.. గతంలో నవీన్ మిట్టల్ వైస్ ఛాన్సలర్‌గా ఉన్న సమయంలో కూడా 33 మంది డైలీ వేజ్ ఉద్యోగులను రోస్టర్ రిజర్వేషన్, పత్రిక ప్రకటనలు లేకుండా అక్రమంగా నియమించారని తెలిపారు. ప్రస్తుతం చేపట్టిన నియామకాలలో కూడా నిరుద్యోగుల వద్ద లక్షల రూపాయలు వసూలు చేసి 100కు పైగా అక్రమ నియామకాలు జరిగాయని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడిన ఏజెన్సీపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఆ ఏజెన్సీకి యూనివర్సిటీ లేదా ఇతర ప్రభుత్వ సంస్థల్లో పనులు ఇవ్వకుండా బ్లాక్‌లిస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.అలాగే ప్రస్తుతం జరిగిన నియామకాలను పూర్తిగా రద్దు చేసి, తిరిగి పారదర్శకంగా నోటిఫికేషన్ విడుదల చేసి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించి నాణ్యత కలిగిన విద్యావంతులను ఎంపిక చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు పోలగోని శివ, రాజేష్, యశ్వంత్, రామ్, జితేందర్, సంజీవ, నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

## ఎక్కడా ధాన్యం కొనుగోళ్లు లేవు

### 80శాతం ధాన్యం కుప్పల పేరుకున్నాయి

### బిజెపి భరోసా యాత్రలో అసలు విషయాలు గమనించాం

### సిఎం రేవంత్‌కు అధికారుల పట్టు లేదన్న ఏలేటి

హైదరాబాద్,మే29 : రాష్ట్రంలో రైతాంగం పడుతున్న బాధలు తెలుసుకునేందుకు 'రైతు గోస – బీజేపీ భరోసా' పేరుతో యాత్ర చేపట్టామని అసెంబ్లీలో బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. నాలుగు రోజుల పాటు అనేక జిల్లాల్లో పర్యటించి.. రైతాంగం ఆర్తనాదాలు విన్నామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు 80 శాతం పూర్తి అయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని.. కానీ తాము చేసిన ఈ యాత్రలో 80 శాతం ధాన్యం కుప్పలు పేరుకుపోయి కనిపించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పోరాటం చేయగానే.. ప్రభుత్వం సమీక్షలు, జిల్లాల్లో కల్లాల బాట పడుతుందని ఆరోపించారు. ఇవే సమీక్షలు, పర్యటనలు మంత్రులు ముందే చేస్తే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అడ్మినిస్ట్రేషన్‌పై కంట్రోల్ లేదని ఏలేటి మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో దోపిడి రాజ్యం నడుస్తోందని విమర్శించారు. రైతుల వద్ద ధాన్యాన్ని కేంద్రం కొనుగోలు చేయలేకపోతే.. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయలేదా? అని రేవంత్ సర్కార్‌ను ఆయన సూటిగా ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఇసుక, సిమెంట్ లారీలను ముందే ఆపి ధాన్యం సేకరణ ఎందుకు చేయలేదని ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. రైతులే గన్నీ బ్యాగులు కొనే పరిస్థితి లేదన్నారు. లారీ, హామాలీల ఖర్చు రైతులే చెల్లిస్తున్నారని తద్వారా రైతాంగం శ్రమను ఈ విధంగా దోపిడీ చేస్తున్నారని చెప్పారు. చివరి గింజ వరకు కొనే బాధ్యత నాదని ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ధాన్యం కొనుగోలు చేతకాకపోతే ముఖ్యమంత్రి పీఠం నుంచి దిగిపోమ్మని గత సీఎం కేసీఆర్‌ను డిమాండ్ చేసిన రేవంత్ రెడ్డి.. ప్రస్తుతం ఎందుకు కొనుగోలు చేయడం లేదని సందేహం వ్యక్తం చేశారు. గ్దదెనెక్కగానే రేవంత్ రెడ్డి గద్దలా మారిపోయారంటూ తెలంగాణ ముఖ్యమంత్రిపై నిప్పులు చెరిగారు. ఓటు బ్యాంకు కోసమే రైతులను వాడుకుంటున్నారని పేర్కొన్నారు. కేంద్రం ఇచ్చిన యూరియాను కూడా సక్రమంగా ఇవ్వకుండా.. యాప్ పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వయసు మీరి, బుద్ధి మందగించిందని.. ధాన్యం కొనుగోళ్లపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని.. మంత్రులు ఉత్తమ్, తుమ్మల చర్చకు వస్తారా? అంటూ బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి సవాల్ విసిరారు. బీజేపీ యాత్ర చేస్తే కాంగ్రెస్ ఎందుకు భయపడుతుందంటూ సందేహం వ్యక్తం చేశారు. వాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పెట్రోల్, డీజల్‌పై అవగాహన లేదని ఎద్దేవా చేశారు. పెట్రోల్, డీజల్‌పై 30 శాతం వ్యాట్ ఎందుకు తగ్గించడం లేదంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. రైతు వడదెబ్బతో చనిపోతే మంత్రులు వెళ్లి పరామర్శించారా?.. ఎక్స్‌గ్రేషియా ప్రకటించారా? అని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆయన నిలదీశారు. సన్ ఫ్లవర్, శనగలు కొనుగోలు చేస్తున్నామని మంత్రి తుమ్మల చెబుతున్నారని.. అందుకు సంబంధించిన కౌంటర్ ఎక్కడ పెట్టారో చూపించాలని రేవంత్ ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు.

# సంపాదకీయం

## కాలంతో పోరాడలేక చతికిల పడ్డ కమ్యూనిస్టులు

కేరళ సిఎంగా ఉండగానే పినరయ్ విజయ్‌పై ఆరోపణలు వచ్చాయి. కూతురికి లబ్ది చేకూర్చేందుకు ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేశారన్న అభియోగాలు వచ్చాయి. ఇందులో ఆనాటి నుంచే కేసు నడుస్తోంది. తాజాగా ఇప్పుడు ఇడి రంగంలోకి దిగడంతో ఇది కాంగ్రెస్, బిజెపిల కుట్ర అని, లెఫ్ట్ పార్టీని దెబ్బతీసే కుయుక్తి అంటూ విమర్శలు చేస్తున్నారు. చాలా విచిత్రంగా ఈ రెండు పార్టీలు కలుస్తాయా అన్నది కమ్యూనిస్టులే చెప్పాలి. మరో విషయమేమంటే ఎన్నికల సందర్భంగా రాహుల్ తన ప్రచారంలో బిజెపి లెఫ్ట్‌తో కుమ్మక్కయిందని ఆరోపించారు. కాంగ్రెస్‌- బిజెపి రెండూ కూడబలుక్కొని కేరళంలో సిపిఎం ప్రతిష్టను దెబ్బతీయటానికి బరి తెగించాయని విమర్శలు చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇడి నోటీసులు ఇవ్వటంతో వ్యవహారం మొదలైంది. దేశంలో ప్రతిపక్ష పార్టీలపైనా, నాయకులపైనా అవినీతి ఆరోపణలు గుప్పించడం, ఆ తరువాత తన గుప్పిట్లో పెట్టుకున్న దర్యాప్తు సంస్థల చేత దాడులు చేయించడం కేంద్రంలోని మోడీ–షా ప్రభుత్వం చాలాకాలంగా అనుసరిస్తున్న విధానం అని దాదాపు అన్ని పార్టీలు చేస్తున్న ఆరోపణలే. ఢిల్లీలో అరవింద్ కేజీవ్రాల్, జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్‌ల మీద సాగించిన దాష్టీకం, ఇందులో భాగమని సిపిఎం ఆరోపణ. అవినీతి పంకిలం అంటించి రాజకీయ లబ్ది పొందాలనే బిజెపి కుట్రపూరిత వ్యూహం అత్యంత దిగజారుడుతనానికి నిదర్శనంగా ఇప్పుడు సిపిఎం ఆరోపిస్తోంది. కేరళంలో అధికారం కోల్పోయాక సిపిఎం బహుశా కనుమరుగైనట్లుగానే భావించాలి. కేరళంలో కొంత మిణుకుమిణుకుమంటున్నా,దేశంలోని అనేక రాష్ట్రాల్లో అసలు ఉనికి లేకుండా పోయింది. ముఖ్యంగా కమ్యూనిస్టులు నేలవిడిచి సాము చేయడం, పడికట్టు సిద్దాంతాల నుంచి బయటపడక పోవడం, గతంలో లాగా  పోరాటలకు దూరంగా ఉండడం వంటివన్నీ వారిని తుడిచిపెట్టేలా చేశాయి. కేరళంలో విజయన్ కుమార్తె నిర్వహణలోని సంస్థ అందించిన సేవల నిమిత్తం పొందిన ప్రతిఫలాన్ని వివాదాస్పదం చేసి, మనీ లాండరింగ్ సెక్షన్లు బనాయించిందన్నది సిపిఎం ఆరోపణగా ఉంది. రాహుల్ గాంధీ ఇంకో రెండడుగులు ముందుకేసి, పినరయి విజయన్‌ను ఎందుకు అరెస్టు చేయరంటూ ప్రశ్నించాడట. కేరళంలో అధికారంలోకి వచ్చిన మరు క్షణం నుంచి ఒకపక్క కాంగ్రెస్, మరోపక్క సంఘ్ పరివార్ శక్తులూ సిపిఎంపై దాడులకు తెగబడుతున్నాయన్న వాదనను సిపిఎం తెరపైకి తెచ్చింది. విజయన్ ఇంటిపై కుట్రపూరిత దాడుల గురించి తెలిసిన వెంటనే దేశమంతా వెల్లువెత్తిన నిరసనలే ఎర్రజెండా పట్ల ప్రజల నమ్మకానికి నిదర్శనం అంటోంది. నిజానికి ఈ కేసు చాలా చిన్నది. దీనిని కోర్టులో తేల్చుకోవచ్చు. కానీ అలా చేయడం లేదు. లెఫ్ట్ రాజకీయాలకు వస్తే బెంగాల్లో 35 ఏళ్లపాటు అధికారంలో ఉండి చేసిందేమీ లేదు. కేరళలోనూ ప ఎద్దగా అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవు. తరిపురలోనూ అలాగే చేశారు. అందుకే ప్రజలు వీరిని ఇంటికి పంపించారు. ఈ దెబ్బతో దేశంలో ఇక లెఫ్ట్ పార్టీలకు కాలం చెల్లినట్లే. అభివృద్ధి చెందిన దేశాల్లో, అంటే సంపన్న, వలసవాద, పారిశ్రామిక దేశాల్లో కమ్యూనిస్టు భావజాలం అంతగా విస్తరించలేకపోయింది. వలస విముక్తి ఉద్యమాలు జోరందుకున్న లేదా నవస్వతంత్ర దేశా ల్లో మాత్రం దండిగా మార్మోగింది. అలాంటి దేశాల్లో భారత్ మొదటి వరుసలో ఉంటుంది. సాంప్రదాయిక భావజాల ప్రతినిధి అయిన ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించిన 1925లోనే కమ్యూనిస్టు పార్టీ ఊపిరిపోసుకుంది. ఆర్‌ఎస్‌ఎస్ కుటుంబానికి చెందిన బీజేపీ తన అధికారాన్ని పటిష్టపరచుకుంటున్న తరుణంలో కమ్యూనిస్టులు కనుమరుగైపోతుండటం ఓ వైచిత్రి. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత 1951 –52 నాటి తొలి ఎన్నికల్లో వారు గణనీయమైన విజయాలు సాధించారు. నల్గొండ నుంచి కమ్యూనిస్టు నేత రావి నారాయణరెడ్డి, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను మించిన మెజారిటీ సాధించడం గురించి అప్పట్లో గొప్ప గా చెప్పుకొన్నారు. తాజాగా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత దేశంలో కమ్యూనిస్టుల పలుకుబడి అడుగంటిన సూచనలు కనిపిస్తు న్నాయి. సు మారు 50 ఏండ్లలో ఏ రాష్ట్రంలోనూ కమ్యూనిస్టు ప్రభుత్వం లేని పరిస్థితి వచ్చింది. కేరళలో పినరయి విజయన్ ప్రభుత్వ ఓటమి కీలక పరిణామమే. దీంతో దేశ రాజకీయాల్లో కమ్యూనిస్టుల శకం అంతరించినట్టేననే వ్యాఖ్యానాలు వినిపిస్తుండటం గమనార్హం. ఒకప్పుడు కమ్యూనిస్టులు ప్రజల కోసం ఉద్యమాలు చేసేవారు. ఇప్పుడా పరిస్థితులు లేకుండ పోయాయి. కేరళ తర్వాత బెంగాల్, త్రిపుర ఇలా మొత్తం మూడు రాష్ట్రాల్లో వామపక్ష ప్రభుత్వాలు సుదీర్ఘకాలం కొనసాగాయి. కానీ ఇప్పుడదంతా గత వైభ వం. మారిన పరిస్థితుల్లో దానిని తిరిగి రాబట్టుకోవడం అంత సులభం కాదని మాత్రం చెప్పవచ్చు. కేంద్రంలో కాంగ్రెస్ ఆధిపత్యం వీగిపోయి, సంకీర్ణ ప్రభుత్వాల కాలంలో కమ్యూనిస్టులు హస్తినలో మంత్రి పదవులూ చేపట్టారు. ఓ దశలో కమ్యూనిస్టు సీనియర్ నేత జ్యోతిబసును ప్రధాని పదవి చేపట్టే అవకాశమూ తలుపు తట్టింది. అంతటి ఉన్నతస్థితి నుంచి, నేడు ఏమాత్రం ప్రాముఖ్యం లేని స్థాయికి కమ్యూనిస్టులు పడిపోయారు. కేరళంలో తమను ఓడించిన కాంగ్రెస్‌తో తెలంగాణలో అంటకాగడం, ఒకటి రెండు స్థానాల కోసం వెంపర్లాడటం వారి దైన్యాన్ని కండ్లకు కడుతున్నది. భారత్‌లో పార్లమెంటరీ పంథాలో వెళ్లిన కమ్యూనిస్టులు కనుమరుగవుతుంటే, మరోవైపు సాయుధ పోరాటాన్ని ఎంచుకున్న కమ్యూనిస్టులు కగార్ ధాటికి నేలకొరుగుతున్నారు. కమ్యూనిస్టుల 'చారిత్రిక తప్పిదాలు', ప్రజల్లో పెరిగిన వినిమయతత్వం అందుకు దారితీశాయి అనేది అక్షరసత్యం. ప్రజలిప్పుడు డబ్బు సంపాదించటం, ఖర్చు పెట్టటం గురించి తప్ప విప్లవాలు, ఉద్యమాల గురించి ఎక్కువగా ఆలోచించటం లేదు. కాలం చెల్లిన వ్యూహాలు, ఎత్తుగడలూ కమ్యూనిస్టుల మహాప్రస్థానానికి బ్రేకులు వేశాయి. మొత్తంగా ఇప్పుడు కమ్యూనిస్టుల భవిష్యత్ ఏంటన్నది కాలమే చెప్పాలి. పినరయ్ విజయ్ లాంటి వారు కూతురుకు మేలు చేయడం కోసం అవినీతి బురద తొక్కడం కూడా కాల వైచిత్రమే.

# సేంద్రియ వ్యవసాయమే భవిష్యత్తుకు భరోసా



వ్యవసాయ రంగంలో అధిక దిగుబడుల కోసం రైతులు సంవత్సరాలుగా రసాయన ఎరువులపై ఆధారపడుతున్నారు. మొదట్లో మంచి ఫలితాలు ఇచ్చిన ఈ ఎరువులు ప్రస్తుతం భూమి సారవంతాన్ని దెబ్బతీస్తున్నాయని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. యూరియా, డిఎపి, పొటాష్ వంటి రసాయన ఎరువులను అధికంగా వాడటం వల్ల నేలలోని సహజ సూక్ష్మజీవులు నశించి, భూమి పోషక విలువలు తగ్గిపోతున్నాయి. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో పంట దిగుబడులు తగ్గిపోవడం, నేల గట్టిపడటం, నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం తగ్గిపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. భవిష్యత్తులో ఇదే పరిస్థితి కొనసాగితే వ్యవసాయం చేయడం కూడా ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా సేంద్రియ ఎరువులు రైతులకు మేలు చేస్తున్నాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పశువుల ఎరువు, జైవామృతం, ఘన జీవామృతం, వెర్మీ కంపోస్ట్ వంటి సేంద్రియ పద్ధతులు భూమి సహజ సారాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. సేంద్రియ ఎరువులు వాడటం వల్ల నేలలో తేమ ఎక్కువకాలం నిల్వ ఉండటంతోపాటు పంటలకు అవసరమైన పోషకాలు సహజంగా అందుతాయి. రసాయన ఎరువుల ఖర్చు తగ్గడంతో రైతుల ఆర్థిక భారం కూడా తగ్గుతోంది. సేంద్రియ పద్ధతుల్లో పండిన పంటలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటం రైతులకు అదనపు లాభాలను తెస్తోంది. దేశంలో రసాయన ఎరువుల ధరలు క్రమంగా పెరుగుతుండటం రైతులపై అదనపు భారంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ సబ్సిడీలు అందిస్తున్నప్పటికీ, దీని ద్వారా పెద్ద ఎత్తున లాభాలు కార్పొరేట్ ఎరువుల కంపెనీలకే చేరుతున్నాయని రైతు సంఘాలు విమర్శిస్తున్నాయి. ప్రతి సీజన్‌లో ఎరువుల కొరత, ధరల పెరుగుదలతో రైతులు అప్పుల బారిన పడుతున్నారు. మరోవైపు సేంద్రియ వ్యవసాయానికి సరైన ప్రోత్సాహం, మార్కెట్ సదుపాయాలు లేకపోవడం రైతులను నిరుత్సాహానికి గురిచేస్తోంది. ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతులకు ప్రత్యేక పథకాలు అమలు చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడిన పంటలను తినడం వల్ల ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా కేన్సర్, చర్మవ్యాధులు, జీర్ణసమస్యలు, హార్మోన్ అసమతుల్యత వంటి సమస్యలు పెరుగుతున్నాయని పరిశోధనలు చెబుతున్నాయి. సేంద్రియ పద్ధతుల్లో పండించిన ఆహార పదార్థాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. దీంతో ప్రస్తుతం ఆర్గానిక్ ఉత్పత్తులకు మార్కెట్లో ప్రత్యేక డిమాండ్ ఏర్పడుతోంది. రైతులు కూడా భవిష్యత్తు తరాల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. సేంద్రియ ఎరువుల వినియోగాన్ని గ్రామీణ స్థాయి నుంచే రైతులకు విస్తృతంగా తెలియజేయాల్సిన అవసరం ఉందని నిపుణులు, రైతు సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు. రసాయన ఎరువుల అధిక వినియోగంవల్ల భూమి సారవంతం తగ్గిపోవడం, పంట దిగుబడులు దెబ్బతినడం, ప్రజల్లో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వాలు వ్యవసాయ శాఖ అధికారులతో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలను గ్రామాల స్థాయిలో రైతులతో సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. సేంద్రియ ఎరువుల తయారీ, వినియోగ పద్ధతులపై రైతులకు శిక్షణ ఇచ్చి అవగాహన కల్పిస్తే భూమి ఆరోగ్యం కాపాడటంతో పాటు రైతుల ఖర్చులు కూడా తగ్గే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించే విధంగా ప్రత్యేక పథకాలు, సబ్సిడీలు, మార్కెట్ సదుపాయాలు కల్పిస్తే రైతులు మరింతగా ఆ దిశగా ముందుకు వచ్చే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించాలం సేంద్రియ వ్యవసాయానికే ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# అక్రమ వలసదారులకు మమత చేయూత

### తృణమూల్ నేతలో ఊతకర్ర అందించిన వైనం

### సరిహద్దు వెంట అక్రమ వలసదారులు పరుగు

కోల్‌కతా,మే29 : మమతా బెనర్జీ కాలం నాటి అక్రమాలు తన్నుకు వస్తున్నాయి. ముఖ్యంగా బంగాదేశ్ చొరబాటు దారులను ఎలా కాపాడారో కూడా అర్థం అవుతోంది. అలాగే చొరబాటు దారులకు గేట్లు బార్లా తెరిచారు. ఈ విషయం ఇప్పుడు కళ్లకు కనపడుతోంది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బంగ్లాదేశీ అక్రమ వలసదారుల కంటిమీద కునుకు లేకుండా పోయింది. అరెస్టుల భయంతో అక్రమ వలసదారులు అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలోనే నిత్యం వందల మంది సరిహద్దు ప్రాంతాలు, ఇండియా నుంచి బంగ్లాదేశ్‌కు వెళ్లే మార్గాలకు చేరుకుంటున్నారు. ఇండియా టుడే కథనం మేరకు.. బంగ్లాదేశ్ తిరిగి వెళ్లిపోవటానికి ప్రయత్నిస్తున్న అక్రమ వలసదారులు మీడియాతో మాట్లాడుతూ దేశంలోకి ఎలా వచ్చారో చెప్పారు. కొంతమంది తాము నదులు దాటి భారత దేశంలోకి ప్రవేశించామని చెప్పారు. మరి కొంతమంది తాము మధ్యవర్తుల ద్వారా ఇండియాలోకి వచ్చామన్నారు. చీకటిలో సరిహద్దులు దాటి దేశంలోకి ప్రవేశించామని తెలిపారు. మధ్యవర్తుల సాయం ఉంటే 10 నిమిషాల్లో దేశంలోకి ప్రవేశించవచ్చని ఓ అక్రమ వలసదారుడు మీడియాకు తెలిపాడు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో పని చేసే కొంతమంది కార్యకర్తల సాయంతో తాము భారత దేశంలోకి వచ్చామని, వారే తమకు అన్ని డాక్యుమెంట్లు తయారు చేసి ఇచ్చారని వెల్లడించారు.  డాక్యుమెంట్ల కారణంగా తాము భారత్‌లో పలు పథకాల ద్వారా డబ్బులు పొందామని, ఓట్లు కూడా వేశామని చెప్పారు. బంగ్లాదేశ్‌లోని కుస్తియా జిల్లాకు చెందిన ఓ కార్పెంటర్ మాట్లాడుతూ.. 'నేను ఇండియాలోకి రావడానికి మధ్యవర్తికి 7 నుంచి 8 వేల రూపాయలు ఇచ్చాను. ఆ మధ్యవర్తి బీఎస్‌ఎఫ్ కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తుంటాడు. రాత్రి పూట బీఎస్‌ఎఫ్ సిబ్బంది లేని సమయంలో పెద్ద సంఖ్యలో జనాలను ఇండియాలోకి పంపుతాడు' అని చెప్పాడు. తాను ఏజెంట్‌కు 20 వేల రూపాయలు ఇచ్చి భారత్‌లోకి వచ్చానని బెంగళూరులో ఉంటున్న ఓ అక్రమ వలసదారుడు మీడియాతో చెప్పాడు. ఇలా పుంఖాను పుంఖానులుగా కథనాలు వెలువడుతున్నాయి.

## ప్లాస్టిక్ కరెన్సీ నోట్లపై దృష్టి పెట్టిన ఆర్బీఐ!

న్యూఢిల్లీ: పాలిమర్ లేదా ప్లాస్టిక్ కరెన్సీ నోట్ల(గ్రాశీశ్రీ.ఎవతీ దీుఱఅఎఅశీవం)ను ప్రవేశపెట్టేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిసింది. రోజు రోజుకూ కరెన్సీ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో.. పాలిమర్ నోట్లను ప్రవేశపెట్టేందుకు ఆర్బీఐ ప్లాన్ వేసింది. ఇటీవల పాట్నా, ముంబైలో జరిగిన ఆర్బీఐ బోర్డు సమావేశాల్లో పాలిమర్ నోట్ల గురించి చర్చ జరిగినట్లు తెలుస్తోంది. పాలిమర్ లేదా ప్లాస్టిక్ నోట్లను ప్రవేశపెట్టేందుకు విస్తృతంగా చర్చించారు. పాలిమర్ నోట్లకు ఎక్కువ సెల్ఫ్ లైఫ్ ఉంటుందని, తయారీ కోసం తక్కువ ఖర్చు అవుందని భావిస్తున్నారు. సంప్రదాయకర కాగితం కరెన్సీ తయారీకి ఎక్కువ ఖర్చు అవుతుంది. అంతేకాకుండా పాలిమర్ నోట్లు ఎక్కువ కాలం ఉండే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం వినియోగంలో ఉన్న పేపర్ నోట్ల కన్నా.. పాలిమర్ నోట్ల తయారీకి తక్కువ ఖర్చు అవుతుంది. ఏటీఎంల ద్వారా కూడా ఈజీగా పాలిమర్ నోట్లను పంపిణీ చేయవచ్చు అన్న ఆలోచనలో ఆర్బీఐ ఉంది. పాలిమర్ కరెన్సీ నోట్లకు చెందిన పైలట్ ప్రాజెక్టును ఆర్బీఐ త్వరలో ప్రకటించనున్నది. పేపర్ మనీ ప్రింటింగ్ కోసం అయ్యే ఖర్చు బాగా పెరిగిపోయిందని, 5101.4 కోట్ల నుంచి 6,372.8 కోట్లకు ఆ ఖర్చు చేరుకుందని ఇటీవల ఆర్బీఐ వార్షిక నివేదికలో పేర్కొన్నది. బ్యాంక్ నోట్ల ప్రింటింగ్ కోసం డిమాండ్ పెరగడం వల్ల ఖర్చు పెరిగినట్లు నివేదికలో తెలిపారు. ఇక పాడైన, పాతబడిపోయిన, చిరిగిన పేపర్ కరెన్సీ నోట్ల సంఖ్య కూడా పెరిగిపోయింది. 2025 వార్షిక సంవత్సరంలో సుమారు 23.8 బిలియన్ల చిరిగిన నోట్లను రద్దు చేశారు. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 12.3 శాతం అధికం. 2024 వార్షిక సంవత్సరంలో సుమారు 21.24 బిలియన్ల చిరిగిన కరెన్సీ నోట్లను రద్దు చేసినట్లు తెలిసింది. 500, 100 నోట్లు ఎక్కువగా రద్దు చేయాల్సి వచ్చిందన్నారు. 1988లో తొలిసారి ఆస్ట్రేలియా పాలిమర్ కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టింది. 1996 నాటికి ఆ దేశం పూర్తి స్థాయిలో పాలిమర్ నోట్లను వినియోగంలోకి తెచ్చింది. ఇక కెనడా 2011లో పాలిమర్ కరెన్సీ నోట్లను తెచ్చింది. అయితే పేపర్ కన్నా పాలిమర్ బెటర్ అని కెనడా అనేక విశ్లేషణలు చేసింది.

## కల్తీ మద్యం సేవించి 12 మంది మృతి..


### కొందరి పరిస్థితి విషమం



ముంబై: కల్తీ మద్యం సేవించి 12 మంది మరణించారు. అస్వస్థత చెందిన మరి కొందరి వ్యక్తుల పరిస్థితి విషమంగా ఉన్నది. కల్తీ మద్యానికి సంబంధించి 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. (ంజూబ-తీఱశీబం శ్రీఱఅబశీతీ) మహారాష్ట్రలోని పూణే జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పూణే, పరిసర ప్రాంతాలకు చెందిన కొంతమంది వ్యక్తులు కల్తీ మద్యం తాగారు. తీవ్ర అస్వస్థతకు గురై 12 మంది మరణించారు. పింప్రి–చించ్వాడ్‌లోని పుగెవాడి ప్రాంతంలో ఏడుగురు, హడప్సర్‌లోని ససనే నగర్, కాలేపడల్ ప్రాంతానికి చెందిన మరో ఐదుగురు చనిపోయారు. అనారోగ్యం పాలైన మరికొందరిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితిని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కాగా, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఈ సంఘటనపై స్పందించారు. సమగ్ర విచారణ చేయాలని పూణే, పింప్రి–చించ్వాడ్ పోలీస్ కమిషనర్లను ఆదేశించారు. ఇప్పటి వరకు ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు చెప్పారు. కల్తీ మద్యం నెట్‌వర్క్‌ను అధికారులు గుర్తించారని, దీంతో మరిన్ని అరెస్ట్‌లు జరిగే అవకాశమున్నదని వివరించారు.

## మనసు స్థిరమైతే.. విజయమూ సహజమే

భగవద్గీత పన్నెండో అధ్యాయంలో 18, 19 శ్లోకాలలో భగవంతుడు తనకెవరు ఇష్టులో చెబుతున్నాడు. శత్రుమిత్ర సమభావన కలిగి ఉండడం, మానావమానాలను, శీతోష్ణ సుఖదుఃఖాలను సమానంగా తీసుకోవడం, దేనిపైనా మమతాసక్తులు లేకపోవడం, నిందాస్తుతులకు చలింపక పోవడం, మనన శీలత, లభించిన దానితో సంతృప్తి చెందడం, స్థిరమైన బుద్ధి కలిగి ఉండటం, సర్వసమర్పణ భావన కలిగి ఉండటం (భక్తి)... ఈ లక్షణాలు కలిగిన వాడు నాకు ఇష్టుడు అంటున్నాడు కృష్ణపరమాత్మ. మౌని అంటే మౌనంగా ఉండేవాడు కాడు. నిరంతరం మననం చేసుకునేవాడు. నిరంతర మననం వల్ల జ్ఞానం ఉన్నతత్వాన్ని పొందుతుంది. చింతన చేయడం వల్ల జరిగిన దానిలో తప్పొప్పులు తెలుసుకొని సరిచేసుకునే అవకాశం ఉంటుంది. అలాగే 'అనికేతః' అన్నాడు. గృహస్థాశ్రమాన్ని వదిలి సర్వసంగ పరిత్యాగియైన వారికి సొంతంగా ఇల్లు ఉండదు. శరీరం కూడా ఇల్లులాంటిదే. దానిపై మోహం, భ్రాంతి వల్ల మమకారాదులు ఏర్పడుతాయి. సన్యాసిగా మారిన వారికి భౌతిక ఆస్తిపాస్తులపై ఎలాగైతే మమకారాదులు ఉండవో అలాగే శారీరక వ్యామోహమూ ఉండదు. అలాంటివారిని 'అనికేతః' అన్నారు. సాధనకు సహకరించేది స్థిరబుద్ధి. బుద్ధి మంచి చెడులను సూచిస్తుంది.. స్థిరత్వం వల్ల చాంచలత్వం దూరమవుతుంది. అందుకే స్థిరబుద్ధితో ఆరంభించిన ఏ కార్యమైనా సాకారమవుతుంది. బాహ్యంగా పెద్దపెద్ద త్యాగాలు చేయడం కన్నా, మనసులోని సమత్వం, స్థిరత్వమే భక్తికి నిజమైన ప్రమాణంగా భగవంతుడు చెబుతున్నాడు.



ఆధ్యాత్మికం

# కోప్టా చట్టం అమలును పటిష్టంగా చేపట్టాలి

● విద్యాసంస్థలు, హాస్టళ్ల సమీపంలో పొగాకు విక్రయాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి ● పబ్లిక్ ప్లేస్‌లో ధూమపానం చేస్తే వెంటనే జరిమానాలు విధించాలి ● ఎన్‌టీసీపీ, కోప్టా చట్టం అమలుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో కోప్టా చట్టం-2003 అమలును పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీతో కలిసి ఎన్‌టీసీపీ కోప్టా చట్టం అమలుపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ కోప్టా చట్టం అమలు అత్యంత అవసరమని, అన్ని శాఖలు సమన్వయంతో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలను పొగాకు రహితంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హాస్టళ్లు, గురుకులాలు, పాఠశాలల సమీపంలో ఉన్న దుకాణాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు. పోలీసు శాఖ సహకారంతో జూనియర్ కళాశాలలు, ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, మార్కెట్ ప్రాంతాలు వంటి ప్రజా ప్రదేశాల్లో ధూమపానం చేసే వారిపై వెంటనే జరిమానాలు విధించాలని తెలిపారు. అదే తప్పును పునరావృతం చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని



అధికారులను ఆదేశించారు. మైనర్లకు పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ప్రతి నెలా గ్రౌండ్ లెవల్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి చట్ట అమలును పర్యవేక్షించాలని సూచించారు. అన్ని పొగాకు ఉత్పత్తులపై ఆరోగ్య హెచ్చరికలు తప్పనిసరిగా ఉండాలని, కోప్టా చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత చర్యలను పటిష్టంగా అమలు చేయాలి

● కొత్త డిపో సమీపంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి ● రోడ్డు ప్రమాదాలపై అంబులెన్స్ స్పందన సమయ నివేదిక సిద్ధం చేయాలి ● రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన ● జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో రోడ్డు భద్రత చర్యలను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీతో కలిసి రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ కొత్త డిపో సమీపంలో బస్ స్టాండ్ రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన ప్రణాళిక రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. రోడ్డు భద్రతకు సంబంధించిన పనులను ప్రాధాన్యతగా తీసుకుని అమలు చేయాలని తెలిపారు. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి అవసరమైన హెచ్చరిక బోర్డులు, ట్రాఫిక్ సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో అంబులెన్స్ స్పందన సమయంపై ప్రత్యేక నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాద స్థలానికి అంబులెన్స్ చేరుకునే సమయం, ఎదురవుతున్న ఇబ్బందులు, తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర నివేదిక అందించాలని తెలిపారు. అవసరమైన చోట్ల విద్యుత్ టవర్లు, విద్యుత్ స్తంభాలను సక్రమంగా మార్పిడి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు



సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారుల పరిశుభ్రతను ప్రతిరోజూ నిర్వహించేలా చర్యలు చేపట్టాలని, చెత్త పేరుకుపోకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ ఈఈ భవ్ సింగ్, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గీతంలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు మూడు రోజుల శిక్షణ

● ఐఐటీ, ఐఐఎస్సీ, బార్క్ నిపుణులతో వృత్తి వికాస శిబిరం

**పటాన్చెరు, మే 29(ది క్రైమ్ న్యూస్):** హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర బోధనను మరింత ఆసక్తికరంగా, ప్రయోగాత్మకంగా మార్చేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'అధునాతన భావనలు, బోధనా పద్ధతులు, విద్యా సాధనాలు' అనే అంశంపై భౌతికశాస్త్ర ఉపాధ్యాయుల కోసం మూడు రోజుల రెసిడెన్షియల్ వృత్తి వికాస కార్యక్రమం జూన్ 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇండియన్ ఫిజిక్స్ అసోసియేషన్ సహకారంతో, గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాల, యూజీ స్థాయిలో భౌతికశాస్త్ర బోధనను బలోపేతం చేయడం, భావనాత్మక అవగాహనను ప్రయోగాత్మక అభ్యాసంతో అనుసంధానించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. భౌతికశాస్త్రంపై విద్యార్థుల్లో ఉన్న భయాన్ని తొలగించి, శాస్త్రీయ జిజ్ఞాసను పెంపొందించే వినూత్న బోధనా పద్ధతులను ఉపాధ్యాయులకు పరిచయం చేయనున్నారు. ఇందులో ఆధునిక విద్యా సాధనాలు, తక్కువ ఖర్చుతో కూడిన ప్రయోగాలు, ఐసీటీ ఆధారిత బోధన, విద్యార్థి మూల్యాంకన పద్ధతులపై ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో విద్యుదయస్కాంత సిద్ధాంతం, ఫోటోనిక్స్, క్వాంటం కంప్యూటింగ్, సూపర్ కండక్టివిటీ, అయస్కాంతత్వం, అణు వికిరణం, ప్రయోగాత్మక ప్రదర్శనలు, స్వయంగా తయారు చేసుకునే ఫిజిక్స్ కిట్లు, తరగతి గది బోధనా విధానాలు వంటి అంశాలపై సెషన్లు నిర్వహించనున్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో




గీతం సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఎస్. అనంత రామకృష్ణ, విశిష్ట విజిటింగ్ ఆచార్యుడు ప్రొఫెసర్ బి.వి.ఆర్. టాటా, ఐఐటీ మద్రాసు ఆచార్యుడు ప్రొఫెసర్ టి.ఎస్. నటరాజన్, ఐఐఎస్సీ బెంగళూరుకు చెందిన ప్రొఫెసర్ విబోర్ సింగ్ తదితర ప్రముఖులు పాల్గొననున్నారు. అలాగే గీతం విశిష్ట ఆచార్యుడు ప్రొఫెసర్ జి. రవికుమార్, బాబా అణు శక్తి సంస్థ పూర్వ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జి.ఎ. రామారావు, మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ వనజ, టాటా ప్రాథమిక పరిశోధనా సంస్థకు చెందిన ప్రొఫెసర్ దీపాచారి పాల్గొని ఉపాధ్యాయులకు మార్గదర్శనం చేయనున్నారు. పాఠశాల స్థాయి భౌతికశాస్త్ర, విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయుల కోసం ఉద్దేశించిన ఈ కార్యక్రమాన్ని డాక్టర్ జి. సాయిప్రీతి, డాక్టర్ టి. విశ్వం సమన్వయం చేస్తున్నారు. ఆసక్తి ఉన్నవారు పేర్ల నమోదు, ఇతర వివరాల కోసం షామాబీ (77802 74121), గోపీకృష్ణ (87120 18815)లను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

# సంచలన పీఎంజే రాబరీ కేసు సూత్రధారి సుభోధ్ సింగ్ అరెస్ట్

**- బీహార్‌లోని ఆరు కోర్టుల పీటీ వారెంట్లతో బీహార్ జైలు నుంచి కరీంనగర్‌కు తరలింపు : సీపీ గౌష్ ఆలం**



**కరీంనగర్ టౌన్, మే29(ది క్రైమ్ న్యూస్):** ఈ నెల 3వ తేదీన కరీంనగర్ పట్టణంలోని పీఎంజే జ్యువెలరీలో పనిచేసే ఉద్యోగులపై కాల్పులు జరిపి దోపిడీకి పాల్పడిన సంచలన రాబరీ కేసులో ప్రధాన నిందితుడు, సూత్రధారి అయిన సుభోధ్ సింగ్‌ను కరీంనగర్ పోలీసులు బీహార్ రాష్ట్రంలోని పూర్ణియా జైలు నుంచి పీటీ వారెంట్‌పై అదుపులోకి తీసుకున్నట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. ఈ కేసుతో పాటు ఇతర కేసుల్లోనూ నిందితుడిగా ఉన్న సుభోధ్ సింగ్‌పై వివిధ కోర్టుల్లో నమోదైన కేసుల నేపథ్యంలో, మొత్తం ఆరు కోర్టుల పరిధిలో పీటీ వారెంట్లకు అనుమతులు పొందిన అనంతరం అతడిని కస్టడీలోకి తీసుకుని కరీంనగర్‌కు తరలించినట్లు సీపీ పేర్కొన్నారు. సుభోధ్ సింగ్‌తో పాటు ప్రత్యేక పోలీసు బృందం గురువారం రాత్రి కరీంనగర్‌కు చేరుకోగా, అర్ధరాత్రి నిందితుడిని గౌరవ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచినట్లు తెలిపారు. అనంతరం కోర్టు రిమాండ్ విధించడంతో అతడిని జైలుకు తరలించినట్లు వెల్లడించారు. కేసుకు సంబంధించిన అంశాలపై మరింత లోతుగా విచారణ జరిపేందుకు, నిందితుడిని వారం రోజుల పాటు పోలీసు కస్టడీకి అప్పగించాలని కోరుతూ కరీంనగర్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు సీపీ గౌష్ ఆలం తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలో మరిన్ని కీలక వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.

# హైడ్రా సిబ్బంది దురుసు ప్రవర్తన అమీన్పూర్ హైడ్రా అధికారులపై పిర్యాదు





**పటాన్చెరు-(అమీన్పూర్), మే 29(ది క్రైమ్ న్యూస్ ):** సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐలాపూర్‌లో హైడ్రా అధికారుల చర్యలతో మరోసారి ఉద్రిక్తత నెలకొంది. కోర్టు ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ అధికారులు పనులు చేపడుతున్నారంటూ స్థానిక మహిళలు ప్రశ్నించడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ ఘటనపై పద్మ అనే మహిళ అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. గత ఏప్రిల్ నెలలో ఐలాపూర్‌లో కూల్చివేతలు చేపట్టి ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన హైడ్రా అధికారులు... శుక్రవారం ఉదయం కూల్చివేసిన గెస్ట్‌హౌస్ వద్ద వేసిన ఫెన్సింగ్‌ను సరిచేసేందుకు మళ్లీ ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఈ సమయంలో న్యాయవాది ముఖీంకు చెందిన పనిమనిషి పద్మ అక్కడికి వెళ్లి, కోర్టు స్టేటస్ కో ఆర్డర్ ఉన్నప్పుడు తమ సార్ స్థలంలోకి ఎందుకు వచ్చారని అధికారులను ప్రశ్నించినట్లు సమాచారం. తమ సార్ వచ్చే వరకు ఫెన్సింగ్ పనులు నిలిపివేయాలని కోరిన పద్మ... ఘటనను సెల్‌ఫోన్‌లో వీడియో తీసేందుకు ప్రయత్నించగా హైడ్రా సిబ్బంది అడ్డుకున్నారని ఆరోపించింది. ఈ క్రమంలో అక్కడున్న ముగ్గురు మహిళలు హైడ్రా సిబ్బందితో వాగ్వాదానికి దిగినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో ఓ మహిళపై అధికారులు దురుసుగా, అసభ్యంగా ప్రవర్తించారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఘటన ఉద్రిక్తంగా మారుతున్న సమాచారం అందుకున్న అమీన్పూర్ పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం అక్కడ ఉన్న వారిని పంపించినట్లు తెలిసింది. తనతో హైడ్రా సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పద్మ అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్....

**కాలిన పెంకుటిల్లు హృదయ వేదనలో నిరుపేద కుటుంబం**



**మానకొండూర్,29(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం శ్రీనివాస్ నగర్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇంట్లో మంటలు చెలరేగి వస్తువులు కాలిపోయాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పొన్నాల చంద్రయ్య ఇంట్లో శుక్రవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు వ్యాపించడంతో బియ్యం, విలువైన సామాగ్రితో పాటు ఇంటిలోపలి భాగం కాలిపోయి సుమారు లక్ష రూపాయల మేర ఆస్తినష్టం జరిగింది. చంద్రయ్య,తన భార్య రాజమ్మ రజక వృత్తి, కుమారుడు,కోడలు కూలీ పని చేసుకుంటూ ఉదయం కుటుంబమంతా పనులకు వెళ్ళగా ఘటన చోటు చేసుకుని ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఇంట్లో నుండి పొగలు రావడం గుర్తించిన చుట్టు ప్రక్కల వాళ్ళు విషయం తెలుపగా భార్యాభర్తలిద్దరూ ఉన్నఫలం ఇంటికీ చేరుకుని స్థానికుల సహాయంతో బోర్ నీళ్ళు చల్లి మంటలను ఆర్పివేశారు. ఉన్న ఒక్క పెంకుటిల్లు కాస్తా కాలి నష్టం జరగడంతో చంద్రయ్య దంపతులు తీవ్ర హృదయ వేదనకు లోనైయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ ఎరుకల శ్రీనివాస్ గౌడ్ ఇంటిని పరిశీలించి రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి ఉన్న చంద్రయ్య ఇంటిలో ప్రమాదం జరగడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న తహాశీల్దార్, పోలీసులు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని గమనించగా నిరుపేదైన చంద్రయ్య కుటుంబానికి సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# కొనుగోలు కేంద్రాలను సందర్శించిన అదనపు కలెక్టర్



**ఇల్లంతకుంట, మే29(ది క్రైమ్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్, చిక్కుడువానిపల్లి,దాచారం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. కొనుగోళ్ళను పరిశీలించి కేంద్రాల్లో ముందు జాగ్రత్తలు తీసుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ దాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించి కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని అధికారులను సూచించారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



**గోదావరిఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలోని రక్ష పరీక్ష కేంద్రంలో సమయం ముగిసిందని ఏ రోగిని వెనక్కి పంపకుండా శాంపిల్స్ సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన పరికరాల ప్రతిపాదనలు వెంటనే అందించాలని సూచించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గైనిక్ ఓపీని పరిశీలించి పలు సూచనలు చేశారు.

# కాలువలపై అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలి

**నగర మేయర్ మహంకాళి స్వామి**



**గోదావరిఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** గోదావరి ఖని టీచర్స్ కాలనీలో కాలువపై ఉన్న అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించి వరద కాలువ నిర్మాణ పనులు ప్రారంభించాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి ఆదేశించారు. రామగుండం నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ , పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో కలిసి శుక్రవారం టీచర్స్ కాలనీ , శ్రీ నగర్ కాలనీ సందర్శించారు. వర్షాకాలం సమీపిస్తున్న దృష్ట్యా అంతరాయం కలగకుండా ఉండేందుకు వెంటనే పనులు ప్రారంభించాలని అన్నారు. డి ఎం ఎఫ్ టి నిధులు రూ 4 కోట్లలో భాగంగా ప్రతిపాదించిన ఈ కాలువ నిర్మాణం త్వరితగతిన పూర్తయితే వర్షాకాలంలో వరద ముంపు ఉండదని అన్నారు. పనుల ప్రారంభోత్సవం సందర్భంగా ఎం ఎల్ ఎ జారీ చేసిన ఆదేశాల మేరకు కాలువపై వెలసిన అక్రమ నిర్మాణాలు వెంటనే తొలగించాలని అన్నారు. శనివారం నుండి పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

# కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఆ సమగ్రమైన మద్దతు ధరల నిర్ణయాన్ని నిరసించండి!

- సమగ్ర వ్యవసాయ ఉత్పత్తి ఖర్చుల ప్రతిపాదికన మద్దతు ధరలు నిర్ణయించాలి



**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వ్యవసాయ పంటల మద్దతు ధరలు (ఎం ఎస్ పి) ను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కే ఎం) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈరోజు కోటకొండ గ్రామంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏ ఐ యు కె ఎస్) మండల నాయకుడు ఏం సుభాష్ అధ్యక్షతన మినిమం సపోర్ట్ ప్రైస్ జీవో కాపీని దహనం చేయడం జరిగింది ఈ సందర్భంగా అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి బి యాదగిరి మాట్లాడుతూ భారత ప్రభుత్వం 2026 - 27 సం,,రానికి సంబంధించి వ్యవసాయ పంటలకు మద్దతు ధరలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో గల ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘం (సి సి ఈ ఎ) అసమగ్రామైన మద్దతు ధరలను నిర్ణయించింది అన్నారు. బిజెపి పార్టీ అధికారంలోకి రాకముందు దేశంలో రైతాంగం తీవ్రమైన ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కించాలంటే స్వామినాథ సిఫారసుల కనుగొనంగా సమగ్రమైన వ్యవసాయ ఉత్పత్తుల ఖర్చుల ప్రతిపాదికన సి2ం50% కలిపి ధర నిర్ణయిస్తామని 2022 నాటికి దేశ రైతంగానికి రెట్టింపు ఆదాయం కలిగే విధంగా వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకొస్తామని పుంకాను పుంకాలుగా ప్రచారం నిర్వహించారు. అధికారంలోకి వచ్చి 12 సంవత్సరాలు గడుస్తున్న (మూడవసారి అధికారంలోకి వచ్చిన కూడా) దేశానికి అన్నం పెట్టే అన్నదాతకు ఆసరా చేయకపోగా తీవ్రమైన ద్రోహానికి ఒడి కడుతుంది. రైతంగానీకి అవసరమైనటువంటి విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగుమందులు, కూలీల వేతనాలు, ట్రాక్టర్ కిరాయిలు, డీజిల్ ,పెట్రోల్, విద్యుత్తు, సాగునీరు తదితర వ్యవసాయ ఉత్పత్తి కారకాల ధరలు ఆకాశాన్ని ఎక్కుతున్న వీటిని ఏమాత్రం ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకుండా మినిమం సపోర్ట్ ప్రైస్ (ఎం ఎస్ పి) ఏ2ంఎఫ్ ఎల్ ప్రకారం గత సంవత్సరం రేటు పైన మొక్కజొన్నకు 10/- రూ,,లు, పెసరకు 12/- రూ,,లు, వరికి 72/- రూలు, సజ్జలకు 125 రూలు, వేరుశనగ కు 254 రూలు తదితర పంటలకు అతి తక్కువ ధర పెంచుటకు నిర్ణయించారు ఇది రైతందానికి గొడ్డలు పెట్టు లాంటివది. ఇది సి2 కంటే సుమారు 30% తక్కువ అయినా ప్రభుత్వం తనను తాను సమర్ధించుకోవడం సిగ్గుచేటు. రైతులకు లాభదాయక ధరలు ఇస్తున్నట్టుగా వ్యవసాయ ఖర్చులు మరియు ధరల కమిషన్ వాదిస్తుంది. వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు సంవత్సరానికి రెట్టింపు అవుతతుంది ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులు పెట్టిన పెట్టుబడికి ఏ మాత్రం పోసగడం లేదు తీరా రైతాంగం పండించిన పంటను మార్కెట్కు తీసుకపోగా మద్దతు ధర కంటే తక్కువ ధరలకు మార్కెట్ దళారులుకు బలవంతన రైతులు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది దీనిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమవుతుంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరల పరిశీలిస్తే కంటితూడుపుగా పెంచినట్టుగా స్పష్టమవుతుందన్నారు. ముఖ్యంగా బిజెపి ప్రభుత్వం రైతాంగ వినాశనానికే అధిక ప్రాధాన్యత నిస్తూ కార్పొరేట్ పెట్టుబడిదారి దళారీలకు కొమ్ముకాస్తుందన్నారు. దేశవ్యాప్తంగా రైతాంగం కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు విరసనగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఏ రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ రాములు, బి చెన్నప్ప, గొల్ల లక్ష్మప్ప, జి నాగప్ప, వెంకటయ్య, డి బాలకృష్ణ, గుండె అంజి, సక్రియ నాయక్, తదితర రైతులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి కటింగ్ జరగొద్దు

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో రైతుల ధాన్యం కొనుగోళ్ల లో ఎలాంటి కటింగ్ జరగొద్దని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్‌లో వరి ధాన్యం కొనుగోళ్ల పై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, రైతుల ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి కటింగ్ జరగకూడదని స్పష్టం చేశారు. ఎవరైనా మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాణ్యత పరిశీలించిన ధాన్యాన్ని మాత్రమే రైస్ మిల్లులకు తరలించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ కటింగ్ చేయవద్దని అధికారులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన 100 శాతం ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 2 నాటికి అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసి కేంద్రాలను మూసివేయాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో డీఆర్‌డీవో కలిందిని, డీసీవో శ్రీమాల, ఏపీఎంలు, ఏ.పి.ఓ.లు ,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలకు 'వరిపల్లి అనిల్ కుమార్'కు ఆహ్వానం!



**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) :** అంకితభావం, పట్టుదల ఉంటే మారుమూల గ్రామం నుండి అయినా ప్రపంచ స్థాయికి ఎదగవచ్చని నిరూపిస్తున్నారు మహబూబాబాద్ జిల్లాకు చెందిన ప్రముఖ యువ నాయకుడు, రచయిత వరిపల్లి అనిల్ కుమార్. తెలుగు భాష, సాహిత్యంపై ఆయనకున్న మక్కువ నేడు ఆయనను అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ వేదికపై నిలబెట్టింది. వచ్చే నెల జూన్ 6, 7 తేదీలలో రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ వేదికగా వైభవంగా జరగనున్న "7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల"కు అనిల్ కుమార్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది. అంతర్జాతీయ వేదికపై మహబూబాబాద్ ముద్ర! చైతన్య సారస్వత పరిషత్ సౌజన్యంతో, అంతర్జాతీయ సాహిత్య సంస్థ "శ్రీశ్రీ కళావేదిక" ఆధ్వర్యంలో ఈ మహాసభలు నిర్వహిస్తున్నారు. దేశ విదేశాల నుండి ప్రముఖ కవులు, రచయితలు తరలివచ్చే ఈ మహాసంగమంలో మహబూబాబాద్ జిల్లా నుండి వరిపల్లి అనిల్ కుమార్ ప్రాతినిధ్యం వహించడం మన ప్రాంతానికే గర్వకారణం. తెలుగు భాషా కీర్తిని చాటేందుకే చైతన్య సారస్వత పరిషత్ అధ్యక్షులు శ్రీ కె.వి.వి. సత్యనారాయణరాజు (శ్రీ చైతన్యరాజు) సౌజన్యంతో, సాహిత్య భూషణ్ శ్రీ కత్తిమండ ప్రతాప్‌కుమార్ సారథ్యంలో ఈ సభలు జరగనున్నాయి. "తెలుగు కేవలం భాష కాదు.. అది ఒక జాతి సంస్కృతి" అనే సంకల్పంతో జరుగుతున్న ఈ ఉత్సవంలో పాల్గొనాల్సిందిగా శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు అనిల్ కుమార్‌ను సాదరంగా ఆహ్వానించారు. ఒక మారుమూల గ్రామం నుండి ప్రస్థానాన్ని ప్రారంభించి, ప్రపంచ వేదికపై మెరవబోతున్న యువ నాయకుడు,రచయిత వరిపల్లి అనిల్ కుమార్ రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా ప్రజలు, యువత మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నారు.

## కవ్వంపల్లి హనుమయ్య కుటుంబానికి కవ్వంపల్లి మహా కుటుంబం పరామర్శ



**కరీంనగర్ టౌన్, మే29(ది క్రైమ్ న్యూస్):** సుల్తానాబాద్ మండలంలోని సాంబయ్యపల్లె గ్రామానికి చెందిన కవ్వంపల్లి హనుమయ్య ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను ఓదార్చేందుకు కవ్వంపల్లి మహా కుటుంబం సభ్యులు ఈ రోజు గ్రామాన్ని సందర్శించారు. మరణించిన హనుమయ్య కుమారులు కవ్వంపల్లి రాజు (హెడ్ కాన్స్టేబుల్), ఇతర కుటుంబ సభ్యులను వారు ఆత్మీయంగా పరామర్శించారు. ఈ క్లిష్ట సమయంలో కవ్వంపల్లి మహా కుటుంబం ఎల్లప్పుడూ వారికి అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. అంతకుముందు హనుమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మహా కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో కవ్వంపల్లి మహా కుటుంబ కో ఆర్డినేటర్ కవ్వంపల్లి భూమేష్, ట్రెజరర్ కనుకరాజు, సభ్యులు మల్లేశం, రవీందర్, బాపయ్య తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలో డ్రైనేజీల శుభ్రతకు ప్రత్యేక చర్యలు

### చైర్ పర్సన్ సామినేని సుజాత



**మధిర, ప్రతినిధి మే 29:(ది క్రైమ్ న్యూస్):** మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత ఆదేశాలతో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలోని మెయిన్ డ్రైనేజీల పూడిక తొలగింపు పనులు వేగవంతంగా చేపట్టారు. ఇందుకోసం రాజమండ్రి నుండి ప్రత్యేక కార్మికులను తీసుకువచ్చి శుక్రవారం నాడు 11వ వార్డులో డ్రైనేజీ శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని 11వ వార్డ్ కౌన్సిలర్ గద్దల మాధురితో కలిసి చైర్‌పర్సన్ పర్యవేక్షించారు. వర్షపు నీరు సాఫీగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా పట్టణంలోని ప్రధాన డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన పూడికను త్వరితగతిన తొలగించి శుభ్రపరచాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డ్ కౌన్సిలర్ గద్దల మాధురి, 12వ వార్డ్ కౌన్సిలర్ మోదుగు నాగలక్ష్మి, గద్దల నాని, మోదుగు బాబు, రాజా తదితరులు పాల్గొన్నారు.

## నగరం లోని 38, 39వ డివిజన్‌లలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన నగర మేయర్ కోలగాని శ్రీనివాస్



**కరీంనగర్ టౌన్, మే29(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 38వ డివిజన్‌లో సి.ఎస్.ఆర్ ఫండ్స్ కింద ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను నగర మేయర్ కోలగాని శ్రీనివాస్ గారు ప్రారంభించారు. అనంతరం రూ.10.80 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే 39వ డివిజన్‌లో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు కల్వర్టు నిర్మాణ పనులకు మేయర్ గారు శంకుస్థాపన చేసి అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు , 38వ డివిజన్ కార్పొరేటర్ దేవసాని సరస్వతి-సత్యనారాయణ , 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేష్ , 49వ డివిజన్ కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి-ప్రకాష్ , 47వ డివిజన్ కార్పొరేటర్ గాజ రామ-శివరాం , 37వ డివిజన్ కార్పొరేటర్ కె.ఎపిపి చంద్ర , కాలనీ వాసులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పంట వ్యర్థాలకు నిప్పు పెడితే చర్యలు తప్పవు: ఎస్ఐ సిరిసిల్ల అశోక్



**ఇల్లంతకుంట, మే29(ది క్రైమ్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని గ్రామాల్లో పంట వ్యర్థాలకు నిప్పు పెడితే రైతులపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ సిరిసిల్ల అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల తాళ్లపల్లి, అనంతారం గ్రామాల్లో వరికొయ్యలకు నిప్పు పెట్టడం మూలంగా జరిగిన ప్రాణ,ఇతర నష్టాలను దృష్టిలో పెట్టుకొని పొలాల్లో ,చేన్లలో పంట వ్యర్థాలను కాలపవెట్టకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు. పంట వ్యర్థాలను తగలబెట్టడంతో పంటకు అవసరమైన బ్యాక్టీరియా చనిపోయి సారవంతమైన నేలలు దెబ్బతినడమే కాక ఇతర రైతుల పొలాలు మోటర్లు, పైపులైన్లు, విద్యుత్ వైర్లు, స్టార్టర్లు, జంతువులు, మనుషుల ప్రాణాలకు ప్రమాదకరంగా మారే పరిస్థితి నెలకొంటుందని, ఇలా చేస్తే నాన్ బెయిలబుల్ క్రిమినల్ కేసులు నమోదు చేసి జీవో నెంబర్ 27ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ప్రకటన ద్వారా హెచ్చరించారు.

## భాదితుడిని ఆసుపత్రిలో పరామర్శించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



**శంకరపట్నం, మే29(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలకేంద్రానికి చెందిన సామల శ్రీనివాస్ ఇటీవల రహదారి ప్రమాదానికి గురై హైదరాబాద్లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం బాధితుడిని పరామర్శించారు. శ్రీనివాస్ వైద్య నివేదికలను పరిశీలించి ఆరోగ్య పరిస్థితిని వైద్యులనడిగి తెలుసుకున్నారు. టిపీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బండారి తిరుపతి, హనుమంతు తదితరులు ఎమ్మెల్యే వెంట పరామర్శలో ఉన్నారు.

## పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్‌ని పరామర్శించిన బిజెపి నాయకులు



**మధిర, ప్రతినిధి మే 29:(ది క్రైమ్ న్యూస్):** మధిర పట్టణంలో రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షులు, మాజీ పోలీస్ గృహ నిర్మాణ శాఖ కోళ్ల మాంసం అభివృద్ధి శాఖ చైర్మన్ పుర ప్రముఖులు పెద్దలు పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్‌నీ ఇటీవల మోకాలకు శస్త్ర చికిత్స చేయించుకొని మధిరలో విశ్రాంతి తీసుకుంటున్న సందర్భంలో శుక్రవారం నాడు మధిర బిజెపి నాయకులు ప్రసాద్‌ని తమ స్వగృహంలో కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మధిర మండల అధ్యక్షులు గడ్డం శ్రీహరి చౌదరి, కంటెస్టెడ్ అభ్యర్థి పెరుమాళ్ళపల్లి విజయరాజు, బిజెపి జిల్లాకార్యదర్శి రామిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలలో పని చేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగులను తొలగించే ప్రయత్నాలను మానుకోవాలి

### భారత్ మజ్దూర్ సంఘ్ నేతల డిమాండ్



**కరీంనగర్ టౌన్, మే29(ది క్రైమ్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలలో పని చేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగులను తొలగించే ప్రయత్నాలను వెంటనే మానుకోవాలని భారత్ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర నాయకులు విజయ్ డిమాండ్ చేశారు. మహాత్మా జ్యోతి బాపూలే గురుకులాల నాన్ టీచింగ్ స్టాఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమావేశం శుక్రవారం రోజున కరీంనగర్లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గత 2017 సంవత్సరం నుండి స్వీపింగ్, హౌస్ కీపింగ్, సెక్యూరిటీ, శానిటేషన్ తదితర విభాగాల్లో సేవలు అందిస్తున్న కార్మికులను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా కాంట్రాక్టర్లకు టెండర్ ఇవ్వడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు.గురుకుల విద్యాసంస్థలు సక్రమంగా నడవడంలో నాన్ టీచింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని, అలాంటి కార్మికులను ఒక్కసారిగా విధుల నుండి తొలగించడంతో వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తుందన్నారు సమావేశముఖ్య అతిథి బి ఎం ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పప్పుల సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు నిరుద్యోగ నిర్మూలన, యువతకు ఉద్యోగాల కల్పన గురించి మాట్లాడుతూనే, మరోవైపు ఇప్పటికే పనిచేస్తున్న కార్మికుల ఉద్యోగాలను తొలగించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనాలు,ఈఎస్ఐ,పీఎఫ్ వంటి హక్కులను అమలు చేయాలని డిమాండ్ చేశారు.వెంటనే తొలగింపుల నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి ఎం ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పసుల శ్రావణ్, కార్యదర్శి తొర్తి శ్రీనివాస్ నాయకులు మెండే శివశంకర్,అంజన్న,సుజాత, నిర్మల, భాగ్యగురుకుల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలపై మైన్స్ కమిటీలో యాజమాన్యంతో చర్చించిన ఏఐటీయూసీ నాయకులు



**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) :** కొత్తగూడెం ఏరియా పీవీకే-5 ఇంక్లైన్‌లో శుక్రవారం ఉదయం నిర్వహించిన మైన్స్ కమిటీ సమావేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, గని పరిసరాల్లో ఉన్న మౌలిక సదుపాయాల లోపాలు, భద్రతా అంశాలు మరియు కార్మిక సంక్షేమానికి సంబంధించిన విషయాలపై గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యంతో సవివరంగా చర్చించారు. ఈ సమావేశానికి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి భూక్యా రమేష్ నాయకత్వం వహించారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ సింగరేణి సంస్థ అభివృద్ధి, ఉత్పత్తి లక్ష్యాల సాధనలో కార్మికుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. గనుల్లో ప్రతిరోజూ ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు తగిన సంక్షేమ సదుపాయాలు, పరిశుభ్రమైన వాతావరణం, భద్రతా ప్రమాణాలు మరియు మౌలిక సదుపాయాలు కల్పించడం యాజమాన్య బాధ్యత అని స్పష్టం చేశారు. కార్మికుడు ఆరోగ్యంగా, మానసికంగా ప్రశాంతంగా ఉంటేనే గైర్హాజరు కాకుండా విధులకు హాజరవుతూ సంస్థ ఉత్పత్తి లక్ష్యాలను చేరుకునేలా కష్టపడతాడని తెలిపారు. ప్రత్యేకంగా గని పరిసరాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మైన్స్ కమిటీ సభ్యులు, గని మేనేజర్‌తో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. మాన్‌వేకు వచ్చే దారిలో వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందని గుర్తించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని వెంటనే డ్రైనేజీ మరియు నీటి మళ్లింపు చర్యలు చేపట్టాలని యాజమాన్యాన్ని కోరారు. అలాగే స్నానాల గదులు, కార్మికులు ఉపయోగించే సాధారణ ప్రదేశాల్లో ప్రతిరోజూ శుభ్రత నిర్వహించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రత లోపిస్తే కార్మికుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని, అలాంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రతి కార్మికుడికి అండగా నిలిచి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని పేర్కొన్నారు. గనుల్లో పనిచేసే ప్రతి కార్మికుడి సంక్షేమం, భద్రత, ఆరోగ్యం విషయంలో యాజమాన్యం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ శ్యాంప్రసాద్, ఎస్ఓ అనిల్ సాగర్, ఎల్‌హెచ్‌డీ మరియు కామన్ సెక్షన్ ఇంచార్జి శ్రవణ్, యాక్టింగ్ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేష్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి భూక్యా రమేష్, మైన్స్ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, సందీప్, సుమన్, సురేందర్ రెడ్డి, దేవుసింగ్, కె. రాంచందర్, శశివర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వి,వోఏ,లు సమస్యలు పరిష్కరించాలి... బోనకల్ తాసిల్దార్ కార్యాలయం ఎదుట వివోఏలు సమ్మె



**మధిర, ప్రతినిధి(ది క్రైమ్ న్యూస్):** సమస్యల పరిష్కారానికై ఐకెపి వివోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాడు ఐదవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మధిర నియోజవర్గం బోనకల్ మండల వివోఏ అధ్యక్షురాలు బోయినపల్లి దివ్య మాట్లాడుతూ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టినట్లు తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం అందుతున్న స్వల్ప వేతనాలతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ వర్తింపు చేయాలని, అర్హులైన వివోఏ లకు సీసీలుగా పదోన్నతి కల్పించాలని, సాధారణ , ఆరోగ్య భీమా సౌకర్యం రూ. 20 లక్షలు కల్పించాలని, 58వ జీవోను సవరించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మండల ఎమ్మార్వో కార్యాలయం ముందు నిర్వహించిన సమ్మె కార్యక్రమంలో బోనకల్ మండలనికి చెందిన వివోఏలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బోనకల్ మండలం ఏపిఎం కొట్టే వెంకటేశ్వర్లు, సీసీ నాగమణి, శిరోమణి, వెంకట్ రావమ్మ, అకౌంటెంట్ రత్నకుమారి, కంప్యూటర్ ఆపరేటర్ రవి, హెచ్చిసి సీఈవో సాయి, వివోఏ మండల సంఘం మండల అధ్యక్షులు బోయినపల్లి దివ్య, ఉపాధ్యక్షులు మీరాబి , కార్యదర్శి దారెల్లి దివ్య , కోశాధికారి ఉష,సహాయ కార్యదర్శి ప్రమీల, మరియు వివోఏల సంఘం సభ్యులు సజ్జన, కృష్ణవేణి, శ్రావణి, శాంతి, రమాదేవి, వివో ఏ పైడిపల్లి కృష్ణ, వివో ఏ బలగాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు తప్పు చేస్తే సహించేది లేదు....

**మధిర బిఆర్ఎస్ నాయుకులు**




**మధిర, ప్రతినిధి(ది క్రైమ్ న్యూస్):** మధిర మున్సిపాలిటీ లో జరుగుతున్న అవినీతి, అక్రమ టెండర్ లకు బిఆర్ఎస్ పార్టీ నాయకుడు శుక్రవారంనాడు మీడియా సమావేశంలో మాట్లాడుతూ అడుగడుగున వెతిరేకిస్తాం. చెరువు మట్టిపై 50లక్షలు ప్రజాధనం అక్రమార్కులు దోచుకుంటున్నారు అని అన్నారు. అభివృద్ధి పనులకు మేము అడ్డు కాదని అన్నారు. ప్రతి అభివృద్ధి పనులు కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ కాంట్రాక్టర్లు, కాంగ్రెస్ పార్టీకి సహకరించే అధికారులు దోచుకుంటున్నారని ఈ విషయం మల్లు భట్టి విక్రమార్కకు తెలుసా లేదా ఎద్దేవా చేశారు. మున్సిపాలిటీ జరుగుతున్న అభివృద్ధి పనులకు భారత రాష్ట్ర సమితి సహకరిస్తుందని కానీ అభివృద్ధి పేరుతో ప్రజల సొమ్ము అక్రమంగా దోచుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. కౌన్సిలర్ అయ్యపారావు, సొసైటీ చైర్మన్ కృష్ణ ప్రసాద్, టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పల్లెపోతులు వెంకటేశ్వర్లు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారి నాగేశ్వరరావు, మాజీ శివాలయం కమిటీ చైర్మన్, వంకాయలపాటి నాగేశ్వరావు, మెంటల్ నాయకులు ఉమామహేశ్వర్ రెడ్డి, అరికె శీను బొగ్గుల భాస్కర్ రెడ్డి, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ తీగలు తగిలి పాడి గేదె మృతి

**బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని అధికారులకు ఆదేశాలు**



**నల్గొండ, ప్రతినిధి మే 29(ది క్రైమ్ న్యూస్):** హాలియా మున్సిపాలిటీ 12వ వార్డు కేవీ కాలనీకి చెందిన వల్కి చెన్నమ్మ భర్త జనార్ధన్‌కు చెందిన పాడి గేదె గురువారం (28/05/2026) ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనతో బాధిత కుటుంబం తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటోంది. జీవనాధారంగా ఉన్న పశువు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. ఘటన విషయం తెలుసుకున్న హాలియా మున్సిపాలిటీ చైర్మన్ మరియు 12వ వార్డు కౌన్సిలర్ సలహాదారు సంఘటన స్థలానికి చేరుకుని మృతి చెందిన గేదెను పరిశీలించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారికి తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి, బాధిత కుటుంబానికి తక్షణ నష్టపరిహారం అందించాలని కోరారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా విద్యుత్ తీగల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచనలు చేశారు.

# చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతు ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు





**నల్గొండ జిల్లా । మిర్యాలగూడ మే 29 (ది క్రైమ్ న్యూస్):** నల్గొండ జిల్లా మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యాద్గార్పల్లి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. చేపల వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు చెరువులో మునిగి గల్లంతవడంతో గ్రామంలో ఆందోళన నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాద్గార్పల్లి గ్రామానికి చెందిన నూకల లక్ష్మయ్య (60) తన కుమారుడు నూకల శంకర్ (38) కనిపించడం లేదని మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నూకల శంకర్ మత్స్యకారుడిగా జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో శంకర్ తనకు పొరుగువారైన మరో ముగ్గురు మత్స్యకారులతో కలిసి యాద్గార్పల్లి చెరువులో చేపల వలలు వేయడానికి వెళ్లినట్లు సమాచారం. ఈ సమయంలో బలమైన గాలుల ప్రభావంతో ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయి మునిగిపోయినట్లు తెలిసింది. ఘటనపై సమాచారం అందుకున్న మిర్యాలగూడ రూరల్ పోలీసులు వెంటనే స్పందించి గాలింపు చర్యలు ప్రారంభించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాల సహాయంతో చెరువులో విస్తృతంగా గాలింపు కొనసాగిస్తున్నప్పటికీ, శుక్రవారం సాయంత్రం వరకు శంకర్ ఆచూకీ లభించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# కొబ్బరి నీళ్లు ఏ టైమ్‌లో తాగాలి..?

సమ్మర్ సీజన్‌లో ఇష్టమైన పండ్లు తింటే ఆ మజాయే వేరు. మామిడి పండ్లు, ముంజలను తినడానికి చాలామంది ఇష్టం చూపుతారు. అయితే వేసవిలో శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవడం చాలా ముఖ్యం కూడా. అందుకే బాడీని కూల్ చేసే వాటిని తీసుకోవాలి. అందులో మొదటిది కొబ్బరినీళ్లు. ఒక కొబ్బరి బోండం నీళ్లు తాగితే రోజంతా హుషారుగా ఉండవచ్చు. అదే సమయంలో బాడీని కూల్ చేస్తుంది కూడా. కొబ్బరి నీళ్లలో కాల్షియం, మాంగనీస్ లాంటివి ఉంటాయి. సమ్మర్‌లో కొబ్బరి నీళ్లు తాగడం వల్ల అనేక రకాల బెనిఫిట్స్ ఉన్నాయి. అయితే చాలామంది సమయ పాలన లేకుండా కొబ్బరి నీళ్లు తాగుతుంటాయి. అయితే సమయంలో తాగడం అనేది కూడా తెలుసుకోవాలి. కొబ్బరినీళ్లు ఏ సమయంలో తాగాలి అనే ప్రశ్న చాలమంది ఉంది. కొంతమంది ఖాళీ కడుపుతో తీసుకుంటే.. మరికొందరు మధ్యాహ్నం తాగడం మంచిదని భావిస్తుంటారు. ఈ విషయమై జైపూర్‌కు చెందిన డైటీషియన్ మాట్లాడుతూ భోజనంతో లేదా తర్వాత అసలు తాగకూడు. గుండెల్లో మంట సమస్య ఉన్నవారు ఖాళీ కడుపుతో కొబ్బరి నీటిని తాగాలి. అయితే, ఖాళీ కడుపుతో ఈ హెల్తీ డ్రింక్ తాగడం వల్ల అనేక ఇతర ప్రయోజనాలు ఉన్నాయి. ఉదయాన్నే తాగడం వల్ల జీవక్రియ పెరుగుతుంది. అంతేకాదు బరువును తగ్గిస్తుంది కూడా. కడుపు ఆరోగ్యంగా ఉంటే శరీరం అనేక వ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యల నుండి రక్షించబడుతుంది. అయితే సమస్యలతో భాధపడేవారు నిపుణుల సలహా మేరకు మధ్యాహ్నం కూడా తాగవచ్చు. సమ్మర్ సీజన్ కాబట్టి కొబ్బరి నీరు తీసుకోవడం ముఖ్యం. కానీ కిడ్నీ సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు కొబ్బరినీళ్లు తాగకూడదు. ఇది అధిక మొత్తంలో పొటాషియం ఉంటుంది కాబట్టి మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం పెరుగుతుంది. అలాంటివారు డాక్టర్ల సలహా తీసుకోవాల్సి ఉంటుంది.

# జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు అరుణ్ కుమార్‌కు ఘన సన్మానం

**- రెండోసారి ఎస్సీ సెల్ పగ్గాలు చేపట్టిన కొరివి అరుణ్ కుమార్‌కు కాంగ్రెస్ శ్రేణుల అభినందన - ఎస్సీ విభాగాన్ని ముందుండి నడిపించాలి అరుణ్ కుమార్‌కు నేతల పిలుపు**




**కరీంనగర్ టౌన్, మే29(ది క్రైమ్ న్యూస్):** రెండవసారి కరీంనగర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షునిగా నియమితులైన కొరివి అరుణ్ కుమార్‌ని నేడు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న వెంకటరాంరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు పులి అంజనేయులు గౌడ్, కిసాన్ సెల్ అధ్యక్షులు పురం రాజేశం, మైనారిటీ సెల్ అధ్యక్షులు మహ్మద్ తాజ్, ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రవణ్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే కొత్తపల్లి మండల కిసాన్ సెల్ అధ్యక్షులు సిరిపురం నాగప్రసాద్, కరీంనగర్ జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ సిరిపురం లావణ్య, జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు అబ్దుల్ రహమాన్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ అబ్దుల్ అమీర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోపాల్ రెడ్డి తదితరులు అరుణ్ కుమార్ ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, అరుణ్ కుమార్ నాయకత్వంలో జిల్లా ఎస్సీ విభాగం మరింత బలోపేతం అవుతుందని, పార్టీ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తారని ఆకాంక్షించారు.

# ఉపాధి హామి నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాకు ఉపాధి హామి పథకం క్రింద మంజూరైన మెటీరియల్ కాంపోనెంట్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పంచాయతీ రాజ్ శాఖ అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జూన్ రెండవ వారం నాటికి ఉపాధి హామి పథకం క్రింద మంజూరైన నిధుల వినియోగం పూర్తి కావాలని తెలిపారు. జూన్ చివరి వరకు మంజూరైన ఉపాధి హామి పనులను ప్రత్యేక శ్రద్ధతో గ్రౌండింగ్ చేస్తూ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న నాలుగు తహసీల్దార్ కార్యాలయాల పనులను జూన్ రెండవ వారం నాటికి పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. పెద్దపల్లి మండలం రాఘవపూర్ లో నిర్మిస్తున్న ఇందిరా మహిళ శక్తి జిల్లా భవనం పనులను పూర్తి చేసి జూన్ 2న ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఈఈ పంచాయతీరాజ్ శంకరయ్య, డి ఆర్ డి ఓ కాళిందిని, కలెక్టరేట్ ఏవో బండి ప్రకాష్, డీఈలు, ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడ నియోజకవర్గంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**పేదలకు కొండంత అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**



**నల్గొండ జిల్లా ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) మే 29:** మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పంపిణీ చేశారు. మిర్యాలగూడ మండలం, వేములపల్లి మండలం, మాడ్గులపల్లి మండలం మరియు మిర్యాలగూడ పట్టణానికి చెందిన మొత్తం 150 మంది లబ్ధిదారులకు రూ.60 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. అనంతరం మాడ్గులపల్లి మండలానికి చెందిన కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు కూడా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యం చేయించుకోలేని నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ వరంలాంటిదని పేర్కొన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సకాలంలో ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం, ఆపదలో ఉన్న ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకునేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# బాదం పప్పు నానబెట్టి తింటేే మంచిదా?

చాలా మందికి రోజూ ఉదయాన్నే నానబెట్టిన బాదంపప్పు తినడం అలవాటు. అయితే బాదంపప్పు నానబెట్టి తింటే మంచిదా.. లేదంటే అలాగే పచ్చిగా తింటే మంచిదా అనే సందేహం కూడా చాలా మందిలో ఉంటుంది. బాదంపప్పు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. కానీ మీరు సరైన పద్ధతిలో తింటేనే ప్రయోజనాలు పొందవచ్చు. కాబట్టి బాదంపప్పును పచ్చిగా తినాలా? నానబెట్టి ఎలాతినాలా అనే విషయం ఇప్పుడు తెలుసుకుందాం.. బాదంలో విటమిన్లు, ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. అంతేకాకుండా బాదంలో కాల్షియం, ఫాస్పరస్ కూడా ఉన్నాయి. ఇవి శరీరానికి పోషకాలను అందిస్తాయి. బాదం పప్పును ఉదయాన్నే పరగడుపున తీసుకుంటే ప్రయోజనాలు పొందవచ్చు. ఇందుకోసంరాత్రి పడుకునే ముందు కొన్ని బాదంపప్పులను నీళ్లతో వేసి నానబెట్టాలి. తర్వాతవాటిని తొక్క తీసి ఉదయం పూటా ఖాళీ కడుపుతో తినాలి. అలాగే బాదంపప్పును స్నాక్‌గా కూడా తినవచ్చు. పచ్చి వాటి కంటే నానబెట్టిన బాదం శరీరానికి ఎక్కువ మేలు చేస్తుంది. అలాగే బాదం షేక్ చేసి కూడా తాగొచ్చు. కానీ బాదంలో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల బరువు పెరగడానికి దారితీయవచ్చు. అందుకే వీటిని పరిమితంగా మాత్రమే తీసుకోవాలి. నట్‌ఎలర్జీ ఉన్నవారు వాటిని తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మర్చిపోకూడదు. ఎలర్జీ ఉన్న వారు వీటికి దూరంగా ఉండటం బెటర్.

# పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని మాస్ లైన్ నిరసన




**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** కేంద్ర ఎన్ డి ఏ బిజెపి ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్ తదితర నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా, మే 29న శుక్రవారం వైరాలో పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సివైపుల్లయ్య మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 12 సంవత్సరాల నుండి పేద ప్రజల మీద మధ్యతరగతి ప్రజల మీద పెట్రోలు, డీజీలు, గ్యాస్ నిత్యవసర సరుకులుబస్ ఛార్జీలు, రైల్వే చార్జీలు, విమానా చార్జీలు, ఆరోగ్యానికి సంబంధించిన మందులు, కిరాణా,వ్యవసాయ పంటలకు సంబంధించిన ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ వంటి ధరలు పెంచే పేదలు మధ్యతరగతి వర్గాల మీద భారాలు మోపటం నరేంద్ర మోడీ దుర్మార్గమైన పరిపాలనకు నిదర్శనమని విమర్శించారు. విశ్వ గురువుగా చెప్పుకుంటూ ప్రజలను హింసించడం, మానసికంగా వేధించటం ప్రజల జీవితాలలో నరకయాతనగా మార్చటం ఏ మేరకు సమంజసమైనదని ఆయన ప్రశ్నించారు. నరేంద్ర మోడీ బిజెపి ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం అధికారులకు వచ్చిన తర్వాత స్వదేశీ విదేశీ భవన జాతి కంపెనీల ప్రయోజనాల కోసం లాభాల కోసం పాటుపడుతున్నారని, ప్రజలను గాలికి వదిలేసినారని ఆయన విమర్శించారు . ప్రజలు కేంద్ర బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా వ్యతిరేక విధానాల మీద ఉద్యమిస్తుంటే, మతోన్మాదాన్ని, అల్లర్లను రెచ్చగొట్టి ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోకుంటే భవిష్యత్తులో ప్రజల చేత తిరస్కరించబడతారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎలదండి బాబు, పార్టీ పట్టణ నాయకులు పరసా బద్రి, కన్నెగంటి అశోక్, సర్వేష్,పాషా, వెంకటేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు

# 1వ డివిజన్ టి ఎన్ జి వో కాలనీ నాణ్యత లేని సైడ్ డ్రైనేజీ నిర్మాణం కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలంటున్న కాలనీ వాసులు





**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** నగరంలో టీఎన్జీవో కాలనీ ఏర్పడి 20 ఏళ్ళు అయిన ఎటువంటి అభివృద్ధికి కాలనీ నోచుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో 1వ డివిజన్ పరిధిలోని టీఎన్జీవో కాలనీలో సైడ్ డ్రైన్లు మంజూరు కావడం మంజూరైన డ్రైనేజీ నిర్మాణ పనులు నాణ్యత లేకుండా జరుగుతున్నాయని కాలనీ వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణంలో నాసిరకం సామగ్రిని ఉపయోగించడం వల్ల డ్రైనేజీ గోడలు ఇప్పటికే పగుళ్లు ఏర్పడుతున్నాయని లింక్ రహదారుల వద్ద సైడ్ డ్రైనేజీపై వేస్తున్న స్లాబుల్లో నాన్యత లేదని ఆరోపించారు. పనులు పూర్తికాకముందే సిమెంట్ పొరలు ఊడిపోతుండటంతో నివాస టీఎన్జీవో కాలనీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడ్డారు. అధికారులు వెంటనే పనులను పరిశీలించి, నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల డబ్బుతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో అవినీతి, నిర్లక్ష్యం చోటుచేసుకోవడం బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి, డ్రైనేజీ పనులను పరిశీలించి సక్రమంగా పూర్తి చేయించాలని, లేదంటే ఆందోళనలు చేపడతామని కాలనీ వాసులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఖమ్మం జిల్లా కౌన్సిల్ సభ్యులు బోడా వీరన్న, రిటైర్డ్ ఎంపిడిఓ బానోతు రాంచందర్ రావు, మరియు అనుముల సోమయ్య, నాగాచారి, కొండబోలు గీతారామారావు, మేడెపల్లి రవిబాబు, వెంకటేశ్వర్లు (సిఎం) మారం శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మయూరి నగర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం : ఉప్పలపాటి శ్రీకాంత్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీ వాసులు కాలనీలో ఉన్న పలు సమస్యలు, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, మౌలిక వసతులు, ఇతర ప్రజా సమస్యలపై స్థానికులు తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా స్పందించిన ఉప్పలపాటి శ్రీకాంత్ మాట్లాడుతూ మయూరి నగర్ కాలనీలో ఉన్న సమస్యలను త్వరలోనే స్వయంగా పర్యటించి పరిశీలిస్తానని తెలిపారు. సమస్యలను విడతల వారీగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు, తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకుని పిఏసి చైర్మన్ అరెకపూడి గాంధీ ప్రత్యేక చొరవతో డివిజన్‌లో అత్యవసర ప్రాంతాలకు ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. మయూరి నగర్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని, ప్రజలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యమని తెలిపారు. అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, ఎక్కడా రాజీపడకుండా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచిస్తామని చెప్పారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, పనుల్లో జాప్యం లేకుండా వేగంగా పూర్తి చేసి ప్రజల వినియోగానికి తీసుకురావడమే లక్ష్యమని ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కే రామరాజు, కిషోర్, ప్రవీణ్ రెడ్డి, రమణ రెడ్డి, రవీంద్ర వర్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై అరెస్ట్ వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధం : సీపీఎం నేతలు



**నల్గొండ జిల్లా । మిర్యాలగూడ (ది క్రైమ్ న్యూస్): మే 29** ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, మాజీ శాసనమండలి సభ్యుడు ను అరెస్ట్ చేస్తామని చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) ప్రకారం ప్రతి పౌరుడికి భావ ప్రకటన స్వేచ్ఛ కల్పించబడిందని, అలాంటి హక్కులను హరించే విధంగా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యల్లో ఎక్కడా కులం లేదా ప్రాంత ప్రస్తావన లేదని, అయినప్పటికీ ఆయనపై కులచిచ్చు పెట్టే ప్రయత్నం చేశారనే ఆరోపణలు చేయడం అర్థరహితమని పేర్కొన్నారు. అసలు కులం, ప్రాంతం అంశాలను ప్రస్తావించినవారే ఇప్పుడు అరెస్టు చేస్తామని మాట్లాడటం విచారకరమన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ కేవలం ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై మాత్రమే కాకుండా దేశ, విదేశాల పరిస్థితులపై కూడా విశ్లేషణలు చేస్తూ సమాజానికి అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తారని తెలిపారు. రైల్వే జోన్, ఓఎన్జీసీ ఆయిల్ నిక్షేపాలు వంటి అంశాలపై రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు స్పందించలేదని, కానీ వ్యక్తిగత విమర్శలు చేసి అరెస్టు చేస్తామని హెచ్చరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. చౌకబారు విమర్శలతో ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యక్తిత్వాన్ని దెబ్బతీయాలని ప్రయత్నించవద్దని సీపీఎం నేతలు సూచించారు. ఈ సమావేశంలో తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జ్యోతిరావు పూలే, జ్ఞానసూర్యుడు అంబేడ్కర్ అవార్డుల ప్రధానోత్సవ వేడుకలు






**కరీంనగర్ టౌన్, మే29(ది క్రైమ్ న్యూస్):** సామాజిక న్యాయం, మానవ హక్కుల పరిరక్షణ మరియు భారతదేశ మార్పు కోసం సామాజిక సేవ చేసిన పలువురికి "జ్యోతిరావు పూలే – జ్ఞానసూర్యుడు అంబేడ్కర్" అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హైకోర్టు అడ్వకేట్ లీగల్ అడ్వైజర్ బట్టు శ్రీనివాస్, ఆల్ ఇండియా ముస్లిం మైనారిటీ ఫోరమ్ అధ్యక్షులు షేక్ ఇస్లాముద్దీన్, మరియు హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు మంగళపెల్లి హుస్సేన్ హాజరయ్యారు. ముఖ్య అతిధుల ప్రసంగం: ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "ఈ దేశం మనకు ఏమి ఇచ్చింది కాదు, మనం దేశానికి ఏమి ఇచ్చాం అనేదే ముఖ్యం" అనేగొప్ప భావనతో ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గతంలో హైదరాబాద్‌లో ఇలాంటి కార్యక్రమాలను జరిపామని, ఇప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు కరీంనగర్ లాంటి పెద్ద జిల్లాలో ఈ వేడుకలను నిర్వహించడం ఎంతో గర్వకారణంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ మానవ హక్కుల గురించి పూర్తి అవగాహన ఉండాలని వారు పేర్కొన్నారు. సమాజ మార్పు కోసం, న్యాయం కోసం నిరంతరం శ్రమించిన మహాత్మా జ్యోతిరావు పూలే, డా. బి. ఆర్. అంబేడ్కర్ ఆశయాలను, వారి జీవిత విశేషాలను నేటి తరం తప్పక తెలుసుకోవాలని మరియు వారి అడుగుజాడల్లో నడవాలని అతిథులు ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో అవార్డు గ్రహీతలు, సామాజిక కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మిట్టపెల్లి రాజు కుమార్, తెలంగాణ వైస్ ప్రెసిడెంట్, పొన్నల తిరుపతి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్, జట్టు పల్లి అనిల్ కుమార్ జిల్లా అధ్యక్షులు, కాల్వ మధుబాబు, కరీంనగర్ జిల్లా కో ఆర్డినేటర్, పొన్నాల శంకర్, వైస్ ప్రెసిడెంట్, కుంట సుజాత, జాయింట్ సెక్రటరీ, వొగెటి సుహాసిని, ప్రెసిడెంట్, కరింగుల సుజాత, జనరల్ సెక్రటరీ, తదితరులు పాల్గొన్నారు.

# నూతన గ్రంథాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ టౌన్, మే29(ది క్రైమ్ న్యూస్):** నగరపాలక సంస్థ పరిధిలో రూ.7 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న నూతన గ్రంథాలయ భవన నిర్మాణ పనులను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులతో కలిసి తనిఖీ చేసిన ఆయన, పనులను నాణ్యతతో పాటు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నూతన గ్రంథాలయం విద్యార్థులు, యువత మరియు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఎంతో ఉపయోగపడే విధంగా ఆధునిక సదుపాయాలతో నిర్మిస్తున్నట్లు మేయర్ తెలిపారు. నగర ప్రజలకు విజ్ఞాన కేంద్రంగా ఈ గ్రంథాలయం నిలవాలని ఆకాంక్షించారు. భవన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ప్రతి దశలో ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. స్మార్ట్ సిటీ అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టు నగరానికి ప్రత్యేక గుర్తింపును తీసుకురానుందని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మా భూమిలో అక్రమ నిర్మాణాలు ఆపివేయండి....




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రభుత్వం మాకు కేటాయించిన స్థలంలో, అక్రమంగా నిర్మిస్తున్నా కట్టడాలను ఆపివేయాలంటూ భాదితులు మీడియాతో వాపోయారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రామంచ అనసూర్య పురుషోత్తం దంపతులు మాట్లాడుతూ మాకు 1986లో కూనారాం రోడ్ (బీఎన్‌కాలనీ)లో ప్రభుత్వం ప్లాట్ కేటాయించింది. అందులో 65మంది నిర్మాణాలు చేసుకున్నారు. నాకు కేటాయించిన స్థలంలో నేను సైతం పిల్లర్స్ వరకు నిర్మాణం చేసిన, ఆర్థిక ఇబ్బందులతో మధ్యలోనే నిర్మాణ పనులు నిలిపివేశాను. మా పిల్లల పెళ్లి కోసం ఆ స్థలం అమ్మేందుకు ఓదెలు అనే వ్యక్తికి విక్రయించాలని కాగితం రాసుకున్నాం. దానికిగాను బయ్యానగా రూ.2లక్షలు నాకు ఇచ్చారు. ఐతే అతడు ప్లాట్ కొనేందుకు ఆసక్తి చూపకపోవడంతో మధ్యవర్తిగా ఉన్న కొనం సదానందం ఆ ప్లాట్ కొనుగోలు చేస్తా అని చెప్పాడు. కానీ మాకు పైసలు ఇవ్వకుండానే నా ప్లాట్‌లో ముగ్గుపోసి, జేసీబీ సహాయంతో నిర్మాణా పనులు చేస్తున్నాడు. విషయం తెలిసి పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌లో, మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేశా. మున్సిపాలిటీ అధికారులు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేయద్దు అని చెప్పిన, రాత్రి వేళల్లో పనులు అలాగే కొనసాగిస్తున్నారు. నాకు బయ్యానగా ఇచ్చిన రూ.2లక్షలు వాపస్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాలేదా మిగిలిన పైసలు ఇచ్చిన ప్లాట్‌ను అప్పగిస్తాం. అలాకాకుండా అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నా కొనం సదానందం పై చర్యలు తీసుకోవడంతో పాటు, ఆ నిర్మాణాలకు ఇంటి నెంబర్, ఇంటి పర్మిషన్ ఇవ్వకుండా నిలిపివేసి నాకు న్యాయం చేయాలని కోరారు.

# బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ఇంచార్జ్‌ని కలిసిన స్వామి వివేక్ పటేల్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి నియోజకవర్గానికి భారత రాష్ట్ర సమితి పార్టీ సభ్యత్వ నమోదు ఇంచార్జ్‌గా నూతనంగా నియామకం పొందిన ఎమ్మెల్సీ పరిపాటి వెంకటరామిరెడ్డి (ఐఏఎస్ రిటైర్డ్)ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడం, గ్రామ స్థాయిలో పార్టీ కార్యకర్తలను మరింత చైతన్యపరిచే అంశాలపై చర్చించినట్లు తెలిపారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ దిశనిర్దేశం చేసినట్లు ఓ పత్రిక ప్రకటనలో ఆకుల స్వామి వివేక్ పటేల్ తెలిపారు.

## ఇది తింటే రక్తం పలుచుగా అవుతుంది.. గుండె జబ్బులు పరార్

ఈ మధ్య చిన్న వయసులోనే గుండె జబ్బులు వస్తున్నాయ్.. తక్కువ ఏజ్‌లోనే బీపీ సమస్యలు వెంటాడుతున్నాయ్. ఈ కారణాలతో రక్తం చిక్కబడుతోంది. ఆ రక్తాన్ని గుండె సరిగ్గా పంప్ చేయలేకపోతుంది. అందుకే ఈ మధ్య కాలంలో కొంతమంది సమస్యలు ఉన్నా, లేకపోయినా రక్తాన్ని పలుచన చేసే మెడిసిన్ వాడుతున్నారు. ప్రధానంగా తక్కువ నీరు తాగడం, ఎక్కువ ఉప్పు వినియోగం.. నూనె, నెయ్యి లాంటివి ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తం చిక్కగా అవుతుంది. ఆయిల్ లేకుండా, ఉప్పు లేకుండా.. రా ఫుడ్ ఎక్కువ తీసుకోవడం వల్ల రక్తం పలుచగా అవుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మార్నింగ్, ఈవెనింగ్ ఎక్కువ ఉడకని ఆహారానికి ప్రాధాన్యత ఇస్తూ.. మధ్యాహ్నం ఉడికిన ఫుడ్ తిన్నా అందులో ఉప్పు లేకుండా చూసుకుంటే రక్తం చిక్కబడటం ఆగుతుందని చెబుతున్నారు. ఎప్పుడైనా పండక్కి, పబ్బానికి ఉప్పు ఉన్న ఆహారం తింటే పర్లేదు కానీ.. రోజూ ఉప్పు తగినంత వేసిన ఆహారం తింటే తిప్పలు తప్పవంటున్నారు. మనిషి ఆరోగ్య వ్యవస్థను పాడు చేయడానికి ఉప్పే ప్రధాన కారణమని ఆయన అంటున్నారు. మనం తినే ఆహారమే మన హెల్త్‌నుడిపెండ్ చేస్తుందని చెబుతున్నారు.

# స్పోర్ట్స్

# సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్న పంత్

లక్నో సూపర్ జెయింట్స్ సంచలన ప్రకటన చేసింది. తమ జట్టు కెప్టెన్ రిషభ్ పంత్ సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు ప్రకటించింది. ఐపీఎల్ 2026 సీజన్ పూర్తికాక ముందే ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. ఈ సీజన్‌లో లక్నో జట్టు పంత్ నాయకత్వంలో ఆడిన 14 మ్యాచ్‌లలో కేవలం నాలుగింటిలో మాత్రమే విజయం సాధించి పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో కెప్టెన్సీ బాధ్యతల నుంచి తనను తప్పించాల్సిందిగా పంత్ చేసిన అభ్యర్థనను ఫ్రాంచైజీ అంగీకరిస్తూ అధికారిక ప్రకటన విడుదల చేసింది.లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఐపీఎల్ 2026 సీజన్ పూర్తిగా ముగియకముందే.. లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. ఈ విషయాన్ని ఆ ఫ్రాంచైజీ అధికారికంగా సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. ఐపీఎల్ 2026లో పంత్ సారథ్యంలోని లక్నో సూపర్ జెయింట్స్ దారుణ ప్రదర్శన చేసింది. మొత్తం 14 మ్యాచ్‌ల్లో కేవలం నాలుగు మ్యాచ్‌లో గెలిచి పాయింట్ల పట్టికలో అట్టడుగున పడిపోయింది. ఈ నేపథ్యంలో పంత్ కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు."లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించాలని రిషభ్ పంత్ చేసిన అభ్యర్థనను ఫ్రాంచైజీ అంగీకరించింది. ఈ మార్పు తక్షణమే అమల్లోకి వస్తుంది. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం అంత ఈజీ కాదు. కెప్టెన్‌గా రిషభ్ పంత్ ఇప్పటివరకు ఫ్రాంచైజీకి



గొప్పగా సేవలందించాడు" అని లక్నో సూపర్ జెయింట్స్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది. వచ్చే సీజన్‌కు ముందు టీమ్‌ను పునర్నిర్మించడంపై తాము ఫోకస్ పెట్టినట్లు వెల్లడించింది.కాగా ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున కెరీర్ ఆరంభించిన రిషభ్ ఫంత్.. ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు అనూహ్యంగా ఆ జట్టును వీడాడు. దీంతో ఐపీఎల్ 2025 మెగా వేలంలోకి వచ్చేశాడు. ఇతర జట్లతో పోటీ పడి మరి లక్నో సూపర్ జెయింట్స్.. రికార్డు ధర రూ.27 కోట్లు వెచ్చించి.. పంత్‌ను దక్కించుకుంది. వెంటనే కెప్టెన్‌ను చేసింది. అయితే కెప్టెన్‌గా, ఆటగాడిగా పంత్ పూర్తిగా విఫలమయ్యాడు.లక్నో సూపర్ జెయింట్స్ రిషభ్ పంత్ సారథ్యంలో గత సీజన్‌లోనూ ప్లే ఆఫ్స్ చేరకుండానే నిష్క్రమించింది. ఈ సీజన్‌లో అయితే ఇంకా దారుణ ప్రదర్శన చేసింది. పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగు స్థానంలో నిలిచింది. మొత్తంగా పత్ సారథ్యంలో లక్నో.. రెండు సీజన్లలో కలిపి కేవలం 10 మ్యాచ్‌లలో మాత్రమే గెలిచింది. మరోవైపు బ్యాటర్‌గా కూడా పంత్ విఫలమయ్యాడు. ఐపీఎల్ 2025లో మొత్తం 14 మ్యాచ్‌ల్లో కేవలం 269 పరుగులు చేసిన అతడు.. ఈ ఏడాది 312 పరుగులు సాధించాడు. దీంతో విమర్శలపాలయ్యాడు.



# స్మృతి మంధాన గోల్డెన్ డకౌట్

ఇంగ్లండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత మహిళా జట్టు ఓపెనర్ స్మృతి మంధాన ఓ చెత్త రికార్డు నెలకొల్పింది. ఈ మ్యాచ్‌లో స్మృతి ఇన్నింగ్స్ తొలి బంతికే డకౌట్ అయింది. ఇప్పటి వరకు టీమిండియా తరఫున ఇన్నింగ్స్ తొలి బంతికే ఎవ్వరూ డకౌట్ కాలేదు.. ఈ చెత్త రికార్డు అందుకున్న తొలి బ్యాటర్‌గా స్మృతి మంధాన నిలిచింది. ఈ మ్యాచ్‌లో జెమీమా రోడ్రిగ్స్, యస్తికా భాటియా రాణించడంతో భారత్ భారీ స్కోర్ చేసి 38 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై విజయం సాధించింది.ఐసీసీ మహిళల టీ 20 వరల్డ్‌కప్ ముందు టీమిండియా ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ ఆడుతోంది. నాలుగు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా చెమ్స్‌ఫోర్డ్‌లో గురవారం తొలి మ్యాచ్ జరగింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా టెంపరరీ కెప్టెన్ స్మృతి మంధాన ఓ చెత్త రికార్డు నెలకొల్పింది.టీమిండియా ఇన్నింగ్స్ ఆరంభించిన స్మృతి మంధాన తొలి బంతికే అవుటయింది. ఇంగ్లండ్ పేసర్ లారెన్ బెల్ వేసిన బంతిని డిఫెండ్ చేయగా అది చార్లీ డీన్ చేతుల్లోకి వెళ్లింది. దాంతో స్మృతి మంధాన మొదటి బంతికే డకౌట్ అయింది. టీమిండియా ఉమెన్స్ టీ20 చరిత్రలో మొదటి బంతికే డకౌట్ అయిన తొలి బ్యాటర్‌గా చెత్త రికార్డును మూటగట్టుకుంది. టీ20 ఇంటర్నేషనల్ క్రికెట్‌లో భారత మహిళల తరఫున అత్యధిక పరుగులు చేసిన స్మృతి మంధానకు ఇది ఆరో డకౌట్. టీమిండియా ఉమెన్స్ జట్టులో టీ20ల్లో అత్యధిక డకౌట్స్ అయిన ప్లేయర్‌గా మాత్రం షెఫాలీ వర్మ ముందు వరుసలో ఉంది. షెఫాలీ వర్మ ఏడు డకౌట్లతో మొదటి స్థానంలో ఉండగా.. టీమిండియా కెప్టెన్ హర్మత్ ప్రీత్ కౌర్ 6, స్మృతి మంధాన 6, జెమీమా రోడ్రిగ్స్ 6, దీప్తి శర్మ ఆరుసార్లు డకౌట్ అయ్యి ఆ తర్వాత స్థానాల్లో నిలిచారు. ఇక తొలి టీ20 మ్యాచ్‌కి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ దూరమైంది. ఎలాంటి గాయం కానీ, ఫిట్‌నెస్ సమస్య కానీ లేదని.. కేవలం విశ్రాంతి కోసమే ఆమె దూరమైనట్లు టాస్ సమయంలో స్మృతి మంధాన తెలిపింది. మిగతా మ్యాచ్‌లకు హర్మన్ అందుబాటులో ఉంటుందని స్పష్టం చేసింది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే తొలి బంతికే వికెట్ కోల్పోయిన టీమిండియా ఈ మ్యాచ్‌లో మంచి స్కోరే నమోదు చేసింది. షెఫాలీ వర్మ కూడా 2 పరుగులకే అవుటవ్వడంతో మొదటి ఓవర్‌లోనే భారత్ ఓపెనర్లు ఇద్దర్నీ కోల్పోయింది. ఆ తర్వాత యస్తిక భాటియా, జెమీమా రోడ్రిగ్స్ కలిసి టీమిండియా స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. భాటియా 54, రోడ్రిగ్స్ 69 పరుగులు చేయగా ఆఖర్లో దీప్తి శర్మ 22 పరుగులు చేయడంతో భారత్ 188/7 పరుగులు చేసింది. భారత్ అందించిన 189 పరుగుల లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ వికెట్ కీపర్ ఎమీ జోన్స్ 67 పరుగులతో పోరాడినప్పటికీ 20 ఓవర్లలో 150/8 పరుగులు మాత్రమే చేసింది. దాంతో టీమిండియా 38 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. నాలుగు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ ఆధిపత్యంలో ఉంది.

## బీసీసీఐ రూల్స్‌ను మరింత కఠినతరం

ఐపీఎల్ 2026 ఫైనల్‌కి ముందు బీసీసీఐ రూల్స్‌ను మరింత కఠినతరం చేసింది. బీసీసీఐ తీసుకున్న నిర్ణయంతో ఆటగాళ్లు షాక్‌కు గురయ్యారు. బీసీసీఐ యాంటి కరప్షన్ విభాగం తాజాగా తమ దృష్టికి వచ్చిన కొన్ని కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇకపై మ్యాచ్ సమయంలో ప్లేయర్లు కానీ, సపోర్ట్ స్టాఫ్ కానీ తమ స్మార్ట్ గాగూల్స్‌ని సెక్యూరిటీలో అప్పగించాలని.. వాటిని వాడటం నిషేధం అంటూ బీసీసీఐ అన్ని ఫ్రాంఛైజీలకు తెలిపింది. ఇంకో రెండు రోజుల్లో ఐపీఎల్ 2026 ఫైనల్ జరగనుంది. మే 29 అంటే ఈ రోజు క్వాలిఫయర్ 2 మ్యాచ్‌తో ఫైనల్ రేసులో నిలుచునే జట్టు ఖరారు కానుంది. అయితే, ఈ సీజన్ ముగింపునకు వచ్చిన తర్వాత బీసీసీఐ తీసుకున్న ఓ కీలక నిర్ణయం అందరికీ పెద్ద షాక్ ఇచ్చింది. ఆటగాళ్లకు ఇదో బిగ్ వార్నింగ్ అనే చెప్పొచ్చు. ఈ నిర్ణయంతో బీసీసీఐ ఆటగాళ్లపై ఎంత పెద్ద నిఘా పెట్టిందో కూడా అర్థమవుతోంది. ఐపీఎల్ 2026 ముగింపు దశలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఆటగాళ్లు, మ్యాచ్ అధికారుల కోసం కొత్త నిబంధన అమల్లోకి తీసుకొచ్చింది. బీసీసీఐ నిఘా వ్యవస్థ యాంటీ కరప్షన్ యూనిట్ తాజాగా స్మర్ట్ సన్ గ్లాసెస్ వినియోగింపై నిషేధం విధించింది.

# గుజరాత్ బౌలర్లకు ప్యాట్ కమిన్స్ విలువైన సలహా

అందరి కళ్ళు రాజస్థాన్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పైనే ఉన్నాయి. అతని విధ్వంసకర బ్యాటింగ్‌ను అడ్డుకోవడానికి గుజరాత్ బౌలర్లకు సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఒక విలువైన సలహాను అందించాడు. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ ఫామ్ చూస్తుంటే ఏ బౌలర్‌కైనా చెమటలు పట్టడం ఖాయం. బౌలర్ల నామరూపాలు లేకుండా చేస్తూ మైదానంలో అతను సృష్టిస్తున్న బీభత్సం అంతా ఇంతా కాదు. ఎలిమినేటర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలింగ్‌ను ముక్కలు ముక్కలు చేసిన వైభవ్, ఇప్పుడు అదే ముల్లాన్‌పూర్ పిచ్‌పై గుజరాత్‌తో తలపడనున్నాడు. దీంతో గుజరాత్ బౌలింగ్ విభాగం అతడిని ఎలా అవుట్ చేయాలనే దానిపై తీవ్రంగా బుర్ర బద్దలు కొట్టుకుంటోంది. ఏ చిన్న తప్పు చేసినా మ్యాచ్ చేజారిపోతుందనే భయం గుజరాత్ క్యాంప్‌లో స్పష్టంగా కనిపిస్తోంది.ప్రపంచ స్థాయి బౌలర్, సన్‌రైజర్స్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ సైతం వైభవ్ సూర్యవంశీ దెబ్బకు తల్లడిల్లిపోయాడు. ఎలిమినేటర్ పోరులో బంతిని ఎక్కడ వేసినా సరే, వైభవ్ దాన్ని స్టాండ్స్‌లోకి పంపించడమే పనిగా పెట్టుకున్నాడు. ఈ క్రమంలోనే సీనియర్ బౌలర్ అయిన కమిన్స్ తన 4 ఓవర్ల కోటాలో ఏకంగా 64 పరుగులు సమర్పించుకోవాల్సి వచ్చింది. వైభవ్ బ్యాటింగ్ ధాటికి కమిన్స్ ఎంతగా అల్లాడిపోయాడో ఈ గణాంకాలే చెబుతున్నాయి. "వైభవ్ సూర్యవంశీకి వేరే ఎక్కడ బంతి వేసినా వృథానే. అతడిని కట్టడి చేయాలంటే యార్కర్లు, స్లో బంతులు మాత్రమే ఏకైక మార్గం." అని ఎలిమినేటర్ ఓటమి అనంతరం ప్యాట్ కమిన్స్ వ్యాఖ్యానించాడు. తాను అనుభవించిన పరాభవాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈరోజు జరగబోయే క్వాలిఫయర్ 2 మ్యాచ్ కోసం గుజరాత్ బౌలర్లకు కమిన్స్ ఒక కీలకమైన రహస్యాన్ని చెప్పాడు. ముల్లాన్‌పూర్ పిచ్‌పై వైభవ్‌ను ఎదుర్కోవాలంటే కేవలం ఖచ్చితమైన యార్కర్లు, చాకచక్యమైన స్లోయర్ బంతులు మాత్రమే ఉపయోగపడతాయని తెలిపాడు. లైన్ అండ్ లెంగ్త్ కొద్దిగా తప్పినా అతను ఉపేక్షించడని హెచ్చరించాడు. మరి ఈరోజు మ్యాచ్‌లో గుజరాత్ బౌలర్లు కమిన్స్ ఇచ్చిన ఈ సలహాను పాటిస్తారా? లేక వైభవ్ విధ్వంసానికి బలవుతారా? అనేది చూడాలి.క్వాలిఫయర్ 2 పోరులో గెలిచిన జట్టు మే 31న జరిగే గ్రాండ్ ఫైనల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుతో తలపడనుంది. టైటిల్ పోరుకు అర్హత సాధించాలంటే గుజరాత్ జట్టు ముందుగా వైభవ్ సూర్యవంశీ అనే అతిపెద్ద అడ్డంకిని దాటాల్సి ఉంటుంది. ఈ రసవత్తర పోరులో విజయం ఎవరిని వరిస్తుందో కొన్ని గంటల్లో తేలిపోనుంది.



# వినేశ్ ఫొగాట్‌కు సుప్రీంకోర్టులో ఊరట

## ఎంపిక ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అనుమతి

ఏషియన్ గేమ్స్ ట్రయల్స్‌లో పోటీపడే అంశంలో భారత రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఈ నెల జరగనున్న ఆసియా గేమ్స్ ఎంపిక పోటీలలో (సెలక్షన్ ట్రయల్స్) పాల్గొనేందుకు స్టార్ రెజ్లర్ వినేష్ ఫొగాట్‌కు అనుమతి ఇచ్చింది. ఇంతకు ముందు వినేశ్ ఫొగాట్? ఆసియా గేమ్స్ 2026 సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనవచ్చంటూ దిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ భారత రెజ్లింగ్ సమాఖ్య సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు తన పరిధిని మీరిందని, ఎంపిక ప్రమాణాల ప్రకారం వినేశ్ అనర్హురాలని పేర్కొంది. అయితే డబ్ల్యూఎఫ్ఐ పిటిషన్‌ను విచారించిన సుప్రీం దిల్లీ హైకోర్టు ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ స్థానంలో వేరొకరు ఉండి ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేదని, కానీ వినేశ్ ఈ దేశాన్ని గర్వపడేలా చేశారని వెల్లడించింది. ఇప్పటికే ట్రయల్స్‌లో పాల్గొనేందుకు ఆమెకు హైకోర్టు అనుమతి ఇచ్చిందన్న అత్యున్నత న్యాయస్థానం ఈ దశలో వినేశ్‌ను వెనక్కి వెళ్లమని చెప్పడం సరికాదని వ్యాఖ్యానించింది. ప్రస్తుతానికి ఈ విషయంలో తాము ఏం చేయలేమని ఆమె పోటీల్లో పాల్గొనవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఐతే డబ్ల్యూఎఫ్ఐ పిటిషన్‌పై వినేశ్‌కు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. దీనిపై తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తున్నట్లు కోర్టు తెలిపింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి అంశాలకు పరిష్కారం కోర్టుల్లో కాకుండా వ్యవస్థల్లోనే ఉండాలని అభిప్రాయపడింది. క్రీడాకారులు, అధికారులు, సంస్థల మధ్య సమన్వయం బలంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించింది. "ఇలాంటి విషయాల్లో భావోద్వేగాలు ఎక్కువగా ఉంటాయి. అలాంటి సమయంలో కోర్టులు కూడా జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. సమతుల్యత పాటిస్తూ కఠిన నిర్ణయాలు తీసుకోవాలి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. జస్టిస్ నరసింహ మాట్లాడుతూ, "హైకోర్టు ఇప్పటికే అనుమతి ఇచ్చిన తర్వాత వినేశ్‌లో ఆశలు, అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు ఆమెను ఇంటికి వెళ్లిపోమని చెప్పడం సరైంది కాదు" అని వ్యాఖ్యానించారు. మరోవైపు డబ్ల్యూఎఫ్ఐ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ఏషియన్ గేమ్స్ అధికారులకు మే 14 నాటికే భారత క్రీడాకారుల పేర్లు పంపాల్సి ఉందని అన్నారు. అయితే ఆ గడువు ఇప్పటికే ముగిసిపోయిందని తెలిపారు. ఇది అంతర్జాతీయ సంస్థ పరిధిలో ఉండే అంశమని, భారత కోర్టుల పరిధిలోకి రాదని వాదించారు.అయితే వినేశ్‌కు ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అనుమతి ఇచ్చిన సుప్రీంకోర్టు, ఆమె డోపింగ్ పరీక్షలకు గైర్హాజరు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. 2024 డిసెంబరులో వినేశ్ కొంతకాలం విరామం తీసుకుంటున్నట్లు ప్రకటించిందని ధర్మాసనం గుర్తుచేసింది. అనంతరం 2025 జూలైలో ఆమె తల్లి అయ్యారని, 2026 జనవరి 1 నుంచి తాను తిరిగి అర్హత పొందుతానని డబ్ల్యూఎఫ్ఐకి సమాచారం ఇచ్చిందని తెలిపింది. జనవరిలో నిర్వహించిన డోపింగ్ పరీక్షకు వినేశ్ హాజరు కాలేదని, తాను హరియాణా ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వెళ్లాల్సి వచ్చిందనే ఆమె వివరణను అంతర్జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఐటీఏ) అంగీకరించలేదని ధర్మాసనం పేర్కొంది. వినేశ్ అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో విజయాలు సాధించిన విషయం అంగీకరిస్తూనే, ప్రపంచ స్థాయి నిబంధనలను కూడా తప్పనిసరిగా పాటించాల్సిందేనని జస్టిస్ నరసింహ స్పష్టం చేశారు."డోపింగ్ పరీక్షను మిస్ కావడం చిన్న విషయం కాదు.

# భారత క్రికెట్‌లోకి వైభవ్ సూర్యవంశీ ఆగమనం

దిహేనేళ్ల వయసులో పిల్లలు ఆటపాటలతో కాలం గడుపుతారు. కానీ, ఆ పాలబుగ్గల చిన్నారి మాత్రం ప్రపంచ స్థాయి మేటి బౌలర్లను తన బ్యాట్‌తో చీల్చి చండాడుతున్నాడు. ఐపీఎల్‌లో పరుగుల విధ్వంసం సృష్టిస్తున్న ఈ సంచలన ఆటగాడిపై తాజాగా క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రీడా లోకంలో దావానలంలా వ్యాపించాయి.రాజస్థాన్ రాయల్స్ తరపున బరిలోకి దిగి ఐపీఎల్ 2026 సీజన్‌ను ఊపేస్తున్న వైభవ్ సూర్యవంశీ ఆటతీరుకు యావత్ క్రికెట్ ప్రపంచం ఫిదా అవుతోంది. మొన్నటి ఎలిమినేటర్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టుపై కేవలం 29 బంతుల్లోనే 97 పరుగులు బాది ఈ యువ సంచలనం సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. ప్రపంచంలోనే అత్యుత్తమ కెప్టెన్, బౌలర్ అయిన పాట్ కమిన్స్ సైతం మూడు ప్రత్యేక ప్రణాళికలతో బరిలోకి దిగి కూడా వైభవ్‌ను కట్టడి చేయలేకపోయానంటూ చేతులెత్తేయడం ఈ కుర్రాడి సత్తాకు నిదర్శనం. ఆ మ్యాచ్‌లో క్యాచ్ అవుట్ కాకుండా ఒక్క బౌండరీ కొట్టి ఉంటే, క్రిస్ గేల్ పేరిట ఉన్న మరికొన్ని రికార్డులు కరిగిపోయేవి. ఇప్పటికే ఒకే సీజన్‌లో 65 సిక్సర్లు బాది, గేల్ నెలకొల్పిన 59 సిక్సర్ల రికార్డును ఈ చిచ్చరపిడుగు ఎప్పుడో బద్దలు కొట్టాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో కనీసం అడుగు పెట్టకుండానే, ఐపీఎల్ వేదికగా ప్రపంచంలోని అగ్రశ్రేణి బౌలర్లను వణికిస్తున్న వైభవ్ సూర్యవంశీని తక్షణమే భారత జట్టులోకి తీసుకోవాలంటూ సోషల్ మీడియాలో అభిమానులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఈ తరుణంలో టీం ఇండియా మాజీ దిగ్గజం సునీల్ గవాస్కర్ ఒక సంచలన విషయాన్ని బయటపెట్టాడు. రాబోయే జులై నెలలో ఇంగ్లాండ్ వేదికగా జరిగే టీ20 సిరీస్ ద్వారా వైభవ్ సూర్యవంశీ భారత జట్టులోకి అరంగేట్రం చేయడం ఖాయమని



గవాస్కర్ స్పష్టం చేశాడు. అప్పటివరకు ఈ అద్భుతమైన ఆటగాడిని ప్రత్యర్థి జట్లకు దొరకకుండా బీసీసీఐ ఒక రహస్య ఆయుధంగా దాచిపెడుతోందని గవాస్కర్ పేర్కొనడం గమనార్హం. ప్రస్తుతం టీ20 క్రికెట్‌లో టీం ఇండియా ఎంతో బలంగా ఉంది. ఇలాంటి తరుణంలో వైభవ్ సూర్యవంశీ లాంటి విధ్వంసకర బ్యాటర్ కూడా జట్టులోకి వస్తే ఇక భారత జట్టును ఆపడం ఎవరితరమూ కాదని మాజీలు సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. ఇంగ్లాండ్ జట్టును వారి సొంత గడ్డపైనే మట్టికరిపించేందుకు బీసీసీఐ ఈ వ్యూహాన్ని సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. భారత జట్టు జూలై మాసంలో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. జులై 1వ తేదీ నుంచి జులై 11వ తేదీ వరకు ఇరు జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల భారీ టీ20 సిరీస్ జరగనుంది. ఈ ప్రతిష్టాత్మక సిరీస్ ద్వారానే వైభవ్ బ్లూ జెర్సీలో మైదానంలోకి అడుగుపెట్టబోతున్నాడనే వార్త అభిమానుల్లో ఎనలేని ఉత్సాహాన్ని నింపుతోంది.

# విశ్వేజి



## కోడిగుడ్డుతో లాభాలే, ఈ సమస్యలు ఉన్న వారు తింటే డేంజర్..!!

కోడిగుడ్డు సంపూర్ణ పౌష్టికాహారం. ఆరోగ్య పరంగా మేలు చేస్తుంది. ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. రోజుకు ఒక గుడ్డును తీసుకోవటం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు చెబుతారు. గుడ్డులో కావాల్సిన ప్రొటీన్స్... మినరల్స్ లభ్యం అవుతాయి. గుడ్డుతో పలు రకాల వంటకాలు చేసుకోవటం ద్వారా శరీరానికి కావాల్సిన శక్తి అందుతుంది. అయితే , కొన్ని రకాల సమస్యలు ఉన్న వారు మాత్రం కోడిగుడ్డుకు దూరంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. మరి.. కోడిగుడ్లు ఎవరు తిన కూడదు... నిపుణులు ఏం చెబుతున్నారు.. కోడిగుడ్డు అన్ని వయసుల వారికి పౌష్టికాహారం. మధుమేహం ఉన్న వారు కోడిగుడ్డు తినటం పైన భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. అయితే, షుగరు వ్యాధి గ్రస్తులు తాము చికిత్స తీసుకుంటున్న వైద్యుడి సూచనల మేరకే తీసుకోవటం మంచింది. ఇక.. చర్మ అలర్జీలు ఉన్నవారు కోడిగుడ్డును తీసుకోకపోవటం ఉత్తమమని చెబుతున్నారు. అలర్జీలు ఉన్న వారందరికీ కోడిగుడ్డు రియాక్షన్ కలిగించక పోవచ్చు. కొందరికి మాత్రం సమస్యలు ఉంటాయి. ఇటువంటి వారు కోడిగుడ్డు తిన్న తరువాత వాంతులు, విరేచనాలు అవడం, చర్మంపై దురదలు వంటి లక్షణాలతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కొందరికి కోడిగుడ్లను తిన్న తరువాత కడుపు ఉబ్బరంగా మారుతుంది. సరిగ్గా జీర్ణం అవ్వదు. ఆ తరువాత మలబద్ధక సమస్య ఏర్పడుతుంది. ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటున్న వారు కోడిగుడ్లకు దూరంగా ఉండటం మంచింది. ఇక, మూత్ర పిండాల్లో రాళ్ల సమస్య ఉన్న వారికి కోడిగుడ్డు మంచిది కాదని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. కోడిగుడ్లలో ఉండే క్యాల్షియం కారణంగా కిడ్నీ లో స్టోన్స్ కరిగే గుణాన్ని తగ్గిస్తుంది. మరింత పెంచే అవకాశమూ ఉంటుంది. స్టోన్స్ వచ్చి తగ్గిన వారు లేదా ఆ సమస్యతో ఇంకా బాధ పడుతున్న వారు గుడ్లను తినక పోవటం మంచింది. అదే విధంగా అధిక కొలెస్ట్రాల్‌తో బాధపడుతున్నవారు కూడా కోడిగుడ్లను తినకూడదు. అధికంగా కొలెస్ట్రాల్ ఉంటే శరీరంలో ఎల్‌డీఎల్ పెరిగి.. రక్త నాళాల సమస్యలతో గుండె పైన ప్రభావం పడుతుంది. వీరు వైద్యుల సూచన మేరకే కోడిగుడ్లు తీసుకోవటం మంచింది. గుండె సమస్యలు, హైబీపీ ఉన్నవారు సైతం వైద్యుల సూచనలతోనే వినియోగించాలి. ఇక, రోగ నిరోధక శక్తి బలహీనంగా ఉన్నవారు.. టైపా యిడ్ వంటివి వచ్చిన వారు సైతం కోడి గుడ్డు తినే విషయంలో వైద్యుల సూచన తీసుకోవాలి.

# స్వీట్ కార్న్ తింటున్నారా? ఈ విషయం తెలుసుకోండి!



స్వీట్ కార్న్ (తీపి మొక్కజొన్న) తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఇది కేవలం రుచికరమైన చిరుతిండి మాత్రమే కాదు, అనేక పోషకాలకు నిలయం. ఇందులో కార్బోహైడ్రేట్లు అధికం. ఇవి శరీరానికి తక్షణ, దీర్ఘకాలిక శక్తిని అందిస్తాయి. పీచు పదార్థం కూడా చాలా ఎక్కువ. ఇది జీర్ణక్రియకు చాలా సహాయపడుతుంది. కరిగే ఫైబర్, కరగని ఫైబర్ రెండూ ఉంటాయి. విటమిన్ సి, ఫోలేట్ (విటమిన్ బి9), విటమిన్ బి3 (నియాసిన్), విటమిన్ బి5 (పాంటోథెనిక్ ఆమ్లం), విటమిన్ బి6 ఉంటాయి. విటమిన్ బి12 ఉంటుందికానీ చాలా తక్కువగా ఉంటుంది. ఇది రక్తహీనతను నివారించడంలో సహాయపడుతుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది పొటాషియం, మాంగనీస్, ఫాస్పరస్, ఐరన్, జింక్, మెగ్నీషియం, కాపర్, సెలీనియం వంటి ముఖ్యమైన ఖనిజాలు ఇందులో ఉంటాయి. ఇవి శరీరంలోని అనేక జీవక్రియలకు అవసరం.లైకోపీన్, ల్యూటిన్, జియాక్సంతిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. స్వీట్ కార్న్‌లో ఉండే అధిక ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచడంతోపాటు మలబద్ధకాన్ని నివారిస్తుంది. అలాగే ప్రేగు కదలికలను క్రమబద్ధీకరించడంలో సహాయపడుతుంది. కడుపు సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది. కంటి శుక్లం నుంచి రక్షిస్తాయి దీనిలో ఉండే కెరోటినాయిడ్లు, ముఖ్యంగా ల్యూటిన్, జియాక్సంతిన్, కంటి ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనవి. ఇవి రెటీనాకు హాని కలిగించే ప్రమాదకరమైన నీలి కాంతిని ఫిల్టర్ చేసి, కంటి వ్యాధులైన వయస్సు సంబంధిత మక్యులర్ డీజెనరేషన్, కంటిశుక్లం నుండి కళ్లను రక్షిస్తాయి. ఫైబర్ అధికంగా ఉండటం వల్ల తక్కువ ఆహారంతోనే కడుపు నిండిన భావన కలుగుతుంది. కొవ్వు, కేలరీలు తక్కువగా ఉంటాయి కాబట్టి, బరువు తగ్గాలనుకునేవారి డైట్‌లో ఇది ఒక మంచి ఎంపిక. ఎముకలను బలోపేతం చేస్తాయి స్వీట్ కార్న్‌లో ఉండే విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని అందంగా, కాంతివంతంగా మార్చుతాయి. ఇవి చర్మంపై కొల్లాజెన్ ఉత్పత్తికి తోడ్పడి, చర్మం సాగే గుణానికి సహాయపడతాయి మరియు వృద్ధాప్య ఛాయలను ఆలస్యం చేస్తాయి. ఫాస్పరస్ ఎముకల ఆరోగ్యానికి చాలా సహాయపడుతుంది. పిల్లల్లో ఎముకల పెరుగుదలకు, మరియు వృద్ధుల్లో ఆస్టియోపొరోసిస్ వంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇందులో ఉండే మెగ్నీషియం కండరాలు, ఎముకలకు మంచిది. మధుమేహం ఉన్నవారు స్వీట్ కార్న్ తినవచ్చు, కానీ పరిమిత మోతాదులోనే తినాలి. ఇందులో కార్బోహైడ్రేట్లు, సహజ చక్కెర ఎక్కువగా ఉంటాయి. ఎక్కువగా తింటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి.

# కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే ఈ ఆహారాలు అసలే తినొద్దు!



శరీరంలో మూత్రపిండాలు అత్యంత ముఖ్యమైన అవయవం. ఇవి రక్తాన్ని వడపోసి, వ్యర్థపదార్థాలను మూత్ర రూపంలో బయటకు పంపిస్తూ ఉంటాయి. శరీరంలో ద్రవాల సమతుల్యతను, రక్తపోటును నియంత్రిస్తాయి. ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి సహాయం చేస్తాయి. అటువంటి మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైన ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో మూత్రపిండాల వ్యాధులు బాగా పెరుగుతున్నాయి. మూత్రపిండాల ఆరోగ్యం కోసం మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలి. మన మూత్రపిండాలను ప్రభావితం చేసే వాటిలో, మూత్రపిండాలను పాడు చేసే ఆహారాలలో ఫాస్ట్ ఫుడ్స్ ఒకటి. మూత్రపిండ ఆరోగ్య నిపుణులు ఫాస్ట్ ఫుడ్స్ మూత్రపిండాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తాయని హెచ్చరిస్తున్నారు. బయట విపరీతంగా ఫాస్ట్ ఫుడ్స్ తినడం మూత్రపిండ సంబంధిత ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్నదని చెబుతున్నారు. ఫాస్ట్ ఫుడ్స్ లో అనారోగ్యకరమైన కొవ్వులు, చక్కెరలు ఈ పెరుగుతున్న సమస్యను ఎదుర్కొనేందుకు ప్రజల అవగాహన మరియు ఆహార మార్పుల అవసరాన్ని నిపుణులు పదే పదే గుర్తు చేస్తున్నారు. మన శరీరంలో బయట తినే ఫాస్ట్ ఫుడ్స్ అనారోగ్యకరమైన కొవ్వులను, చక్కెరలను చేరుస్తాయని, ఇవి మూత్రపిండాల పనితీరుకు హాని చేస్తాయని చెబుతున్నారు. నూడిల్స్ ,ఎగ్ ఫ్రైడ్ రైస్, చికెన్ ఫ్రైడ్ రైస్, ప్రాసెస్ చేసిన ఆహారాలు, ప్రాసెస్ చేసిన మీట్ వంటివి ఎక్కువ తినడం కిడ్నీల ఆరోగ్యాన్ని పాడుచేస్తాయి. ప్రాసెస్ చేసిన ఆహారాలకు చెప్పండి నో.. బయట స్ట్రీట్ ఫుడ్స్‌లో ఉపయోగించే ఆయిల్ కూడా మన శరీర ఆరోగ్యాన్ని పాడుచేసి కిడ్నీల పైన ప్రభావాన్ని చూపిస్తుంది. కనుక మూత్రపిండాల ఆరోగ్యం కోసం ఫాస్ట్ ఫుడ్స్ కు, ప్రాసెస్ చేసిన ఫుడ్స్ కు దూరంగా ఉండాలని వైద్య నిపుణులు సలహా ఇస్తున్నారు. ఫాస్ట్ ఫుడ్స్ లో చెడు కొవ్వులు ఎక్కువగా ఉంటాయి. ఇవి ఊబకాయానికి మరియు మధుమేహానికి దారితీయవచ్చు. ఇవి కిడ్నీ వ్యాధికి ప్రధాన కారణంగా మారింది. కిడ్నీల ఆరోగ్యం విషయంలో జాగ్రత్త మూత్రపిండాల ఆరోగ్యం కోసం రోజువారి ఆహారంలో పండ్లు, కూరగాయలు మరియు చిరు ధాన్యాలను చేర్చుకోవాలని సలహా ఇస్తున్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల ద్వారా మూత్రపిండాలను పరిరక్షించుకోవచ్చు అని సూచిస్తున్నారు. ముఖ్యంగా కిడ్నీల ఆరోగ్యం విషయంలో అసలే నిర్లక్ష్యం మంచిది కాదని అంటున్నారు.

# మార్కెట్

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. 158 పెరిగిన సెన్సెక్స్..

దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం లాభాల్లో ముగిశాయి. ఇరాన్-ఇజ్రాయెల్ కాల్పుల విరమణ వార్తలు మార్కెట్‌కు మద్దతునిచ్చాయి. సెన్సెక్స్ 158 పాయింట్లు పెరగగా, నిఫ్టీ 25వేల పాయింట్ల మార్క్‌కు ఎగువన ముగిసింది. చివరలో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో స్వల్పంగా తగ్గాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే 82,534.61 పాయింట్ల వద్ద లాభాల్లో ముగిసింది. ఇంట్రాడేలో 81,900.12 పాయింట్ల కనిష్టానికి తగ్గిన సెన్సెక్స్.. 83,018.16 గరిష్టంగా పాయింట్లకు పెరిగింది. చివరకు 158.32 పాయింట్ల నష్టంతో 82,055.11 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 72.45 పాయింట్లు పెరిగి 25,044.35 పాయింట్లకు చేరుకుంది. నిఫ్టీలో జియో ఫైనాన్సియల్, అదానీ పోర్ట్స్, శ్రీరామ్ ఫైనాన్స్, గ్రాసిమ్, కొటక్ మహీంద్రా, టాటా స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్ అత్యధిక లాభాలను ఆర్జించాయి. ఓఎన్‌జీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ట్రెంట్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎన్టీపీసీ, మారుతి సుజూకీ, హెచ్‌టీసీ, భారత్ ఎలక్ట్రికల్ నష్టాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే పీఎస్‌యూ బ్యాంక్ 1.5 శాతం లాభపడగా.. నిఫ్టీ మెటల్ ఒకశాతం శాతం పెరిగింది. నిఫ్టీ బ్యాంక్, ఆటో, ప్రైవేట్ బ్యాంక్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ కూడా 0.7 శాతం పెరిగాయి. నిఫ్టీ మీడియా ఒకశాతం శాతం పడిపోయాయి.



# భారత వృద్ధిరేటుకు ఊచకోత



ఏడీబీ, ఇండియా రేటింగ్స్ పోటాపోటీగా దేశ జీడీపీకి కత్తెర్లు ఈసారి ఆర్థిక ప్రగతికి గట్టిగానే అమెరికా టారిఫ్‌ల సెగ ఎగుమతులు, పెట్టుబడులు పడిపోతాయన్న అంచనాలు మార్కెట్‌ను వేధిస్తున్న మందగమన పరిస్థితులు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలు భారత ఆర్థిక వృద్ధికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరం దేశ జీడీపీ అంచనాలకు ఏడీబీ, ఇండియా రేటింగ్స్ కోతలు పెట్టాయి. 6.3-6.5 శాతం మధ్యే ఉండొచ్చని ఏడీబీ.. కాదుకాదు 6.3 శాతం దాటదని ఇండియా రేటింగ్స్ పోటాపోటీగా ప్రకటించాయి. మునుపు ఇవే 6.7%, 6.6 శాతంగా అంచనా వేయడం గమనార్హం. న్యూఢిల్లీ, జూలై 23: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) దేశ ఆర్థిక ప్రగతి లక్ష్యాల సాధన అనుకున్నంత ఈజీ కాదని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీల తాజా లెక్కలు చెప్తున్నాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2023-24)తో పోల్చితే గత ఆర్థిక సంవత్సరం (2024-25) భారీగా పడిపోయిన జీడీపీ గణాంకాల్ని.. ఈ ఆర్థిక సంవత్సరం ఎలాగైనా పెంచాలని కేంద్రంలోని మోదీ సర్కారు పట్టుదలతో ఉన్నది. అయితే పోయినసారి మాదిరే ఈసారీ జీడీపీ గణాంకాలుంటాయని, లేకపోతే ఇంకా తగ్గుతాయని, అంతేగానీ పెరగబోవన్న అంచనాలు ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించు కుంటున్నాయి. టారిఫ్‌ల దెబ్బ ఆర్థిక వ్యవస్థ బాగు కోసమైనా.. ప్రపంచ మార్కెట్‌లో తమ ప్రత్యర్థుల దూకుడుకు కళ్లెం వేయడానికైనా.. తమ ఆధిపత్యాన్ని అంగీకరించకపోయినా.. ఇలా దేనికైనా ప్రతీకార సుంకాలనే ఎక్కుపెడుతున్నారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. ఈ టారిఫ్‌ల సెగ రకరకాలుగా భారత్‌కూ తగులుతున్నది. ఈ క్రమంలోనే ఈ ఆర్థిక సంవత్సరం దేశ జీడీపీ అంచనాలకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ), ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇండియా రేటింగ్స్ బుధవారం కోత పెట్టాయి. వచ్చే ఏడాది మార్చి ఆఖరుతో ముగిసే ఆర్థిక సంవత్సరం భారత ఆర్థిక వృద్ధిరేటు 6.3 శాతం నుంచి 6.5 శాతం మధ్యే ఉంటుందని ఏడీబీ అభిప్రాయపడింది. ఇక ఇండియా రేటింగ్స్ 6.3 శాతం దాటకపోవచ్చన్నది. పైగా గతంతో పోల్చితే ఈ అంచనాలు 30-40 బేసిస్ పాయింట్లు తగ్గిపోవడం గమనార్హం. మునుపు ఏడీబీ అంచనా 6.7 శాతంగా, ఇండియా రేటింగ్స్‌ది 6.6 శాతంగా ఉన్నాయి మరి. అమెరికా టారిఫ్‌లతో అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చిత వాతావరణం నెలకొన్నదని, దీనివల్ల భారతీయ ఎగుమతులు, దేశంలోకి వచ్చే పెట్టుబడులు ప్రభావితమయ్యే అవకాశాలున్నాయని ఏడీబీ, ఇండియా రేటింగ్స్ చెప్తున్నాయి. అందుకే దేశ జీడీపీ అంచనాలను తగ్గించినట్టు స్పష్టం చేశా యి. అమెరికాకు వెళ్లే ఎగుమతులపై సుంకా లు పడితే.. వ్యాపార, పారిశ్రామిక రంగాలు ప్రభావితమవుతాయని పేర్కొన్నాయి. ఆర్థిక సర్వేలో..ఈ ఏడాది ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రకటించడానికి ముందు తీసుకొచ్చిన ఆర్థిక సర్వేలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దేశ జీడీపీ 6.3 శాతం నుంచి 6.8 శాతంగా ఉండొచ్చని అంచనా వేశారు. అయితే ప్రస్తుత పరిస్థితులనుబట్టి ఈ స్థాయిలో కూడా దేశ ఆర్థిక వృద్ధిరేటు ఉండకపోవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏడీబీ, ఇండియా రేటింగ్స్ అంచనాలే ఇందుకు నిదర్శనం.

# హౌజింగ్ సేల్స్ ధమాల్..

### ఈ ఏప్రిల్-జూన్‌లో లక్ష యూనిట్లకు దిగువనే అమ్మకాలు?: ప్రాప్‌ఈక్విటీ

### హైదరాబాద్‌లో 20 శాతం పతనం?

న్యూఢిల్లీ : దేశంలోని 9 ప్రధాన నగరాల్లో ఇండ్ల అమ్మకాలు ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అంతంతమాత్రంగానే ఉంటాయని ప్రాప్‌ఈక్విటీ అంచనా వేసింది. తాజా వివరాల ప్రకారం ఈసారి ఓవరాల్‌గా 94,864 యూనిట్ల విక్రయాలకే పరిమితం కావచ్చని తేలింది. గత ఏడాది ఏప్రిల్-జూన్‌లో 1,16,432 యూనిట్ల విక్రయాలు జరుగగా, దానితో పోల్చితే ఇప్పుడు 19 శాతం తగ్గుతాయని తేటతెల్లమవుతున్నది. ఇదే నిజమైతే.. ఒక త్రైమాసికంలో లక్ష ఇండ్లు కూడా అమ్ముడుపోని పరిస్థితి రావడం 14 త్రైమాసికాల్లో ఇదే తొలిసారి. 2021 జూలై-సెప్టెంబర్‌లో లక్షకు దిగువనే హౌజింగ్ సేల్స్ ఉన్నాయి. కాగా, బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, నవీ ముంబై, థానే, పుణె, కోల్‌కతా, చెన్నై నగరాల్లోని హౌజింగ్ సేల్స్‌పై ఈ సర్వే జరిగింది. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో 20 శాతం పడిపోయి 11,815కు పరిమితం కావచ్చని ప్రాప్‌ఈక్విటీ చెప్తున్నది. గత ఏడాది ఏప్రిల్-జూన్‌లో 14,704 యూనిట్ల సేల్స్ ఉన్నట్టు తెలిపింది. ఈ అంచనాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. దీనికి కారణం మోదీ సర్కారేనని దుయ్యబట్టారు. ప్రజల జేబులను ఖాళీ చేశారని, ఇండ్లు కొనుక్కునే పరిస్థితి ఎక్కడుందని మండిపడ్డారు.

# ఆంధ్రప్రదేశ్

## 33 శాతం రిజర్వేషన్లు చారిత్రక నిర్ణయం

**టిడిపి సంస్కరణలకు ఎప్పుడూ ముందుంటుంది**

**హోంమంత్రి వంగలపూడి అనిత**




అమరావతి,మే29 : చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ధైర్యంగా ప్రకటించిన పార్టీ తెదేపా అని మంత్రి వంగలపూడి అనిత అన్నారు. రిజర్వేషన్లపై చట్టం అమల్లోకి రాకపోయినా పార్టీ నిర్ణయం తీసుకుందని చెప్పారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో అనిత మాట్లాడారు. ఎన్టీఆర్ హయాంలో మహిళలకు ఆత్మగౌరవం.. చంద్రబాబు హయాంలో వారి ఆర్థిక గౌరవం పెరిగాయి. కోటి మంది మహిళలతో డ్వాక్రా సంఘాలు విరాజిల్లుతున్నాయి. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అంశం 33 ఏళ్లుగా నానుతోంది. మహానాడును మహిళలకు అంకితం చేస్తున్నట్లుగా స్త్రీశక్తి థీమ్‌తో నిర్వహించారు. మహిళా రిజర్వేషన్లపై చట్టం అమల్లోకి రాకపోయినా పార్టీ నిర్ణయం తీసుకుందని అనిత అన్నారు. పార్లమెంటు చట్టంతో సంబంధం లేకుండా మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నది తమ పార్టీ నిర్ణయమని స్పష్టం చేశారు. లోకేశ్ చేసిన ఈ ప్రతిపాదనపై పార్టీలో మరింత చర్చ చేసి 2029 ఎన్నికలనాటికి తప్పకుండా అమల్లోకి తెస్తామన్నారు. దీనికి అనుగుణంగా నియోజకవర్గాల్లో ఇప్పటి నుంచే మహిళా నాయకత్వాన్ని తయారు చేస్తామని తెలిపారు. 33 శాతం మహిళా రిజర్వేషన్లపై ఇతర పార్టీల నిర్ణయాలపై తాము మాట్లాడమని తెలిపారు.

## ఎట్టకేలకు వట్టిచెరుకూరు గ్రామ సమస్యకు పరిష్కారం

**మంత్రి అనగాని ప్రసాద్ చొరవతో దక్కిన ఊరట**

అమరావతి,మే29 : గుంటూరు జిల్లాలోని వట్టిచెరుకూరు గ్రామ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఏపీ రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో 120 ఏళ్లుగా కొనసాగుతున్న సమస్యకు చెక్ పెట్టారు. సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు అధికారులు సమగ్రంగా పరిశీలించి, శతాబ్ద కాలంగా 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న గ్రామాన్ని ఆ జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో గ్రామంలోని 515 కుటుంబాలకు భారీ ఊరట లభించింది. వివరాల్లోకి వెళితే.. క్రీ.శ.1134 నుంచే వట్టిచెరుకూరు గ్రామం ఉనికిలో ఉన్నట్లు వెల్లడైంది. 1931 నుంచే ఈ ఊరు గ్రామపంచాయతీగా కొనసాగుతూ వస్తోంది. గ్రామస్థులు అప్పటి నుంచే పన్నులు చెల్లిస్తున్నప్పటికీ, 2006లో జరిగిన ఆర్‌ఎస్‌ఆర్ నమోదులో పొరపాటున గ్రామాన్ని 'ఊరి ముందరి చెరువు'గా పేర్కొన్నారు. అనంతరం 2008లో రిజిస్ట్రేషన్ చట్టంలోని 22ఏ(1)(బి) కింద మొత్తం గ్రామాన్ని నిషేధిత జాబితాలో చేర్చారు. దీంతో గ్రామస్థులు తమ భూములను కొనుగోలు, విక్రయాలు చేయలేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామస్థుల వినతిపై స్పందించిన మంత్రి అనగాని సత్యప్రసాద్, సమస్యను ప్రత్యేకంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో గ్రామాన్ని పొరపాటున ఊరి ముందరి చెరువుగా నమోదు చేసినట్లు తేలింది. ప్రస్తుతం అక్కడ ఎలాంటి నీటి వనరులు లేవని నివేదికలో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామ విస్తీర్ణంలో ఉన్న 25.37 ఎకరాలను గ్రామకంఠంగా ప్రకటిస్తూ, నిషేధిత జాబితా నుంచి తొలగించాలని రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. 'ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అనేక రెవెన్యూ సమస్యలను ప్రభుత్వం దశలవారీగా పరిష్కరిస్తోంది. ప్రజలకు న్యాయం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం' అని అన్నారు.

## అత్తను హత్య చేసిన కోడలు అరెస్ట్

అనకాపల్లి,మే29 : అనకాపల్లి జిల్లా చోడవరం మండలం వెంకన్నపాలెం గ్రామంలో అత్త పాసలమ్మను హత్య చేసిన కేసులో నిందితురాలైన కోడలు నాగమణిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు కేసుకు సంబంధించిన వివరాలను అనకాపల్లి ఏఎస్పీ శ్రావణి మీడియాకు వెల్లడించారు. నిందితురాలు వెంకన్న పాలెంలోని తన పుట్టింట్లో ఉండగా అరెస్ట్ చేసినట్లు చెప్పారు. నిందితురాలిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. అత్తను కర్రతో తీవ్రంగా కొట్టి చంపినట్లు ఏఎస్పీ పేర్కొన్నారు.

## శ్రీవాణి టిక్కెట్లలో మార్పులు

**1గంటలోపు బుక్ చేసుకున్న వారికి 4గంటలకు దర్శనం**

తిరుమల,మే29 : భక్తుల సౌకర్యార్థం శ్రీవాణి ట్రస్ట్‌కు సంబంధించిన దర్శన టికెట్ల కేటాయింపులో పలు మార్పులు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి తెలిపింది. శ్రీవాణజ టిక్కెట్లు నేరుగా బుక్ చేసుకున్న వారికి అదేరోజు సాయంత్రం దర్శనం కలగనుంది. ఈ టికెట్లు ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు విడుదల చేస్తారని.. మధ్యాహ్నం 1 గంటలోపు బుక్ చేసుకున్న భక్తులకు అదే రోజు సాయంత్రం 4 గంటలకు దర్శనానికి అనుమతించనున్నట్లు పేర్కొంది. కాగా ఈ విధానం జూన్ 10 నుంచి అమలులోకి రానుంది. ఈ కోటాలో బుకింగ్ కాని టికెట్లను తిరిగి కరెంట్ బుకింగ్ కోటాలో ఇస్తామని పేర్కొంది. ఈ విధానం 2027 మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని తితిదే వెల్లడించింది. ప్రస్తుతం రోజుకు 1500 శ్రీవాణి టికెట్లను తితిదే ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంచుతోంది. వీటిలో 500 దర్శన టికెట్లను మూడు నెలలు ముందుగానే ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ బుకింగ్ కింద అందుబాటులోకి తీసుకొస్తోంది. మరో 200 శ్రీవాణి దర్శన టికెట్లను తిరుపతి విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కింద జారీ చేస్తోంది. ప్రస్తుతం రోజువారీ కరెంట్ బుకింగ్ కోటాలో అందుబాటులో ఉన్న 800 దర్శన టికెట్లలో ఇప్పటికే రూ.10 వేలు విరాళం చెల్లించి దర్శన టికెట్ కోసం వేచి ఉన్న దాతలకు ప్రతిరోజూ 300 టికెట్లు ప్రత్యేకంగా కేటాయించాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

# వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్ల విస్తరణ

**కొత్తగా మరో ఆరు ప్లాంట్ల ఏర్పాటు**

**పురపాలక మంత్రి నారాయణ వెల్లడి**




విజయవాడ,మే29 : ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపాలిటీలను డంపింగ్ యార్డుల రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ప్రస్తుతం విశాఖపట్నం, గుంటూరులో 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్లు ఉన్నాయని, కొత్తగా మరో ఆరు ప్లాంట్లను నెలకొల్పుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ లోగా 107 మున్సిపాలిటీల్లో ఉత్పత్తి అయ్యే చెత్త నిర్వహణ కోసం ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్లాంట్ల ద్వారా ప్రతి రోజూ 5,385 టన్నుల చెత్తను కంపోస్ట్, బయోగ్యాస్‌గా మారుస్తామని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి, ఇబ్రహీంపట్నంలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ పర్యటించారు. కొండపల్లిలో కొత్తగా నిర్మిస్తున్న ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్‌ను పరిశీలించగా, ఇబ్రహీంపట్నంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ఎ÷-లాంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. 'ఏపీ ప్రజల నుంచి గత ప్రభుత్వం చెత్త పన్ను వసూలు చేసింది. అయినా 150 లక్షల టన్నుల చెత్తను వదిలి వెళ్లిపోయింది. ఆ చెత్తను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలగిస్తున్నాం. వచ్చే నెలాఖరు నాటికి అన్ని ఎ÷-లాంట్లు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తాం. ఐదు కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల కోసం ఏపీ ప్రభుత్వం రూ.59.85 కోట్లు మంజూరు చేసింది. రాజమహేంద్రవరం, నెల్లూరు, గుంటూరు, ఒంగోలు, ఇబ్రహీంపట్నంలో నూతన సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. విజయవాడలో ఉన్న ప్లాంట్‌ను కూటమి ప్రభుత్వం రూ.9.45 కోట్లతో ఉన్నతీకరిస్తోంది. మొత్తం ఐదు ప్లాంట్ల ప్రాసెసింగ్ సామర్థ్యం రోజుకు 125 టన్నులు. ప్రతి యూనిట్‌ను రోజుకు 25 టన్నుల సామర్థ్యంతో రూపకల్పన చేశాం. ఒక్కో నూతన ఎ÷-లాంట్‌కు రూ.12.60 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. ఇందుకు కేంద్రం, రాష్ట్రం, పట్టణ స్థానిక సంస్థలు, ప్రైవేట్ డెవలపర్లు నిధులు సమకూర్చనున్నారు. పురపాలక వ్యర్థాలను స్వచ్ఛమైన శక్తిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం. పట్టణ వ్యర్థాల నిర్వహణలో విప్లవాత్మక మార్పు తీసుకొస్తాం. సుస్థిర వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛమైన ఇంధన ఉత్పత్తి దిశగా కీలక అడుగు వేశాం. డంపింగ్ యార్డుల భారాన్ని తగ్గించేందుకు సీబీజీ ఎ÷-లాంట్లు దోహదపడతాయి. పట్టణ ఇంధన భద్రతను బలోపేతం చేసే ప్రాజెక్టుగా సీబీజీ ఎ÷-లాంట్లు ఉపయోగపడతాయి. దీర్ఘకాలిక పర్యావరణ, ఆర్థిక సుస్థిరతకు ఈ ప్రాజెక్ట్ భరోసా ఇస్తుంది. స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో భాగంగా సీబీజీ ఎ÷-లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. వ్యర్థాల నుంచి సంపద సృష్టించడమే కూటమి ప్రభుత్వ విధానం' అని మంత్రి పేర్కొన్నారు.

## పోలవరం అడవుల్లో పులి సంచారం

**అధికారులను అప్రమత్తం చేసిన పవన్**

అమరావతి,మే29 : పోలవరం అడవుల్లో పులి సంచారం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. తిమ్మాపురం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో పులి కదలికలు గుర్తించిన అధికారులు, పులి సమీప గ్రామాల వైపు సంచరిస్తోందని వెల్లడించారు. ఈ విషయంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. పులి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైతే హనుమాన్ ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాలని అధికారులను ఆదేశించారు. మనుషులు, పశువుల ప్రాణాలకు ఎలాంటి హాని కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అటవీ శాఖకు స్పష్టం చేశారు. అవసరమైతే అదనపు హనుమాన్ బృందాలను పంపాలని కూడా సూచించారు. చికిలింత పంచాయతీ పరిధిలోని ఒక పశువుల పాకపై పులి దాడి చేయగా, ఈ ఘటనలో 9 దూడలు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. అలాగే అడవికి సుమారు 300 మీటర్ల దూరంలో ఉన్న ఆయిల్ ఫామ్ తోటలో కూడా పశువులపై దాడి జరిగినట్లు వెల్లడించారు. పులి సంచారంపై ఆధునిక సాంకేతికతతో నిఘా ఏర్పాటు చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. అటవీ సరిహద్దు గ్రామాల్లో నిరంతర అప్రమత్తత కొనసాగించాలని, ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆదేశించారు. మొత్తం ఆపరేషన్‌పై స్వయంగా పర్యవేక్షణ చేయాలని, అవసరమైతే కేంద్ర కార్యాలయం నుంచి సీనియర్ అధికారిని ఘటనాస్థలికి పంపాలని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వన్యప్రాణి సంరక్షణ నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పులి సంచారం ఉన్న గ్రామాల్లో అవగాహన శిబిరాలు నిర్వహించాలని, ప్రజలు అనవసరంగా అడవుల్లోకి వెళ్లకూడదని హెచ్చరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పశువులను అడవి సమీపంలో కట్టివేయకుండా రైతులకు సూచనలు ఇవ్వాలని చెప్పారు. బాధిత రైతులకు తక్షణ పరిహారం అందించామని, త్వరలో పూర్తి పరిహారం చెల్లిస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు.

## బహిరంగ మార్కెట్ ధరలపై నిరంతర సమీక్ష

**ఖరీఫ్ సన్నద్ధతపై వ్యవసాయ, పౌర సరఫరాల శాఖల సమన్వయం**

**వరి రకాల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాలు**

**బహిరంగ మార్కెట్లో ధరల స్థిరీకరణకు చర్యలు**

**సమీక్షలో మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్**

అమరావతి,మే29 : ప్రజలకు నిత్యావసర వస్తువులు అందుబాటు ధరల్లో లభించేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో ధరల మార్పులను నిత్యం సమీక్షిస్తూ, అవసరమైన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ధరల స్థిరీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ 8వ సమావేశం శుక్రవారం సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో మంత్రుల కమిటీ సభ్యులు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ , వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ, పప్పులు, బియ్యం, వంట నూనెలు, టమోటా, ఉల్లిపాయల వంటి నిత్యావసర వస్తువుల డిమాండ్, రిటైల్ హోల్‌సేల్ మార్కెట్ ధరల పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణ ప్రభావంతో కొంతమేర ధరలు పెరిగినా, వాటిని నియంత్రించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉందన్నారు. ముఖ్యంగా దేశవ్యాప్తంగా వంటనూనెల ధరలు పెరిగిన నేపథ్యంలో రాష్ట్రంలో ప్రజలకు అందుబాటు ధరల్లో లభించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఉాబోయే ఖరీఫ్ సీజన్ దృష్ట్యా వ్యవసాయ , పౌర సరఫరాల శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నాయని మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, మనోహర్ తెలిపారు. రైతులు ప్రాధాన్యత కలిగిన వరి వంగడాలను సాగు చేసేలా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. డిమాండ్ తక్కువ ఉన్న వరి రకాల సాగు వల్ల ధాన్యం కొనుగోళ్ల సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా 1010, పీఆర్-126 వంటి రకాలలో అధిక శాతం నూక వస్తుండటంతో వినియోగానికి అనుకూలంగా లేకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని వివరించారు. ఈ అంశంపై క్షేత్రస్థాయిలో రైతులకు పూర్తి అవగాహన కల్పించేలా యంత్రాంగానికి సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. వచ్చే మూడు నెలల్లో ధరలను అదుపులో ఉంచేందుకు అవసరమైన ముందస్తు చర్యలపై అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చామని, మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని మంత్రులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్స్-అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, పౌర సరఫరాల కమిషనర్ కె. కన్నా బాబు, పౌరసరఫరాల కార్పొరేషన్ ఎండీ ఎస్. ఢిల్లీ రావు, ఆయిల్ ఫెడ్ ఎండీ బాలాజీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్ శ్రీనివాసరెడ్డికి ఆస్ట్రేలియా పురస్కారం

అమరావతి,మే29 : ప్రముఖ ఫోటోగ్రాఫర్ టి. శ్రీనివాస రెడ్డి ఆస్ట్రేలియాకు చెందిన ప్రతిష్టాత్మక 'ఆస్ట్రేలియన్ ఫోటోగ్రాఫిక్ సొసైటీ' అత్యున్నత పురస్కారం గౌరవాన్ని కైవసం చేసుకున్నారు. 2026 సంవత్సరానికి గాను ప్రపంచవ్యాప్తంగా ఈ అరుదైన గుర్తింపును ఆయన దక్కించుకున్నారు. ఇద్దరు కళాకారులు పోటీపడగా ఆయనకు ఈ అవార్డు దక్కింది. ఫోటోగ్రఫీ రంగంలో ఆయన సాధించిన విజయాలకు ఈ పురస్కారం మరింత గుర్తింపునిచ్చింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫోటోగ్రాఫిక్ సొసైటీతో తనకు దాదాపు రెండు దశాబ్దాల సుదీర్ఘ అనుబంధం ఉందని అన్నారు. గతంలో తన ప్రతిభను గుర్తిస్తూ 2016లో ఆ సొసైటీ ప్రతిష్టాత్మక 'ఏపీఎస్ ఫెలోషిప్' గౌరవాన్ని అందించిందని తెలిపారు. ఆ గౌరవం దక్కిన పదేళ్ల తర్వాత, ఇప్పుడు అంతకంటే అత్యున్నతమైన 'మాస్టర్' స్థాయిని అందుకున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో లభించిన ఈ గౌరవం తన బాధ్యతను మరింత పెంచిందని, తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే అంతర్జాతీయ వేదికలపై ఎన్నో ప్రతిష్టాత్మక గౌరవాలను సొంతం చేసుకున్న ఆయన తాజా పురస్కారంతో తెలుగువారందరికీ గర్వకారణంగా నిలిచారు.

## పెద్దాపురంలో భారీ ఆన్‌లైన్ మోసం

**పెట్టుబడుల పేరుతో దంపతుల నుంచి 85 లక్షలు స్వాహా**

కాకినాడ,మే29 : పెద్దాపురంలో భారీ ఆన్‌లైన్ మోసం వెలుగులోకి వచ్చింది. స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో సైబర్ కేటుగాడు ఒక దంపతుల నుంచి రూ. 85 లక్షలు స్వాహా చేసిన ఘటన కలకలం రేపింది. పెద్దాపురం వర్జుల వారి వీధికి చెందిన సురే వేణు దంపతులను సైబర్ కేటుగాడు లక్షల్లో మోసం చేశాడు. తాను ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ లిమిటెడ్ మేనేజర్ అని నమ్మబలికి, 3 నెలల్లో 300 శాతం లాభాలు ఇస్తామని వాట్సాప్ సందేశాలతో వల వేసాడు. ఆ కేటుగాడి మాటలు నమ్మిన వేణు, ఆయన భార్య మహాలక్ష్మి వాట్సాప్ గ్రూప్‌లో చేరారు. యూజర్ ఐడి 4673 ద్వారా విడతల వారీగా మొత్తం రూ. 85 లక్షలు డిపాజిట్ చేశారు. ర్వాత డబ్బు విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా అకౌంట్ బ్లాక్ అయినట్లు బాధితులు తెలిపారు. అనంతరం నిందితుడు స్పందించకపోవడంతో అనుమానం కలిగిందన్నారు. తాము మోసపోయామని గ్రహించిన సురే వేణు.. పెద్దాపురం పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## సాధారణ పిఎ ఖాతాల్లోకి కోట్లు ఎలా వచ్చాయి

**లిక్కర్ స్కామ్ దోపిడీలో వేళ్లన్నీ తాడేపల్లి ప్యాలెస్ వైపే**

**స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభిరామ్ విమర్శ**

అమరావతి,మే29 : లిక్కర్ స్కామ్‌లో వైసీపీ నేతలు కోట్ల రూపాయిలు దోచుకున్నారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభిరామ్ విమర్శించారు. ఓ సాధారణ పీఏ కేఎన్ఆర్ ఖాతాలోకి అన్ని కోట్లు ఎలా వచ్చాయి? అని పట్టాభిరామ్ ప్రశ్నించారు. అలాగే బెంగళూరుతో సహా పలు ప్రాంతాల్లో అతడికి ప్లాట్లు ఎలా వచ్చాయని సందేహం వ్యక్తం చేశారు. జగన్ పీఏకు మూడు రాష్ట్రాల్లో ఆస్తులున్నాయని పట్టాభిరామ్ తెలిపారు. ఈ స్కామ్‌లో వేళ్లన్నీ తాడేపల్లి పెత్తందారుల వైపే చూపిస్తున్నాయని మండిపడ్డారు. గొడ్డలి పార్టీకి పి4 పథకం ఉందన్నారు. అవే.. పవర్, ప్రాపర్టీ, పైసా, పార్ట్‌నర్షిప్‌లని వ్యంగ్యంగా అన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని జేబులు నింపుకో వడమే గొడ్డలి పార్టీ ఖ4 లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం కె.పట్టాభిరామ్ మాట్లాడుతూ.. 2019-24 మధ్య వైఎస్ జగన్ పీఏ కె.నాగేశ్వర్ రెడ్డి (కేఎన్ఆర్) భార్య ఖాతాలోకి రూ.20 కోట్లు వచ్చాయని ఆరోపించారు. ఏపీలో సంచలనం సృష్టించిన లిక్కర్ స్కామ్ వ్యవహారంలో వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ పీఏ కేఎన్ఆర్‌ను సిట్ అధికారులు ప్రశ్నించారు. సిట్ కార్యాలయంలో గురువారం ఉదయం 11.00 గంటలకు ప్రారంభమైన ఈ విచారణ రాత్రి వరకు కొనసాగింది. బుధవారం కూడా కేఎన్ఆర్‌ను సిట్ అధికా రులు విచారించారు. ఈ సందర్భంగా సిట్ అధికారులకు కేఎన్ఆర్ పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు సమాచారం. 2019కి ముందు కేఎన్ఆర్ సాధారణ జీవితాన్ని గడిపారు. అయితే 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం హయాంలో అతడు వందల కోట్ల రూపాయిలకు అధిపతిగా మారినట్లు సిట్ గుర్తించింది. ఈ సందర్భంగా అతడి ఆస్తుల వివరాలతోపాటు కాల్‌డేటా ఆధారంగా సిట్ అధికారులు విచారణ చేపట్టారు.

## నాగేశ్వర్‌పై పెట్టిన కేసులు ఎత్తేయాలి

**ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ డిమాండ్**

విశాఖపట్నం,మే29 : ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేషకులు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ పై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, వాక్ స్వాతంత్ర్యాన్ని కాపాడాలని కోరుతూ. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజెఎఫ్) విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. మీడియా స్వేచ్ఛను హరించవద్దని నినాదాలు చేశారు. తొలుత గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ కార్యవర్గ సభ్యులు కె.అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రొఫెసర్ నాగేశ్వర్ అనేక అంశాలపై విశ్లేషణలు చేస్తూ ఉంటారని, ఇటీవల ఆయన చేసిన ఓ వ్యాఖ్యను ఆధారంగా చేసుకుని ఆయనను కొందరు వ్యక్తిత్వ హననానికి పాల్పడడం శోచనీయమన్నారు. ఆయనపై సోషల్ మీడియాలో అసభ్యకర, పోస్టులు పెట్టడం మానుకోవాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్య హక్కును కాలరాసే అధికారం ఎవరికీ లేదన్నారు. ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నట్టు ప్రకటించినప్పటికీ ఆయనపై బెదిరింపులకు దిగడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు ఎన్.మధు, మదన్, ఈశ్వరరావు, రవిశంకర్, కె.రాజేష్, సతీష్, వరప్రసాద్, భాగ్యరాజ్, శివరామకృష్ణ, చిన్నా, సంతోష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.





# క్రైమ్ థ్రిల్లర్‌గా మరీచిక

సంజయ్ అలియాస్ సంజు (విరాజ్ అశ్విన్) ఓ కెఫేని నిర్వహిస్తుంటాడు. అతణ్ని వెంకట లక్ష్మి (అనుపమ పరమేశ్వరన్) ప్రేమిస్తుంది. ఎప్పుడూ అతని కెఫే చుట్టూ తిరుగుతుంటుంది కానీ, తన మనసులోని ప్రేమని మాత్రం వ్యక్తం చేయలేక సతమతమవుతుంది. ఇంతలో వెంకట లక్ష్మికి లండన్ నుంచి వచ్చిన మరీచిక (రెజీనా కసండ్రా) పరిచయమవుతుంది. వెంకటలక్ష్మి కారణంగానే సంజుకి పరిచయం అవుతుంది మరీచిక. ఆ ఇద్దరి మధ్య తక్కువ సమయంలోనే సాన్నిహిత్యం పెరుగుతుంది. ఒకరినొకరు ప్రేమించుకుంటారు. ఊహించని రీతిలో ఆ ఇద్దరి ప్రేమకు వెంకటలక్ష్మి కూడా సాయం చేస్తుంది. కానీ, అంతలోనే సంజుని మరీచిక దారుణంగా చంపేస్తుంది. కళ్లారా ఆ హత్యని చూసిన వెంకటలక్ష్మి పోలీస్‌స్టేషన్‌కి చేరుకుని ఫిర్యాదు చేస్తుంది. అసలింతకీ ప్రేమించిన సంజుని మరీచిక ఎందుకు హత్య చేసింది? అసలు మరీచిక ఎవరు? సంజుపై ఉన్న ప్రేమతో వెంకటలక్ష్మి ఏం చేసింది? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవల్సిందే. ప్రేమ, ద్రోహం, ప్రతీకారంతో ముడిపడిన కథ ఇది. పేరుకు తగ్గట్టే ఎండమావుల్ని గుర్తు చేస్తుంటాయి ఇందులోని సంఘటనలు, పాత్రలన్నీ! సున్నితమైన ఓ ముక్కోణపు ప్రేమకథలా ప్రారంభమయ్యే సినిమా ఆ తర్వాత అనూహ్యమైన మలుపులతో ఓ క్రైమ్ థ్రిల్లర్‌గా మారిపోతుంది. ప్రధానమైన మూడు పాత్రలూ ఏది నిజం, ఏది అబద్ధం అనే ఉత్కంఠని రేకెత్తిస్తాయి. ఓ థ్రిల్లర్ కథని ప్రేమతో ముడిపెడుతూ రాసుకున్న తీరు ఆసక్తికరంగానే అనిపిస్తుంది. తెరపైన కథ చెప్పే విధానంలో ఎప్పటికప్పుడు మెరుపు వేగంతో మార్పులు చోటు చేసుకుంటాయి. కానీ, ఆ విషయంలో దర్శకుడు పాత పద్ధతుల్నే అనుసరించినట్టు ఈ సినిమా రుజువు చేస్తుంది. ఎ÷-లాష్‌బ్యాక్‌లో వెంకటలక్ష్మి పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేసేవరకూ కథ ఊపందుకోదు. అప్పటివరకూ సన్నివేశాలు ఎలాంటి అనుభూతిని పంచకుండా అలా సాగుతూనే ఉంటాయి. హాస్యం, ప్రేమకథల్లోని సంఘర్షణ, కెమిస్ట్రీ తెరపై కనిపించవు. విరామ సన్నివేశాల నుంచే సినిమా కాస్త ఆసక్తిని రేకెత్తిస్తుంది. ద్వితీయార్ధంలో వచ్చే మలుపులు సినిమాకి ప్రధాన ఆకర్షణ. అసలేది నిజమనే ఉత్సుకత రేకెత్తిస్తుంది. దర్శకుడు లాజిక్స్ గురించి పట్టించుకోనేలేదు. ఫిర్యాదు చేయడానికి వెళ్లిన వ్యక్తులు ఏ కథ చెబితే అది పోలీసులు విని అక్కడిక్కడికే కేసుపై ఓ నిర్ణయానికొచ్చేస్తుంటారు. ఆ కేసులో ఉన్న వ్యక్తుల్ని, పరిసరాల్ని కనీసం ఆరా తీయడం కానీ, వివరాలు తెలుసుకోవడం కానీ కనిపించదు. దాంతో తెరపై జరిగే తతంగం అంతా నాటకీయంగానే అనిపిస్తుంది . మొత్తంగా ఈ కథలో థ్రిల్ ఉంది కానీ, తెరపైకి దాన్ని ఇంకాస్త బలంగా చూపించివుంటే బాగుండేది.


# జాసన్ సంజయ్ దర్శకుడిగా సిగ్మా


తమిళనాడు సీఎం, తమిళగ వెట్రి కజగం పార్టీ అధినేత విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న మొదటి సినిమా 'సిగ్మా' విడుదల తేదీ తాజాగా ఖరారైంది. వైవిధ్యమైన పాత్రలతో మెప్పిస్తున్న టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ మరియు ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ హై-ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం జులై 31న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలోకి రానుంది. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఎ. సుబాస్కరన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ మైండ్ గేమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తుండగా, ప్రవీణ్ కె.ఎల్. ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మనం కోల్పోయిన దాన్ని తిరిగి అదే స్థానంలో వెతుక్కోవడం, దానికోసం ఎంత మూల్యం చెల్లించాల్సి వచ్చింది అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్ చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని చిత్ర యూనిట్ పేర్కొంది. కెనడాలోని టొరంటో ఫిల్మ్ స్కూల్‌లో ఫిల్మ్ మేకింగ్ కోర్స్ మరియు లండన్‌లో స్క్రీన్‌రైటింగ్ పూర్తి చేసిన జాసన్ సంజయ్, తన తండ్రి స్టార్ ఇమేజ్‌తో సంబంధం లేకుండా ఒక వైవిధ్యమైన కథాంశంతో మెగా ఫోన్ పట్టడం పరిశ్రమలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర టీజర్ మరియు పోస్టర్లు సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్ తెలుగు మరియు తమిళ భాషల్లో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు రానుంది.




## పెద్దిలో అప్పలసూరిగా జగపతిబాబు

అప్పలసూరిగా 'పెద్ది'లో తన నటనతో ఆకట్టుకునేందుకు సిద్ధమయ్యారు నటుడు జగపతి బాబు . రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జగపతిబాబు తన కెరీర్ గురించి మాట్లాడారు. మన కష్టానికి తగిన ఫలితం కచ్చితంగా లభిస్తుందన్నారు. సినిమా రంగంలో ఉన్నంత ఆనందం నాకు ఇంక ఎందులోనూ కనిపించదు. ఇందులో ఏదైనా సాధ్యమవుతుంది. సహజంగా నా జీవితంలో ప్రతిదీ ఆలస్యంగా వస్తుంది. కెరీర్‌లో కూడా మొదట ప్లాప్‌ల నుంచి హిట్‌లకు వచ్చాను. అందుకే పరాజయాలను పెద్దగా పట్టించుకోను. ఏదో ఒకరోజు విజయం తప్పక వస్తుంది నమ్ముతా. జీవితం మన అంచనాలకు అందదు. తర్వాత ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదు. కానీ, ప్రతి ఒక్కరికి కష్టాలు కామన్‌గా ఉంటాయి. నేనూ ఎన్నో కష్టాలు పడ్డాను. ఇలా జరిగిందేంటని ఎప్పుడూ బాధపడలేదు. వాటి నుంచి ఏదో కొత్త పాఠం నేర్చుకున్నాను. కష్టానికి తగిన ప్రతిఫలం వస్తుందని ఎప్పుడూ నమ్ముతాను. బాధ వెనక సంతోషం కచ్చితంగా ఉంటుంది. నేను 2011 నుంచి 2013 వరకు ఎంతో బాధ అనుభవించా. దానికి తగిన సంతోషం ఇప్పుడు వచ్చింది. నా టైమ్ ఇప్పుడు స్టార్ట్ అయింది అనుకుంటున్నా అని జగపతి బాబు అన్నారు. సినిమాల విషయంలో ఎప్పుడూ ఒత్తిడికి గురి కాలేదని జగపతి బాబు ఈ సందర్భంగా తెలిపారు. ఫ్యామిలీ ఇష్యూ కాకుండా ఇంకా దేనిని పెద్ద సమస్యగా తీసుకోనని అన్నారు. 'పెద్ది'లో తనకు, రామ్ చరణ్‌కు మధ్య ఉండే బంధం అందరికీ నచ్చుతుందన్నారు. చరణ్ అన్ని సినిమాలకు కష్టపడతారని.. ఈ చిత్రంలో శరీరాకృతిని మార్చుకోవడం కోసం మరింత ఎక్కువ శ్రమించారని చెప్పారు.




## పెద్దిపై అసత్య ప్రచారం

### ఇద్దరు వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు

'పెద్ది'పై అసత్య ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలతో ఇద్దరిపై కేసు నమోదైనట్లు సమాచారం. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ సినిమా విషయంలో టీమ్ చాలా జాగ్రత్తలు తీసుకుంటోంది. తాజాగా దీనిపై ఆన్‌లైన్ వేదికగా అసత్య ప్రచారం చేస్తోన్న ఇద్దరి వ్యక్తులను గుర్తించి వారిపై ఫిర్యాదు చేసింది. గుంటూరు, హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువకులు 'పెద్ది'పై ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో నెగెటివిటీ క్రియేట్ చేస్తున్నట్లు టీమ్ దృష్టికి వచ్చింది. దీంతో ఆధారాలను సేకరించిన చిత్రబృందం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికే చిత్ర నిర్మాతలు ఈ సినిమాకు సంబంధించిన సన్నివేశాలు లీక్ కాకుండా జాగ్రత్తలు తీసుకున్న విషయం తెలిసిందే. సినిమా కాపీరైట్‌కు సంబంధించి చిత్ర నిర్మాణ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన మద్రాసు హైకోర్టు వెకేషన్ బెంచ్ తాజాగా మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఈ సినిమాకు సంబంధించిన సన్నివేశాలు, పాటలు ఇంటర్నెట్‌లో అక్రమంగా అప్‌లోడ్ చేయడం, ప్రసారం చేయడం, కాపీ చేయడాన్ని నిరోధిస్తూ న్యాయస్థానం ఈ ఆదేశాలిచ్చింది. దీంతో ముందస్తు లీక్‌లు కాకుండా చర్యలు చేపట్టినట్లు అయింది. ఇప్పుడు ఇలా సోషల్ మీడియాలోనూ చిత్రబృందం యాక్టివ్‌గా ఉంటూ నిశితంగా పరిశీలించి నెగెటివిటీ రాకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో ఫ్యాన్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది




# దేవిశ్రీతో ప్రయాణం ముగిసినట్లేనా?

టాలీవుడ్ దర్శకుడు సుకుమార్- సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ కాంబినేషన్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 'ఆర్య'తో మొదలైన వీరి ప్రయాణం 'రంగస్థలం', 'పుష్ప' వంటి ఇండస్ట్రీ హిట్స్ వరకు చేరి తెలుగు సినీ పరిశ్రమలో ఓ ప్రత్యేకమైన ముద్ర వేసింది. సుకుమార్ సినిమాలకు దేవిశ్రీ ఇచ్చిన సంగీతం అనేక సందర్భాల్లో సినిమాకే హైలైట్‌గా నిలిచింది. అందుకే ఈ కాంబోకు అభిమానుల్లో ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఏర్పడింది. ఇప్పటివరకు తన సినీ కెరీర్‌లో సుకుమార్ పూర్తి స్థాయిలో దేవిశ్రీ ప్రసాద్‌తోనే ప్రయాణించడం విశేషం. వీరిద్దరి మధ్య ఉన్న అండర్‌స్టాండింగ్, కథను సంగీతంతో మరింత ఎమోషనల్‌గా ఎలివేట్ చేసే తీరు ప్రేక్షకులను ఎప్పటికప్పుడు ఆకట్టుకుంది. అయితే ఇటీవల కాలంలో ఈ క్రేజీ కాంబినేషన్‌కు బ్రేక్ పడే అవకాశాలున్నాయంటూ ఫిలిం నగర్‌లో జోరుగా చర్చ సాగుతోంది. ముఖ్యంగా 'పుష్ప-2' నిర్మాణ సమయంలో ఇద్దరి మధ్య కొన్ని విభేదాలు తలెత్తినట్లు ప్రచారం జరిగింది. సినిమాలోని కొన్ని కీలక సన్నివేశాలకు దేవిశ్రీ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ విషయంలో సుకుమార్ పూర్తిగా సంతృప్తి చెందలేదని, అందుకే కొన్ని భాగాలకు ఇతర సంగీత దర్శకుల సహాయం తీసుకున్నారనే టాక్ ఇండస్ట్రీలో వినిపించింది. ఈ పరిణామం దేవిశ్రీ ప్రసాద్‌ను అసంతృప్తికి గురిచేసిందని, ఆ బాధను ఆయన ఓ ఈవెంట్‌లో పరోక్షంగా వ్యక్తం చేశారనే చర్చ కూడా జరిగింది. ఇప్పుడు అదే చర్చ మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా సుకుమార్ తెరకెక్కించబోయే తదుపరి భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు దేవిశ్రీ ప్రసాద్ స్థానంలో కొత్త సంగీత దర్శకుడిని తీసుకోబోతున్నారనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇదే సమయంలో దేవిశ్రీ ప్రసాద్ 'ఎల్లమ్మ' సినిమాతో హీరోగా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించబోతుండటం కూడా ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చింది. అంతేకాదు, పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రానికి దేవిశ్రీ పూర్తి స్థాయిలో సంగీతం అందించలేకపోయారని, అందుకే ఆ బాధ్యతలను థమన్‌కు అప్పగించారనే ప్రచారం కూడా ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ఒకప్పుడు వరుసగా దేవిశ్రీతో పనిచేసిన పలువురు స్టార్ దర్శకులు ఇప్పుడు ఇతర సంగీత దర్శకుల వైపు మొగ్గు చూపుతుండటంతో.. సుకుమార్ కూడా అదే దారిలో వెళ్తారా అనే ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం రామ్ చరణ్ - సుకుమార్ సినిమా ఇంకా స్క్రిప్ట్ దశలోనే ఉందని సమాచారం. కథ పూర్తిగా సిద్ధం కాకముందే సంగీత దర్శకుడిని ఫైనల్ చేసే పరిస్థితి లేదని తెలుస్తోంది.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com